thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 361 | కరీంనగర్ శనివారం, 8 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌కు అప్పగించొద్దు.. చిత్రవధ చేస్తారు

### అమెరికా సుప్రీంకోర్టులో తహవూర్ రాణా పిటిషన్

న్యూఢిల్లీ : దేశాన్ని కుదిపేసిన 26/11 ముంబై దాడుల కేసులో కీలక సూత్రధారి తహవూర్ రాణా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు పంపిస్తే అక్కడ తనను చిత్రహింసలు పెడతారని ఆరోపించాడు. తన అప్పగింతపై తక్షణమే స్టే విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. రాణాను భారత్‌కు అప్పగించేందుకు తమ ప్రభుత్వం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యాయస్థానంలో పిటిషన్ వేసిన రాణా.. తాను పాకిస్థాన్ సంతతికి చెందిన ముస్లింనని, గతంలో పాక్ ఆర్మీలో పనిచేశానని.. తన గుర్తింపు కారణంగా భారత్‌లో తనను చిత్రవధ చేస్తారని ఆరోపించాడు. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తాను అక్కడ చనిపోవచ్చని పేర్కొన్నాడు. కాగా, ఇటీవల ఆయన దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.



చురకలు

శనివారం 8 మార్చి 2025



## నేడు ప్రజా భవన్‌లో అన్ని పార్టీల ఎంపీల సమావేశం..

హైదరాబాద్ : శనివారం ప్రజా భవన్‌లో అన్ని పార్టీల ఎంపీల సమావేశం జరగనుంది. కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

డిప్యూటీ సీఎం అధ్యక్షతన భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్ లో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించనున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎంపీలు రాష్ట్రం పక్షాన పార్లమెంట్‌లో, కేంద్ర ప్రభుత్వం వద్ద మాట్లాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరిని శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.




చేర్యాల : చేర్యాల ప్రాంత రైతుల నీటి కష్టాలు తీర్చాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి రంగనాయకసాగర్ డీ-10 కెనాల్ నుంచి కమాలాయపల్లి, అర్జునపట్ల, ఆకునూరు, జాలపల్లి, లింగాపూర్, ధూల్మిట్ట గ్రామాలకు సాగునీరు అందించాలని కోరారు. గండిరామవరం రిజర్వాయర్ ద్వారా బయ్యన్న చెరువు నుంచి కొండాపూర్ గ్రామానికి సాగునీరు అందించాలని, చేర్యాల పెద్దచెరువునింపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి సిద్దిపేట, వరంగల్ సీఈలు హరిరాం, శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసి సాగునీరు విడుదల చేయాలని ఆదేశించించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్ రెడ్డి, నర్సింగరావు, కమలాకర్ యాదవ్, కుమార్, నర్సింలు, జగ్గారెడ్డి, నాగరాజం, చోటేమియా, బాబు, యాదగిరి, నర్సింహులు, కనకయ్యా, ఐలయ్య, శ్రీనివాస్, అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు అయింది. ఈ నెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

సీఎం రేవంత్ అధ్యక్షతన నిన్న కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27 వరకు సమావేశాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కేబినెట్ సమావేశం నిర్ణయం తీసుకున్నారట. ఉగాది నుంచి భూభారతి అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఫ్యూచర్ సిటీ కోసం కొత్త బోర్డు ఏర్పాటు చేశారు. నదీ జలాల అంశంపై ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ పోస్టులు భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సర్కార్. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 217 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది రేవంత్ రెడ్డి సర్కార్.




## నేడు పరేడ్ గ్రౌండ్‌లో ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 విడుదల

హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా రేపు పరేడ్ గ్రౌండ్ వేదికగా ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మహిళా స్వయం సహాయక బృందాల విజయాలతో పాటు భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశిస్తూ ఇందిరా మహిళ శక్తి మిషన్ - 2025.. మహిళల ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన, సంపద సృష్టిపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఐకమత్యమే మహాబలం అనే నానుడిని నిజం చేసేలా ఒకే గొడుగు కిందకు గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలు రానున్నాయి. స్వయం సహాయక సంఘాల పరిధిని విస్తృత పరిచేలా సభ్యుల అర్హత వయసు పెంచనున్నారు. కిశోర బాలికలు, వయోవృద్ధుల ఆర్థిక భద్రత, సామాజిక మద్దతు కోసం నూతన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయననున్నారు. సభ్యుల కనీస వయస్సు 18 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గింపుతో పాటు గరిష్ట వయసు 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేశారు.

**ఇక, ఈ ఏడాది సాధించిన విజయాలు..** మహిళా సంఘాలకు రూ. 21,632 కోట్ల రుణాలు, 2,25,110 సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటు, రూ. 110 కోట్లతో 22 జిల్లాల్లో చురుకుగా ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం, రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, గ్రామీణ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్ తో అనుసంధానించడం కోసం మాదాపూర్ లోనీ శిల్పారామంలో రూ. 9 కోట్లతో ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం, మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫామ్ కుట్టే పనిని అప్పగించడం ద్వారా రూ. 30 కోట్ల ఆదాయం,

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు. అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఇప్పటికే రూ. 634 కోట్ల విలువగల 23,701 పనులు, మహిళా సంఘ సభ్యులకు రెండు లక్షల రుణ బీమా, 10 లక్షల ప్రమాద బీమా, 400 మందికి రూ. 40 కోట్ల ప్రమాద బీమా చెల్లింపు, 32 జిల్లాల్లో అందుబాటులోకి 32 మొబైల్ ఫిష్ రిటైల్ ట్రక్కులు, ప్రతి ట్రక్కుపై ఆరు లక్షల సబ్సిడీ, మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి ఏర్పాట్లు, మహిళా సంఘాల ద్వారా 600 ఆర్టిసి అద్దె బస్సుల నిర్వహణ, 32 జిల్లాల్లో మహిళా సమాఖ్యల పెట్రోల్ బంకులు, తెలంగాణ మహిళా శక్తికి మరింత ఊతమిచ్చేలా ఇందిరా మహిళ శక్తి మిషన్ - 2025.




హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. మొత్తం 21 మందికి ప్రభుత్వం స్థాన కల్పించింది. ఈ మేరకు శుక్రవారం సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌ఫర్ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు ఉన్నారు. అలాగే.. ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు సైతం బదిలీ అయ్యారు. మిగిలిన 14 మంది ఎస్పీలు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వం ఒకేసారి 21 మంది ఐపీఎస్‌లను ట్రాన్స్ ఫర్ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**అధికారుల బదిలీలు, పోస్టింగ్స్:** ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూ శర్మ, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్, సీఐడీ ఐజీగా ఎం. శ్రీనివాసులు, నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య, రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఝా, వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్, సీఐడీ ఎస్పీగా సి. రవీందర్, కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర, ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్, కరీంనగర్ సీపీగా గౌస్ ఆలం, భువనగిరి డీసీపీగా అక్షాన్స్ యాదవ్, సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, సిరిసిల్ల ఎస్పీగా గీతే మహేశ్ బాబా సాహెబ్, సంగారెడ్డి ఎస్పీగా పంకజ్ పరితోష్, వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్, పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్, సూర్యాపేట ఎస్పీగా నరసింహ, మంచిర్యాల డీసీపీగా భాస్కర్, SIB ఎస్పీగా వై.సాయిశేఖర్, అడిషనల్ డీజీపీ (పర్సనల్)గా అనిల్‌కుమార్, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీగా చేతన.

## ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక: ఎంపీ లక్ష్మణ్

దిల్లీ: ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస అనేది గత చరిత్ర అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా ఎదిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీలో పెట్టిన ఏకైక పార్టీ తమదని చెప్పారు.



10 సంవత్సరాలు అధికారంలో ఉన్న భారాసకు అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసగించిందని విమర్శించారు. ప్రజలను ఆర్థికంగా శక్తిమంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు.

## పాలమూరు-రంగారెడ్డిపై నాగం జనార్దన్ పిటిషన్.. సుప్రీంకోర్టులో విచారణ

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని.. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత ఏడాది డిసెంబరులో బీహెచ్‌ఈఎల్ అఫిడవిట్ దాఖలు చేసింది. ఎత్తిపోతల పథకానికి సంబంధించి సరఫరా చేసిన యంత్రాలు, తమకు వచ్చిన బిల్లుల వివరాలను అఫిడవిట్‌లో పేర్కొంది. బీహెచ్‌ఈఎల్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలు తాము చేసిన ఆరోపణలను నిజం చేస్తున్నాయని నాగం తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ టెండర్‌లో మూడో వంతు కూడా బీహెచ్‌ఈఎల్‌కు చెల్లించలేదని అఫిడవిట్‌లో చెప్పిన అంశాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. బీహెచ్‌ఈఎల్ దాఖలు చేసిన అఫిడవిట్, దానికి నాగం జనార్దన్ ఫైల్ చేసిన రిజాయిండర్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. అయితే, ఈ వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో మూడు పిటిషన్లు కొట్టివేశారని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని మేఘా సంస్థ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్రమాలు జరిగాయని స్పష్టంగా కనిపిస్తున్నందున వెంటనే దర్యాప్తునకు ఆదేశించాలని నాగం తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ న్యాయస్థానాన్ని కోరారు. సవివరంగా వాదనలు విన్న తరువాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మే 13 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది.

## పెంచాల్సిన వేతనాలు తగ్గించడమా.. ఇదేం పాలన?: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఇదేం పాలన అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంటని అడిగారు. "ఉద్యోగులకు డీఏలు ఇవ్వరు.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా? డ్రైవర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు 25 శాతానికి పైగా వేతనాలు తగ్గించడం దుర్మార్గం? ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్య. నాలుగేళ్లుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎందుకు పెంచడం లేదు? ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా తీరు మారదా? తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచండి" అని బండి సంజయ్ అన్నారు.



## కేసీఆర్‌తో భేటీలో ఆ విషయం మాట్లాడు.. కవితకు ఎంపీ రఘునందన్ మాస్ సవాల్

సిద్దిపేట: బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు. గజ్వేల్ పట్టణంలో ఇవాళ(శుక్రవారం) మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌తో మాట్లాడి పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీకి ఇప్పించాలని సవాల్ విసిరారు. శాసనసభలో పార్టీ ప్రతిపక్ష నాయకుడిని బీసీ నేతకు ఇవ్వండి. శాసన మండలిలో కూడా మరో బీసీ నేతకు ఇవ్వాలని ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన నాలుగు మంత్రి పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వరని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీల్లో పెద్ద సామాజిక వర్గానికి చెందిన ఈటెలను మధ్యలోనే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు కావాలి.. మరి బీసీలకు పదవులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు ఫామ్‌హౌస్ చర్చలో కేసీఆర్‌తో తాను చెప్పిన విషయంపై కవిత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవకాశం వస్తే బీజేపీలో ఒక మహిళకు ఇచ్చామని గుర్తుచేశారు. మొదటి ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని ఒకే ఒక కేబినెట్ ఈ దేశంలో ఏదైనా ఉంటే అది కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. బీజేపీని విమర్శించే ముందుగా బీఆర్ఎస్ చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పారు. బీజేపీ వైపు వేలెత్తి చూపించే బదులు ముందుగా బీఆర్ఎస్ నేతలు తప్పులు సరిదిద్దుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు.




గుంటూరు నగరవాసులను ఇబ్బంది పెడుతున్న ట్రాఫిక్ పద్మవ్యూహానికి పోలీసులు డ్రోన్ వినియోగంతో చెక్ పెడుతున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సహా నేరాల కట్టడికి.. డ్రోన్ల గస్తీతో పరిష్కారం చూపుతున్నారు.

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 361 కరీంనగర్ శనివారం, 8 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌కు అప్పగించొద్దు.. చిత్రవధ చేస్తారు

### అమెరికా సుప్రీంకోర్టులో తహవూర్ రాణా పిటిషన్

న్యూఢిల్లీ : దేశాన్ని కుదిపేసిన 26/11 ముంబై దాడుల కేసులో కీలక సూత్రధారి తహవూర్ రాణా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు పంపిస్తే అక్కడ తనను చిత్రహింసలు పెడతారని ఆరోపించాడు. తన అప్పగింతపై తక్షణమే స్టే విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. రాణాను భారత్‌కు అప్పగించేందుకు తమ ప్రభుత్వం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యాయస్థానంలో పిటిషన్ వేసిన రాణా.. తాను పాకిస్థాన్ సంతతికి చెందిన ముస్లింనని, గతంలో పాక్ ఆర్మీలో పనిచేశానని.. తన గుర్తింపు కారణంగా భారత్‌లో తనను చిత్రవధ చేస్తారని ఆరోపించాడు. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తాను అక్కడ చనిపోవచ్చని పేర్కొన్నాడు. కాగా, ఇటీవల ఆయన దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.




# నేడు ప్రజాభవన్ లో ఆల్ పార్టీ మీటింగ్

**కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డికి ఆహ్వానం**

**స్వయంగా ఫోన్ చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**నిధుల కోసం ఒత్తిడి పెంచడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు కళ్లెం**

**ఇలా మునుపెన్నడూ ఆల్ పార్టీ మీటింగ్ పెట్టని కేసీఆర్**

హైదరాబాద్: రాష్ట్రాభివృద్ధికి నిధులు రాబట్టడంతోపాటు ప్రతిపక్షాల విమర్శలకు కళ్లెం వేసేందుకు సర్కారు సరికొత్త వ్యూహాన్ని ఎంచుకుంది. ఇందులో భాగంగా రేపు ప్రజాభవన్ లో ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్ని పార్టీల ముఖ్యనేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు ఫోన్ చేసి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరవుతున్నారు. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న అంశాలపైనే ఈ మీటింగ్ లో ప్రధానంగా చర్చించనున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి మోదీని, సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ముఖ్యంగా మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్డు అంశాలపై విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. దీంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్టీలకతీతంగా పార్లమెంటు ఉభయ సభల్లో లేవనెత్తేలా వ్యూహరచన చేస్తోంది.

# వరంగల్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ: కేసీఆర్



హైదరాబాద్ : తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటి నుంచి కాపాడుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రాజకీయ రక్షణను, పాలనా పరిరక్షణను అందించగలదని, ఈ విషయం గత పద్నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి స్పష్టమైందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో నెలకొన్ని అసంతృప్తి అనిశ్చితే నిదర్శనమని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఏప్రిల్ 27వ తేదీకి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో రజతోత్సవ వేడుకల్లో భాగంగా.. వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు వరంగల్ సమీపంలోని విశాలమైన అనువైన ప్రదేశాలను పరిశీలించి త్వరలో సభావేదిక స్థలాన్ని నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం నాడు జరిగే కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు పోరాటాలు నడిపి ఎన్నో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అనంతరం పదేండ్ల పాటు ఎంతో అప్రమత్తతతో తెలంగాణ స్వరాష్ట్రంలో పాలనను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని.. అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం నేడు మోసపోయి గోసపడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవ వేడుకలు, కేవలం బీఆర్ఎస్ పార్టీకే పరిమితం కాదని, యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ తెలంగాణ ప్రజలు నిర్మించుకున్న రాజకీయ అస్థిత్వ పార్టీ. ఇది తెలంగాణ ప్రజల పార్టీ. ప్రజలు బీఆర్ఎస్‌ను తెలంగాణ పార్టీగా తమ సొంతింటి పార్టీగా భావిస్తారు. ప్రజలు ఇవాళ అనేక కష్టాల్లో ఉన్నారు. వారి రక్షణ బీఆర్ఎస్ పార్టీనే అని నమ్ముతున్నారు.' అని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఆశపెట్టిన గ్యారంటీలను, వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ నిజస్వరూపం తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని సమావేశంలో ఆశాభావం వ్యక్తమైంది. బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని, అందుకు త్వరలో కమిటీలను వేయనున్నట్టు కేసీఆర్ తెలిపారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం.. బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి , ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆ తర్వాత నూతన కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంతో పాటు, దేశంలో నడుస్తున్న వర్తమాన రాజకీయ పరిస్థితులపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అందుకనుగుణంగా పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు అమలుచేయాల్సిన రాజకీయ ఎత్తుగడలపై లోతైన చర్చ జరిగింది. గత ఒడిదొడుకులను అనుభవాలను పరిగణలోకి తీసుకుని వాటిని విశ్లేషిస్తూ, వర్తమానానికి అన్వయించుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా కార్యాచరణను అమలు పరచాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా కూడా, తెలంగాణ సమాజానికి మొదటి నుంచీ అవి వ్యతిరేకంగానే పని చేస్తున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసుకొని దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తతతో ఉండాలని సమావేశం భావించింది. తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిధ్యం పార్లమెంటులో లేకపోవడం వలన తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతుందని అంశంపై చర్చ జరిగింది. ఇదే విషయాన్ని ప్రజలకు మరింతగా అర్థం చేయించి పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ప్రాతినిధ్యం ఉండి రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా పలు అంశాలపై చర్చ సందర్భంగా అధినేత అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు వారి వారి అభిప్రాయాలను అధినేత ముందుంచారు. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చలో.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ అధ్యక్షతన సాగిన సమావేశం నిర్ణయించింది.




హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగులకు 2.5 శాతం డీఏ ప్రకటించింది. ఈ విషయాన్ని రవాణా – బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. డీఏ ప్రకటనతో ఆర్టీసీపై ప్రతినెలా రూ.3.6 కోట్ల భారం పడుతోందన్న ఆయన.. అయినప్పటికీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ఆలోచిస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని.. దాదాపు రూ. 5,000 కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్టు తెలియజేశారాయన. ఉద్యోగుల పై పని ఒత్తిడి పెరిగిన వారు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి అభినందించారు. మహిళా సమైక్య సంఘాల చేత బస్సులు కొనిపించి ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన బస్సులు పెట్టించి మహిళలు ఆదాయాన్ని అర్జించే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందిరా మహిళా శక్తి ద్వారా మొత్తం 600 బస్సులు మహిళా సమైక్య సంఘాల ద్వారా ఆర్టీసీ తో అద్దె ప్రాతిపదికన ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో.. రేపు(మార్చి 8వ తేదీన) మహిళా దినోత్సవం సందర్భంగా రేపు మొదటి దశలో 150 బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కలతో కలిసి పొన్నం లాంఛనంగా ప్రారంభించనున్నారు. మొదటి దశలో 150 మండలాల్లో ప్రతి మండలానికి ఒక మండల మహిళా సమైక్య సంఘం ద్వారా ఒక బస్సు రేపు ప్రారంభం కానుంది. పాత ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి మహిళా సంఘాలను భాగస్వామ్యం చేశారు. మండల మహిళా సమైక్యల ద్వారా కొనుగోలు చేసిన ఇందిరా మహిళా ఆర్టీసీ బస్సుల ద్వారా బస్సుల డిమాండ్ ప్రయాణికులకు ఉపశమనం కలగనుంది. మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనుందని ప్రభుత్వం భావిస్తోంది.

# 'దక్షిణాదిపై భాజపా కక్ష'

## డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




దిల్లీ: డీలిమిటేషన్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు. "దక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోంది" అని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం ఆదేశాల మేరకే తాము (దక్షిణాది రాష్ట్రాలు) కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ధి జరుగుతుందని తెలిపారు.

**తెలంగాణ ఆర్థిక పరిస్థితి పై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు...** తెలంగాణ ఆర్థిక పరిస్థితి పై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రం రూ. 69,000 కోట్ల అప్పుతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అయితే గత 10 ఏళ్లలో తెలంగాణ అప్పు దాదాపు రూ. 7 లక్షల కోట్లకు పెరిగిందని రేవంత్ వెల్లడించారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం నిర్వహించిన ఆర్థిక విధానాల వల్లే ఈ స్థాయిలో అప్పు పెరిగిందని ఆయన ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ, ఆదాయ వనరులు అధికంగా ఉన్నప్పటికీ, అప్పు పెరుగుదల పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆయన అన్నారు. కేంద్రం నుండి వచ్చే నిధులు, రాష్ట్రానికి ఉన్న సంపద, వనరులు సరిగ్గా ఉపయోగించాల్సిన పరిస్థితిలో, KCR ప్రభుత్వం అప్పులు తీసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోందని సీఎం రెవంత్ రెడ్డి ఆరోపించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, వాటి లాభాలు ప్రజలకు పూర్తిగా అందలేదని విమర్శించారు. ఈ రుణ భారం భవిష్యత్తు తరాలకు భారంగా మారుతుందని, రాబోయే రోజుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు చర్యలు..** తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక పరిస్థితిని నిలబెట్టేందుకు పలు చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్థిక వివరణ, అప్పుల తగ్గింపు, పెట్టుబడిదారులను ఆకర్షించే విధానాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మున్ముందు అన్ని ఖర్చులను పారదర్శకంగా ఉంచి, అవసరమైన చోట మాత్రమే నిధులను వినియోగించే విధంగా కొత్త విధానాలు తీసుకురాబోతున్నామని ఆయన స్పష్టం చేశారు.

KCR ప్రభుత్వం వృథాగా ఖర్చు చేసిన ఖజానా నుంచి రూపాయి కూడా వృథా కాకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయడమే తమ లక్ష్యమని సీఎం రెవంత్ రెడ్డి అన్నారు.

చురకలు

## సంపాదకీయం

# అమ్మ మీద అంత మాట అనేయటమా జగన్?

ఆస్తులకు సంబంధించిన వివాదంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంచలన పిటిషన్ ను దాఖలు చేశారు. సరస్వతి పవర్ వాటాల వివాదంలో తాజాగా జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ హైదరాబాద్ బెంచ్ కు తన వాదనను వినిపించారు. దీనికి సంబంధించిన పిటిషన్ ను దాఖలు చేశారు. అందులో తల్లి విజయమ్మను ముందు పెట్టుకొని తన పంతం నెగ్గించుకోవటానికి షర్మిల అక్రమ చర్యలకు పాల్పడుతున్నట్లుగా జగన్ పేర్కొన్నారు. సరస్వతి పవర్ వాటాల వివాదంలో తల్లి ఆవేదనను అర్థం చేసుకోగలనని పేర్కొన్న జగన్.. 'ఆమెపై గౌరవం ఉంది. చెల్లి వెనకుండి చేయిస్తున్న అక్రమాలను అడ్డుకోవటానికే ఈ పిటిషన్ వేశాను" అంటూ పేర్కొన్నారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ రిజిస్టర్ లో వాటాదారుల పేర్లను సవరించి.. తమ వాటాల్ని పునరుద్ధరించాలని జగన్.. భారతిరెడ్డి.. క్లాసిక్ రియాల్టీలు పిటిషన్ దాఖలు చేయటం తెలిసిందే. ఈ సందర్భంగా తల్లి విజయమ్మ వేసిన కౌంటర్ తో పాటు సరస్వతి పవర్ డైరెక్టర్ చాగరి జనార్దన్ రెడ్డి వేసిన కౌంటర్లు.. తన పిటిషన్ నుంచి తొలగించాలని పేర్కొంటూ షర్మిల పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సమాధానం ఇస్తూ జగన్ అఫిడవిట్ దాఖలు చేశారు. షర్మిల అత్యాశ వల్లే అక్రమంగా వాటాలు బదలాయింపు జరిగిందని. మొత్తం వ్యవహారాన్ని షర్మిల ప్లాన్ ప్రకారం తల్లిని ముందు ఉంచి నడిపించిందన్నారు. వ్యక్తిగత.. రాజకీయ విభేదాలతో తల్లి.. ఇతరులను అడ్డు పెట్టుకొని వాటాలు బదలాయించటం వల్ల తమకు నష్టం జరిగిందని.. హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నందున చెల్లితో పరిస్థితులు చేయి దాటిపోకుండా ఉండేందుకు తాను.. భారతీ .. అమ్మ ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదన్నారు. షర్మిల ఏ కంపెనీలోనూ పెట్టుబడి పెట్టలేదని.. నిర్వహణలో భాగస్వామి కాలేదన్న జగన్.. 'ఏ నష్టాలకూ హామీ ఇవ్వలేదు. కంపెనీలపై నమోదైన కేసుల్ని ఎదుర్కోలేదు. అయినా తల్లిని బలిపశువును చేసి.. మా వాటాలు లాక్కోవటానికి ప్రయత్నిస్తోంది" అంటూ కీలక విషయాల్ని వెల్లడించారు. గిఫ్టు డీడ్ ప్రక్రియ పూర్తి కాలేదని.. వాటాల సర్టిఫికెట్లను తామింకా తల్లికి అందజేయలేదని.. వాటాల్ని బదలాయించలేదని పేర్కొన్నారు. అసంపూర్తి గిఫ్ట్ డీడ్ తో వాటాల బదలాయింపు పూర్తైనట్లు కాదన్న జగన్.. చట్టప్రకారం బదలాయింపు జరిగితేనే.. చెల్లెలుబాటు అవుతుందన్నారు. సరస్వతి పవర్ లోని వాటాలను కోర్టు కేసులన్నీ పూర్తయ్యేవరకు అమ్మ వద్ద ఉంచామని.. షర్మిల వల్లే తన తల్లి విజయమ్మ ట్రైబ్యునల్ ను తప్పుదోవ పట్టిస్తున్నట్లుగా జగన్ పేర్కొన్నారు. చెల్లితో ఉన్న వ్యక్తిగత.. రాజకీయ విభేదాలతో పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొనటం సరికాదన్న జగన్.. క్లాసిక్ రియాల్టీలోని వాటాల బదలాయింపుతో సరస్వతి పవర్ లో 48.99 శాతం వాటా ఉందన్నది వాస్తవమన్నారు. గిఫ్టుడీడ్ ఇచ్చినంత మాత్రాన వాటాలు బదలాయించినట్లు కాదని.. ఆ వాటాలపై పూర్తి హక్కులు దాతవేనని పేర్కొన్నారు. చెల్లిపై ఉన్న ప్రేమ.. వాత్సల్యంతో నా ఆస్తులను భవిష్యత్తులో ఆమెకు ఇవ్వాలని అనుకున్నానని.. అందుకే ముందస్తు తేదీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా పేర్కొన్నారు. కేసులన్నీ తేలాకే అంటూ ఎంవోయూలో స్పష్టంగా ఉందన్న జగన్.. అలాంటి ఒప్పందమేదీ లేదని చెప్పటం అబద్ధమన్నారు. షర్మిల మోసపూరిత చర్యతో ఆ ఒప్పందం ఆగిపోయిందన్నారు. ఆ తర్వాత దానిని రద్దు చేసుకున్నట్లుగా గతంలోనే చెప్పామని.. ఆ విషయాన్ని ట్రైబ్యునల్ పరిగణలోకి తీసుకోవాలన్నారు. వాటాల అక్రమ బదలాయింపునకు కారణం షర్మిలే అన్న జగన్.. గతంలో ఉన్న ప్రేమ.. అప్యాయతలు.. ఆమె చేసిన మోసం కారణంగా ఇప్పుడు లేవన్నారు. పాత తేదీలతో క్రియేట్ చేసిన పత్రాలతో తప్పుడు అఫిడవిట్లతో మోసగించారన్నారు. తన ఆస్తిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ పిటిషన్ మీద తదుపరి విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# బహుజనుల ఆత్మగౌరవ పతాక ఝల్కారీబాయి - చరిత్ర మరచిన వీరనారి ఝల్కారీబాయి - మహిళా దినోత్సవ సందర్భంగా



దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల త్యాగాలు, భాగస్వామ్యాలు కూడా మరువ లేనివి. అలాగే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ ఒక త్యాగశీలి భాగస్వామ్యం చాలా మందికి తెలియనిది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఝాన్సీ రాణి. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు ఒక చరిత్ర. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటిష్ పాలనకు లొంగక, వారికి తన రాజ్యం స్వాధీన పరచడానికి ససేమిరా ఇష్ట పడక, రాజ్య రక్షణ కోసం జరిగిన యుద్ధంలో ఝాన్సీ వీరోచిత పోరాటం, వీర మరణం గురించి అందరికీ తెలిసిందే. ఈ పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయికి నమ్మిన బంటుగా, విశ్వాస పాత్రురాలిగా, ఆత్మార్పణం గావించిన ఒక వీరదళిత నారి గురించి చాలా మందికి తెలియదు. ఆమె ఝల్కారీబాయి... ఝల్కారీబాయి గురించి తెలుసుకోక పోవడం చరిత్రకు అన్యాయం జరిగినట్లే భావించాలి. ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి లక్ష్మీ బాయి. 1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవ కారులకు నిలయంగా మారింది. లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమీకరించడం ద్వారా ఆత్మరక్షణ బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇవ్వనారంభించింది. ఆమె దగ్గర సైన్యాధ్యక్షులుగా ఉన్న వారంతా ఆమె యుద్ధం చేస్తున్న కారణానికి మద్దతుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారే. సెప్టెంబరు, అక్టోబరు 1857 లో ఆమె ప్రక్క రాజ్యాలైన దతియా, ఓర్చా రాజ్యాల నుంచి దాడిని విజయవంతంగా ఎదుర్కొన గలిగింది. హిందువులకు ఆవు పవిత్రం, ముస్లింలకు, పంది అసహ్యం. కానీ ఆంగ్లేయులు వాడే తూటాలకు ఆవుకొవ్వును, పందికొవ్వును వాడేవారు. అది సహించలేని సిపాయిలలో తిరుగుబాటు మొదలయ్యింది. ఇది గ్రహించిన ఆంగ్లేయులు హిందువులను, ముస్లింలను అనేక ఇబ్బందులకు గురిచేసారు. అది సహించలేని సిపాయిలు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేయాలని సంకల్పించు కున్నారు. రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోగా పారిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి తాంత్యాతోపే మొదలైన తిరుగుబాటు దార్లతో చేయి కలిపి ఢిల్లీ, కాన్పూరు, ఔధ్ , ఝాన్సీతో పాటు అన్నీ ప్రాంతాలలో ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయించు కున్నారు. కానీ బ్రిటీష్ వారు పెట్టిన బాధలకు ఓర్వలేని మంగల్ పాండే అనే భారత సిపాయి తిరుగుబాటు చేయడంపై ఆంగ్లేయులు అప్రమత్తమై ఝాన్సీరాణిని నిర్బంధించి ఝాన్సి రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు. ఇది భారత చరిత్రలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం. భారతనారీ క్షేత్రంలో మచ్చుతునక ఝాన్సీ లక్ష్మీబాయి. అయితే ఈ సమరంలో ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర మరువ లేనిది. ఝల్కారీబాయి (నవంబరు 22, 1830 – 1858) భారతీయ మహిళా సైనికురాలు. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఝాన్సీ యుద్ధంలో ప్రముఖపాత్ర పోషించింది. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలోని మహిళా విభాగంలో సైనికురాలు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిపాయి తిరుగుబాటుగా, 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధిగాంచిన 1857–58 నాటి వీరోచిత పోరాట ఘట్టంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ప్రతిరూపంగా కీలక భూమికను పోషించిన ఘనత దళిత బహుజన భూమి పుత్రిక ఝల్కారిబాయికే దక్కుతుంది. బుందేల్ఖండ్ ప్రాం తంలో ప్రజలు పాడుకునే జానపద బాణీల్లో ఝాన్సీలక్ష్మీబాయి సరసన ఝల్కారిబాయి సాహసాలను పాటల రూపంలో నేటికీ గుర్తు చేసుకోవడం విశేషం. ఝాన్సీ సమీపంలోని భోజ్లా గ్రామంలో కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు నిరుపేద వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి వీరనారిగా ఎదిగి, నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాకగా మారింది. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిన ఘటన సంచలనం రేపింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్‌ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించింది. సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రు సేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టుముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకుని కల్పి ప్రాంతంలో పోరాడుతున్న తిరుగుబాటు నాయకులను కలుసు కోవడానికి అనువుగా, ఝల్కారిబాయి తానే ఝాన్సీ లక్ష్మీబాయి నంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, తదనంతర కాలంలో ఆమెను విడిచిపెట్టారా లేదా చంపేశారా అన్నది చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1858 జూన్ 17,లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. ఈ ఝల్కారిబాయి సాహసంతో స్ఫూర్తి పొందిన దళిత బహుజన రాజకీయ పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఝల్కారిబాయి జీవితాన్ని, పోరాట ఘట్టాలను నాటకాలు, కథలుగా మలచి ఊరూరా ప్రచారం చేయడం జరిగింది. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గమనార్హం.


రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# మహిళల హక్కుల పట్ల అవగాహన అవసరం - మార్చి 8...అంతర్జాతీయ మహిళా దినోత్సవం




అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారు. మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజికం సహా అనేక రంగాల్లో మహిళల భాగ స్వామ్యాన్ని పెంచడంతో పాటు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఈ వేడుకలను జరుపుకుంటారు. అయితే వందేళ్లుగా, ఈ వేడుకలు జరుపుకుంటున్నా, నేటికీ మహిళ లు అనేక సమస్యల వలయలలో కొట్టు మిట్టాడుతునే ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడానికి కార్మిక ఉద్యమం నేపధ్యం ఉంది. 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ పని గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లకు సానుకూలమై, అమెరికాలోని సోషలిస్టు పార్టీ అధికారం లోకి వచ్చాక 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిం చాలన్న ప్రతిపాదన కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జ ర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1917 యుద్ధ సమయంలో రష్యా మహిళలు "ఆహారం – శాంతి" డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా సామ్రాట్ నికోలస్ జా 2 సింహాసనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును కల్పించిన నేపథ్యం ఉంది. మహిళలు ఈ సమ్మెకు దిగిన దినం అప్పట్లో రష్యాలో అనుసరించే జూలియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23 ఆదివారం. అయితే గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది మార్చి 8వ తేదీ. అందుకే మార్చి 8వ తేదీన అత్య ధిక దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటున్నారు. 1975వ సంవత్సరం లోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించ టం ప్రారంభించింది. ఈ ఏడాది జరిగేది 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్: "సుస్థిరమైన రేపటి కోసం ఈ రోజు లింగ సమానత్వం"... అయితే మహిళ లపై అణచివేతలు కొనసాగు తుండడం నిత్యకృత్యాలే అవుతున్నాయి. రాజ్యాంగం ఎన్నో హక్కు లు కల్పించినా వాటిపై అవగాహన లేక పోవడంతో మరింత అన్యాయాలకు గురవు తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి. తమపై వివక్షను, వేధింపులను ఎదుర్కో వడానికి వారు ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో మహిళా దినోత్సవం సందర్భంగా తెలుసు కోవాల్సిన అవసరం ఉంది. భారతీయ మహిళలందరికిని సమానత్వం( నిబంధన14), వివక్ష లేకుండుట (నిబంధన 15(1), సమానావకాశాలు కల్పించడం (నిబంధన16), సమాన పనికి సమాన వేతనం (నిబంధన 39(డి), వీటితో బాటు స్త్రీలకు పిల్లలకు అనుకూలంగా ప్రత్యేక నిబంధన లను అనుమతించడం (నిబంధన 15(3), మహిళల గౌరవానికి భంగం కల్గించే ఆచారాలను లేకుండా చేయడం(నిబంధన 51(ఎ) (ఇ), అంతేగాక మహిళలు చేసేపనులలో న్యాయపరమైన, మానవోచిత పరిస్థితులలో రక్షణ కల్పించడం, ప్రసూతి సమయంలో ఉపశ మనానికి (నిబంధన 42) మహిళా రిజర్వేషన్ 73వ రాజ్యాంగా సవరణ ప్రకారం సదుపాయాలను అనుమతించడం వంటి హామీలను భారత రాజ్యాంగం కల్పించింది. సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం, ఒక వ్యక్తి మీద దాడి చేస్తే సదరు వ్యక్తి చనిపోయినా మీకు శిక్ష పడదు. 166(బి) సెక్షన్ ప్రకారం.. బాధితురాలికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స ఇవ్వకపోతే సంబంధిత సిబ్బంది, యాజ మాన్యం మీద కేసు వేయవచ్చు. 228(ఏ) సెక్షన్ ద్వారా లైంగిక దాడికి గురైన మహిళ అనుమతి లేకుండా మీడియాలో ఆమె పేరు, ఫొటోలు ప్రచురించ కూడదు. అలా చేసిన పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవచ్చు. 354 సెక్షన్ ప్రకారం – స్త్రీ శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో చూసినా, తాకినా, అవమాన పర్చినా, అనుమతి లేకుండా ఫొటో, వీడియో తీసినా ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయ వచ్చు. 376 సెక్షన్ కింద18 ఏళ్ల లోపు ఉన్న యువతితో సెక్సులో పాల్గొంటే అది చట్టరీత్యా వ్యతిరేకం. ఒకవేళ ఆమె ఇష్ట ప్రకారమే చేసినా పురుషుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష పడుతుంది. 376 సెక్షన్ కింద వైద్యం కోసం వచ్చిన మహిళను లైంగిక వేధింపు లకు గురిచేస్తే వారిపై చర్య తీసుకు నేందుకు సెక్షన్ ఉపయోగ పడుతూ, ఈ సెక్షన్ కింద కేసు చేస్తే రెండు నెలల్లో విచారణ చేసి తీర్పు ఇవ్వాలి. భార్య ఉండగా.. మరో పెళ్లి చేసుకుంటే 494 సెక్షన్ ప్రకారం అతని మీద కేసు నమోదు చేయవచ్చు. కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది. 498(ఏ) సెక్షన్– ఓ వివాహితను ఆమె భర్త కానీ, భర్త బంధువులు కానీ శారీర కంగా, మానసికంగా, హింసించినా, అందుకు ప్రేరేపించినా, ప్రోత్సహిం చినా ఈ సెక్షన్ కింద కేసు వేయవచ్చు. కనీసం మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. 509 సెక్షన్ – మహిళ లతో అవమానంగా మాట్లాడినా, సైగలు చేసినా, అసభ్యకర వస్తువు లను ప్రదర్శించినా ఈ చట్టం ప్రకారం శిక్షకు అర్హులు. ఒంటరిగా ఉన్నప్పుడు అసభ్యకరంగా పాటలు పాడుతూ, శబ్దాలు చేస్తూ ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 294 ప్రకారం వారిపై ఫిర్యాదు చేయవచ్చు. కనీసం మూడు నెలలకు తగ్గకుండా వారికి జైలుశిక్ష, లేదా కొంత జరిమానా వేయవచ్చు. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా వెక్కిరించినా, అనుకరించినా, వారిపై సెక్షన్ 354(డీ) ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. పనిచేసే ప్రదేశాల్లో తోటి ఉద్యోగులు గానీ, బాస్ గానీ ఆఫీసు పనుల్లో అలుసుగా తీసుకొని సెక్సువల్ కాంటాక్ట్ కోసం ఇబ్బంది పెడితే 2013 వేధింపుల చట్టం ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. ఒకరి ఫొటోను మార్ఫింగ్ చేసి వారి శరీరాలకు ముఖాన్ని అతికించి ఇబ్బంది కరంగా ఇంటర్నెట్‌లో షేర్ చేస్తున్న సంఘటనలలో సెక్షన్ 499 ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడవచ్చు. ఒక మహిళను దౌర్జన్యంగా, బల ప్రయోగం వల్ల తన శరీరంపై ఉన్న దుస్తులను తీసివేసినా, ఆ వ్యక్తికి సెక్షన్ 354(బీ) ప్రకారం 3నుండి7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. 13/2013 సవరణల చట్టం ద్వారా ఈ సెక్షన్ అదనంగా చేర్చబడింది. ఒక మహిళ, విద్యార్థినికి సంబం ధించిన రహస్య వ్యక్తిగత ఫొటోలు తీయడం, వీడియోలు తీసి వాటిని ఇతరులకు పంపించినా 354(సీ) సెక్షన్ కింద ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వ్యభిచారానికి, 18 ఏళ్లలోపు బాలికను కొనుగోలు చేసినా సెక్షన్ 373 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు జరిమానా విధిస్తారు. బాలికను వ్యభిచారానికి మారేందుకు ప్రోత్సహించినా, ప్రలోభ పెట్టినా సెక్షన్ 366(ఏ) కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. నిండు గర్భిణిని చంపాలనే ఉద్దేశంతో చేపట్టిన ఒక చర్య పర్యవసానంగా ఆమె చనిపోతే నేరస్థుడిపై సెక్షన్ 316 ప్రకారం ప్రాణహరణం కింద, నేరం మోప బడుతుంది. ఆమె మరణించడానికి బదులుగా గర్భంలోని శిశువు మరణిస్తే 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఒక బృందంలోని సభ్యులు ఒక మహిళపై లైంగిక దాడి చేసిన సందర్భాల్లోనూ వారిలో ప్రతి వ్యక్తి నేరానికి పాల్పడి నట్లే పరిగణించ బడుతుంది. సెక్షన్ 376–బీ కింద ప్రతి ఒక్కరికీ 20 ఏళ్లు తగ్గకుండా జీవితఖైదు శిక్ష విధిస్తారు. 13/2013 సవరణ చట్టం ద్వారా ఈ సెక్షన్ సవరించబడింది. స్త్రీ, బాలికను గానీ తన ఇష్టానికి వ్యతిరేకంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకునేందుకు బలవంతంగా అంగీకరించాలని ఒత్తిడి తేవడం, ఆ స్త్రీని అపహరిస్తే బలవంతంగా వివాహం చేసుకునే సెక్షన్ 366 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా పడుతుంది. ఇలాంటి చట్టాల ఎన్నో గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలి. అలాగే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ స్త్రీల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలి. సాటి మనుషులుగా మహిళలకు సామాజిక బాధ్యతగా సహకరించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విద్యుత్ రంగానికి తాతారావు విశిష్ట సేవలు - మార్చి 8...నార్ల తాతారావు జయంతి



భారత దేశ విద్యుత్ రంగానికి నార్ల తాతారావు చేసిన సేవలు చిర స్మరణీయాలు. విద్యుత్ కేంద్రాల డిజైన్లు మార్చడంలో ఆయన చూపిన ప్రతిభ మార్గదర్శకం అయింది. వివిధ పదవులు నిర్వహించి విద్యుత్ ఉత్పాదన సామర్థ్య పెంపుకు విశేష కృషి చేశారు. నార్ల తాతారావు ప్రఖ్యాత భారత విద్యుత్తు రంగ నిపుణుడు, పూర్వపు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు బోర్డు మాజీ ఛైర్మన్. నార్ల తాతారావు కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో 1917 మార్చి 8వ తేదీన జన్మించారు. కౌతవరం లోనే ప్రాథమిక విద్య నభ్యసించారు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుండి 1941లో ఇంజినీరింగ్ పట్టా పొందారు. అమెరికా లోని ఇల్లినాయిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎం.ఎస్ డిగ్రీ చదివిన తాతారావు మొదట టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో ఉద్యోగిగా జీవితము ప్రారంభించారు. పిదప ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు సంస్థ (ఏపీఎస్ఈబీ) డివిజనల్ ఇంజినీరుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టారు. తర్వాత మధ్యప్రదేశ్ విద్యుత్తు బోర్డులో పనిచేసిన కాలంలో దేశం లోనే ఆ సంస్థను అగ్రగామిగా నిలిపారు. థర్మల్ విద్యుత్తు కేంద్రాల డిజైన్లను మార్చడం ద్వారా ఈ రంగంలో పెద్ద విప్లవమే తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆ డిజైన్లు దేశాని కంతటికీ ఆదర్శమయ్యాయి. 1974 నుంచి 1988 వరకూ 14 ఏళ్లపాటు ఏపీఎస్ఈబీ ఛైర్మన్ గా పని చేసారు. విద్యుత్తు రంగానికి విశిష్ట సేవలందించి నందుకు గాను 1983లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. నాగార్జున సాగర్, శ్రీశైలం, దిగువ సీలేరులలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యము పెంచడంలో ప్రముఖ పాత్ర వహించారు. రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని నార్ల తాతారావు గట్టిగా సమర్థించారు. పేదలకు తక్కువ ధరకే విద్యుత్తు అందజేయాలనేది ఆయన లక్ష్యం. విద్యుత్తుతో వ్యాపారం చేయవద్దనేది ఆయన నినాదం. నార్ల తాతారావు 2007 ఏప్రిల్ 7 న హైదరాబాద్ నగరంలో గుండెపోటుతో మరణించారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు తాతారావుకు సోదరులు. మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, డివిజనల్ ఇంజినీర్ గాబీ విద్యుత్ బోర్డు, మధ్య ప్రదేశ్, కార్యదర్శి గాబీ మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, ఛీఫ్ ఇంజినీర్ గాబీ మధ్య ప్రదేశ్ విద్యుత్ శాఖ, ఛైర్మన్ గాబీ కేంద్ర ప్రభుత్వ జల విద్యుత్ కమిషన్, సభ్యుడుగాబీ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లుకమిటీ, ఛైర్మన్ గాబీ ఎనర్జీ రీసర్చ్ శాఖ, భారత శాస్త్ర సాంకేతిక పరిశోధక పరిషత్, ఛైర్మన్ గాబీ కేంద్రీయ జల విద్యుత్ సమితి, అధ్యక్షుడుగాబీ భారత అల్యూమినియమ్ కంపెనీ, డైరెక్టర్ గాబీ బంగ్లాదేశ్ పవర్ డెవలప్ అడ్వైజర్ గా, తదితర పదవులు నిర్వహించారు. ఓమ్ ప్రకాశ్ భాసిన్ పురస్కారము, పద్మశ్రీ 198బీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసోసియేషన్, అమెరికా,గౌరవ సభ్యుడుబీ భారతరత్న, శ్రీ విశ్వేశ్వరయ్య అవార్డు 1985 ఆయన అందుకున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పునర్విభజనపై ఉత్కంఠ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలను నగరంలో చేర్చిన తర్వాత పునర్విభజన తప్పనిసరిగా మారింది. నెలరోజుల కిందట డివిజన్ల సరిహద్దులు, ఓటర్లు, ఇళ్ల సంఖ్యల వివరాలతో ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించడంతో అధికార యంత్రాంగం ప్రక్రియ పూర్తి చేసింది. ప్రస్తుతమున్న 60 డివిజన్లు 66 డివిజన్లుగా పెంచుతూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు విలీన గ్రామాలను, పురపాలికలను కలుపుకోవడంతో ఓటర్ల సంఖ్య మారనుంది. మరో ఆరు డివిజన్లు పెంచడంతో నగర స్వరూపం మారునుండటం, ఏ డివిజన్‌లో ఎంతమంది ఓటర్లు ఉండాలనే విషయంపై కసరత్తు చేసినట్లు సమాచారం.

**డివిజన్ల వారీగా ప్రతిపాదనలు** పెరిగిన డివిజన్ల ఆధారంగా ఓటర్లు, సరిహద్దులతో వార్డుల పునర్విభజ న పూర్తి చేసినట్లు తెలిసింది. కొన్ని రోజులుగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇన్‌ఛార్జి ఏసీపీ వేణు, పట్టణ ప్రణాళిక విభాగం ఉద్యోగులు కలిసి విలీన గ్రామాలను కలుపుకొని ఏయే డివిజన్ ఎక్కడి వరకు రానుందనే విషయాలపై చర్చించి, క్షేత్రస్థాయిలో పరిశీలించు కుంటూ కొలిక్కి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తి చేసి రెండు రోజుల కిందట రాష్ట్ర స్థాయి అధికారులకు అందజేసినట్లుగా చెబుతున్నారు.

**గత తప్పిదాలు లేకుండా**

గతంలో మస్కిటో కాయిల్ తరహాలో డివిజన్ల పునర్విభజన చేశారు. రెండు, మూడు రోడ్లు వేర్వేరు డివిజన్‌లలో ఉండటంతో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఇప్పటికి ఏ డివిజన్‌లో ఏ కాలనీ ఉందో అర్థం కాకుండా ఉంటుంది. కొందరికి అనుకూలంగా ఎన్నికల్లో రిజర్వేషన్లు మార్చే విధంగా డివిజన్లను మార్చుకున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అభివృద్ధి పనులు, శానిటేషన్ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా క్రమపద్ధతిలో డివిజన్లు, ఓటర్లు, ఇళ్ల సంఖ్య ఉండేలా చూడాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం కులగణన సర్వేలో వచ్చిన



సామాజికవర్గ లెక్కలు, ఓటర్లు, ఇళ్ల సంఖ్య ఆధారంగా ఒక డివిజన్ పరిధి, హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

**ఒకటో డివిజన్ ఎక్కడి నుంచో?**

డివిజన్ల పునర్విభజన ప్రక్రియ ప్రాథమికంగా పూర్తి చేశారు. ప్రస్తుత ఓటర్ల లెక్క ప్రకారం ఒక్కో డివిజన్‌కు 4,493 నుంచి 5 వేల మంది ఓటర్లు ఉండే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే అధికారికంగా ప్రతిపాదనలు తయారు చేసి ముసాయిదా ప్రకటన జారీ చేయనున్నారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు కూడా స్వీకరిస్తారు. ఆ తర్వాత తుది ప్రకటన చేస్తారు. అధికార యంత్రాంగం పునర్విభజన పూర్తి చేసిందనే ప్రచారంతో మాజీ కార్పొరేటర్లు, ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఒకటో డివిజన్ ఎక్కడి నుంచి ప్రారంభం అవుతుంది? చివరి డివిజన్ ఎక్కడ ముగుస్తుందనే కోణంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

ప్రస్తుత డివిజన్లు : 60
కొత్తగా ఏర్పడేవి : 6
నగర ఓటర్లు : 2,54,745
విలీన గ్రామాల ఓటర్లు : 41,814

# పాతాళానికి గంగమ్మ

జగిత్యాల : ఈ సీజన్‌లో చలి ప్రభావం అంతగా లేకపోవటం, జనవరి నుంచి ఇప్పటి వరకు సాధారణం కన్నా సగటున 2-5 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో వేసవికి ముందుగానే భూగర్భ జలమట్టం వేగంగా అడుగంటుతోంది. జిల్లాలో ఈ యాసంగిలో 2.82 లక్షల ఎకరాల్లో అన్నిరకాల పంటలను సాగు చేస్తారని అంచనా వేసినా నీటి లభ్యతతో 3.26 లక్షల ఎకరాలకు సాగు పెరిగింది. ఇందులో 2.72 లక్షల ఎకరాల్లో వరిపంట ఉండగా మిగిలిన విస్తీర్ణంలో మక్క, ఆవాలు, నువ్వు తదితర పంటలున్నాయి. మామిడి, ఆయిల్‌పామ్ తదితర తోటలకూ నీటిపారకం అధికంగానే ఉంది. ఐతే ఎండల తీవ్రత, చివరి ఆయకట్టుకు కాలువనీరు చేరకపోవటంతో రైతులందరూ భూగర్భ జలాన్ని అధికంగా వాడుతుండటంతో జలమట్టం వేగంగా అడుగంటుతోంది.

సగటున 4.78 మీటర్ల లోతు

జిల్లాలో 2023 ఫిబ్రవరి నెలాఖరున సగటున 4.78 మీటర్ల లోతులో,



2024 ఫిబ్రవరినెలాఖరున 4.93 మీటర్లుగా, ప్రస్తుతం 2025 ఫిబ్రవరి నెలాఖరున 4.86 మీటర్లుగా జలాలున్నాయి.

గత జనవరిలో 4.55 మీటర్ల నీటిమట్టం ఉండగా నెలలోనే 0.31 మీటర్లు పడిపోయింది. ప్రస్తుతం కొడిమ్యాల మండలంలో అత్యధిక లోతులో నీళ్లుండగా బీర్‌పూర్ మండలంలో కనిష్ఠలోతులో జలాలున్నాయి. జిల్లాలో రైతులు ఫిబ్రవరి మొదటిపక్షం వరకూ వరినాట్లు చేపట్టగా మే నెల వరకు నీటి అవసరం ఉంటుంది. ఎస్సారెస్పీ నుంచి మరో 2 నీటితడులతో ఆయకట్టు ప్రణాళికను ముగించనున్నారు. ఆలస్యంగా పంటలను సాగు చేసినందున ఏప్రిల్‌లో కనీసం రెండు నీటితడులను వదలకుంటే వరికి చివరి దశలో తీవ్రనష్టం కలుగుతుంది. ఈ నేపథ్యంలో అందుబాటులోని భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలని భూగర్భ జలవనరులశాఖ అధికారులు సూచిస్తున్నారు.

# విద్యార్థులూ.. విజయీభవ!



కరీంనగర్ : విద్యా సంవత్సరం మొత్తం విరామమెరుగని చదువులు.. పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమైన ఉమ్మడి జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు బుధవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలు నిత్యం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. మాల్ ప్రాక్టీస్ నియంత్రణ కోసం ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

**అందుబాటులో వైద్య బృందాలు**

గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్తు, లైట్లు, డ్యూయెల్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం తాగునీటి వసతిని, వేసవి దృష్ట్యా వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నారు.

మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయగా, కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ఈసారి పరీక్ష కేంద్రాల చిరునామాలు సులువుగా గుర్తించేలా హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు.

ఇప్పటికే అధికారులు పరీక్షల ప్రశ్నాపత్రాలను పంపిణీ చేసి వాటి నిర్వహణకు కావాల్సిన అధికారులు, సిబ్బందిని నియమించారు.

ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలాంటి చేతి గడియారాలు, చరవాణిలను కేంద్రాల్లోకి అనుమతించరు.

ఈసారి పరీక్ష ప్రారంభ సమయం అనంతరం అయిదు నిమిషాల వరకు (9.05) విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు.

విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8 గంటల నుంచి వాటిల్లోకి అనుమతిస్తారు.

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావచ్చు.

అల్పాహారం తీసుకుంటేనే..ఆరోగ్యం పదిలం

ఉదయం తేలికపాటి ఆహారం తీసుకుని పరీక్షకు బయలుదేరాలి. చల్లదనాన్ని కలిగించే పండ్ల రసాలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలి. జలుబు, నీరసం, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యుల సలహాలతో పరీక్షలకు వెళ్లాలి.

వెంట ఇంటి నుంచి నీళ్ల సీసాలను తీసుకెళ్లడం ఉత్తమం. తేలికపాటి దుస్తులను ధరించాలి.

పరీక్ష రాసి తిరుగు ప్రయాణమయ్యేప్పుడు ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం విద్యార్థులు తల, ముక్కు, నోరు కప్పి ఉంచేలా టోపీలు, చేతిరుమాళ్లు ధరించాలి. పరీక్ష పూర్తయ్యాక ఇంటికి వెళ్లి ఆహారం తీసుకుని కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం చదవడం ఉత్తమం. రాత్రంతా నిద్రపోకుండా మేల్కొని ఉండి చదవడం వద్దు.

# ఆహారశుద్ధి.. స్వయం సమృద్ధి




జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుకు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పన లక్ష్యంగా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూరగాయలు.. జగిత్యాల జిల్లాలో మామిడి.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు గతంలోనే అనుమతించినా బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వ స్థలాలు ఇవ్వడంతో పాటు మహిళా సంఘాలకు, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో పరిశ్రమలకు రాయితీలు, రుణ సదుపాయం కల్పించాల్సి ఉంది. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే 225 ఎకరాల భూసేకరణ జరగగా మిగతా జిల్లాల్లో జరపాల్సి ఉంది.

**ఏమేం చేయాలంటే..**

దేశ విదేశాల్లో మేలురకం మామిడిని ఏటా 85 వేల మెట్రిక్ టన్నులకుపైగా ఎగుమతి చేస్తున్నా ధరాఘాతం వేధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 76 వేల ఎకరాల్లో మామిడి తోటలుండగా జగిత్యాల జిల్లాలో మామిడి రసం, తాండ్ర తదితర పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా విక్రయ అవకాశాలు, ధరలు పెరిగి రైతులకు లాభించనుంది.

జలాశయాలతోపాటు వరద కాలువలు, 5,643 చెరువులు కుంటల్లో చేపల పెంపకం చేపడుతున్నారు. ఏడాదికి 24 వేల మెట్రిక్ టన్నుల వరకు చేపలు, రొయ్యలు ఉత్పత్తవుతున్నాయి. సిరిసిల్ల జిల్లాలో చేపల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

ఉమ్మడి జిల్లాలో 20కిపైగా రకాల కూరగాయలను తింటుండగా 59 శాతం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ సాగు 16 వేల హెక్టార్లకు చేరాల్సి ఉంది. అదే తరుణంలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూరగాయల ఆధారిత ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు అవసరం. పండ్లు, పూలతోటల సాగుకు రాయితీలు, తగిన శిక్షణ ఇచ్చి ఎగుమతి అవకాశాలు కల్పించాలి.

సంకర విత్తనోత్పత్తికి అనువైన పరిస్థితులున్న నేపథ్యంలో విత్తనశుద్ధి కర్మాగారాల ఏర్పాటుపైనా దృష్టి సారించాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో విత్తనశుద్ధి కర్మాగార పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

కేంద్రం ద్వారా రాయితీలున్న చేపలు, రొయ్యలు, కోళ్లపెంపకం, మేకలు, గొర్రెలు, తేనెటీగల పెంపకం, పాడిపరిశ్రమ తదితరాలను ప్రోత్సహించాలి.

పల్లరసాలు, పసుపుపొడి, మిరపపొడి, నూనెలు, మొక్కజొన్నలో స్టార్చ్, బిస్కెట్ల తయారీ, జొన్నపిండి, ఆవనూనె, పత్తి జిన్నింగ్‌మిల్ తదితరాల ఏర్పాటుకు ఆసక్తిగలవారికి అనుమతుల మంజూరు, రాయితీలతో ప్రోత్సహించాలి.

నియోజకవర్గానికో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటు హామీని అమలు చేయాల్సి ఉంది.

**అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ**

కొన్ని పంటల సాగును ప్రోత్సహించటం, అనుబంధ పరిశ్రమలతో వరి, పత్తి సాగు తగ్గి జిల్లాలో పంటల వైవిధ్యం సిద్ధిస్తుంది. చిరుధాన్యాల సాగు, పట్టుపురుగుల పెంపకంతోనూ అదనపు ఆదాయాన్ని పొందొచ్చు. పొలాసలో అగ్రిహబ్ ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ ఇస్తున్నాం. డాక్టర్ డి.శ్రీలత, సహ పరిశోధన సంచాలకులు, జగిత్యాల పరిశోధన స్థానం

# ఆదాయ లక్ష్యం అందుకునేనా?

జమ్మికుంట : ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా.. మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ఆదాయ లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు దృష్టి సారించారు. పంటల విక్రయాలు, మార్కెట్‌కు వచ్చే పలురకాల ఫీజు, చెక్‌పోస్టులు, గిడ్డంగులు, అడ్తి వ్యాపారుల దుకాణాల అద్దెలు, ఇతరత్రా వచ్చే వసూళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే లక్ష్యాన్ని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు అధిగమించాయి. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు సీసీఐ మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన పంట కొనుగోళ్ల మార్కెట్ ఫీజును జమచేస్తే.. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించనున్నదని అధికారులు పేర్కొంటున్నారు.

**కరీంనగర్ ఆదాయం రూ.21.73 కోట్లు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి కరీంనగర్ జిల్లాలో మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యాన్ని రూ.24.44 కోట్లుగా నిర్ణయించగా.. రూ.21.73 కోట్లు వసూలు చేసింది. సీసీఐ, పౌరసఫరాల శాఖ నుంచి మార్కెట్ ఫీజు రూ.5.73 కోట్లు జమ కావాల్సి ఉంది.

పెద్దపల్లి జిల్లాలో రూ.14.05 కోట్లకు.. రూ.8.94 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లా మార్కెటింగ్ శాఖకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ.9.02 కోట్లు రావాల్సి ఉంది. ఈనెలాఖరుకు ప్రభుత్వ రంగ



సంస్థలు మార్కెటింగ్ శాఖ చెల్లించే ఫీజులు జమ చేస్తే ఉమ్మడి జిల్లాలో మార్కెట్ల ఆదాయం లక్ష్యాన్ని అధిగమిస్తాయని వరంగల్ ఆర్‌జేడీఎం శ్రీనివాస్ చెప్పారు.

**మరో రూ.2.20 కోట్లు..**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు 2024-25 ఏడాదికి సంబంధించి రూ.8.08 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటివరకు రూ.6.40 కోట్ల ఆదాయం వచ్చిందని మార్కెట్ కార్యదర్శి మల్లేశం తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సీసీఐ, పౌరసరఫరాలశాఖ స్థానిక మార్కెట్‌కు రూ.2.20 కోట్లు జమచేయాల్సి ఉందన్నారు. ఈనెలాఖరులో వచ్చే అవకాశముందని తెలిపారు.

# నిషేధంపై నిర్లక్ష్యం..!

సూర్యాపేట : పురపాలికల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని గాలికి వదిలేశారు. సరైన అవగాహన లేక అడ్డుకట్ట పడటం లేదు. పట్టణాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ దర్శనమిస్తోంది. అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వినియోగం పెరిగిపోతోంది. మరోవైపు ప్లాస్టిక్ సంచులతో భూసారం దెబ్బతింటోంది. విషయం గుర్తించిన పురపాలక శాఖ ఈ నెలలో తనిఖీలో నిర్వహించాలని నిర్ణయించింది. కొందరు అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా పట్టణాల్లో ప్లాస్టిక్ నియంత్రణకు నోచుకోవడం లేదు. **మళ్లీ తనిఖీలకు ఆదేశం**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రెండేళ్ల క్రితమే రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు నియంత్రణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో కేంద్రం కూడా పటిష్ఠ చర్యలు చేపట్టింది. అధికారులు




మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోతున్నారు. ఆదేశాలు వచ్చిన సమయంలో పుర అధికారులు హడావుడి చేశారే తప్ప పూర్తిస్థాయిలో నివారించలేపోయారు. మళ్లీ వాకడం పెరుగుండటంతో భవిష్యత్తులో మానవాళికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోజుకు టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలను పుర సిబ్బంది సేకరిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తుందనే విషయాన్ని మాత్రం పుర అధికారులు గుర్తించలేకపోయారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర పురపాలకశాఖ ఈ నెలలో తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది.

**నివారణకు కృషి చేస్తాం- శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట**

రాష్ట్ర పురపాలకశాఖ ఆదేశాల మేరకు పురపాలికల్లో మళ్లీ ప్లాస్టిక్ నియంత్రణకు తనిఖీలు చేపడతాం. ఇదివరకు తనిఖీలు చేపట్టి దుకాణాల్లోని ప్లాస్టిక్‌ను సేకరించాం. మరోసారి చేపట్టి పూర్తిసాయిలో నివారణకు కృషి చేస్తాం.

# లోపాలు దిద్ది.. లాభాలు పెంచేలా..!

నల్గొండ : పాలు, సంబంధిత పదార్థాలకు డిమాండ్ అధికంగా ఉంటోంది. చాలామంది వ్యవసాయానికి తోడుగా, కొందరు ప్రత్యామ్నాయంగా పాడి పశువులను పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. ఈ క్రమంలో పాల దిగుబడులు పెంచేలా ఉమ్మడి జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ(డీఎల్‌డీఏ) కృషి చేస్తుంది. పశుజాతి సంరక్షణ, వేగంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడు నెలల నుంచి చికిత్స శిబిరాలు నిర్వహిస్తోంది. గతేడాది నవంబరు నుంచి ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పశువైద్యుల సహకారంతో, గోపాలమిత్రలతో కలసి 277 శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.




**ప్రదర్శనలు.. పోటీలు**

పశువులకు వ్యాపించే రోగాలను పాడి రైతులు సకాలంలో గుర్తించలేకపోతున్నారు. దీంతో వాటికి సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా జీవనాధారమైన పశువులు చనిపోయి ఇబ్బందులు పడుతున్నారు. వైద్య చికిత్సలకు అధికంగా ఖర్చవుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉచిత వైద్య శిబిరాలతో పాటు దూడల ప్రదర్శన, పాల పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కృతిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడల ప్రదర్శనలు చేశారు. అధిక పాల దిగుబడి కోసం మేలు జాతిరకం సంతతిలో ఫలితాలు రైతులకు పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందజేశారు.పాల దిగుబడి వృద్ధి చెందేలా..-ఎం.రాజశేఖర్, పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా అధికారి, నల్గొండ

మేలు జాతి పశువుల సంతతి వృద్ధితో పాల దిగుబడిని పెంచి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. వీటితో పాటు పశువుల ఆరోగ్యం ప్రధానం. సంస్థ ఆలోచనకు అనుగుణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య క్యాంపుల కార్యక్రమాన్ని నిర్వహించాం. దూడల ప్రదర్శనలు చేపట్టాం.

# కొలువులొస్తున్నాయ్..!

మిర్యాలగూడ : చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు చిన్నారులకు విద్యాబుద్ధులు బోధించాలనే లక్ష్యంతో ఏర్పాటైన అంగన్‌వాడీలు కొంత కాలంగా ఖాళీలతో సతమతమవుతున్నాయి. కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో సేవలు సక్రమంగా అందట్లేదని గ్రహించిన ప్రభుత్వం ఖాళీల భర్తీకి కసరత్తు చేస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీల వివరాలను సేకరించిన ప్రభుత్వం త్వరలోనే సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నద్ధమవుతోంది.

**ఉమ్మడి జిల్లాలో ఖాళీలు ఇవీ..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 18 ప్రాజెక్టులు ఉండగా..3,203 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 9 ప్రాజెక్టులు, 2,093 కేంద్రాలు, సూర్యాపేట జిల్లాలో 5 ప్రాజెక్టులు 1,209 కేంద్రాలు, యాదాద్రి జిల్లాలో 4 ప్రాజెక్టులు 901 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 189 అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, 683 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టుల భర్తీకి కనీసం ఇంటర్ విద్యార్హత కలిగి ఉండి...18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని కేంద్రం నిబంధనలు విధించింది.


ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు-కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలోనే ప్రతిపాదనలు పంపాం. జిల్లాలో అంగన్‌వాడీ ఉపాధ్యాయినిలతో పాటు ఇటీవల పదవీ విరమణ పొందిన, మరణించిన ఆయాల స్థానంలో కొత్త వారిని నియమించాల్సి ఉంది. నియామక ప్రక్రియపై మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

చురకలు



# సాఫ్ట్‌వేర్ పర్యాటకం

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా భాగ్యనగరం చుట్టూ పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. నగరంలో సుమారు పది లక్షల మందికిపైగా ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వారాంతపు పర్యాటకానికి కొత్త రూపు ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ నిర్ణయించింది. వారాంతం, ఇతర సెలవు రోజుల్లో ఆహ్లాదకరంగా గడిపేందుకు వీలుగా పలు ప్రదేశాలను గుర్తిస్తున్నారు. నగరం చుట్టుపక్కల వంద కిలోమీటర్ల పరిధిలో ఒకట్రెండు రోజులు గడిపేలా వాటిని అభివృద్ధి చేయనున్నారు. అక్కడ నుంచే పని చేసేందుకు ఆసక్తి చూపే వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని వసతులతోపాటుగా తగిన భద్రత,



వైఫై సౌకర్యం వంటివీ కల్పించనున్నారు. నగరానికి చేరువలో అనంతగిరి, భువనగిరి, కొలనుపాక, నల్లమల అటవీప్రాంతం తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు పర్యాటక శాఖ విధివిధానాలు రూపొందిస్తోంది. త్వరలో అందుబాటులోకి రానున్న రాష్ట్ర నూతన పర్యాటక విధానంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఎకో టూరిజం, ట్రెక్కింగ్, సైక్లింగ్ వంటి వాటికి అనువుగా వివిధ ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటకశాఖ ఉన్నతాధికారి తెలిపారు.

# గంగారంలో డబుల్ ఎలివేటెడ్ మెట్రో సాధ్యమేనా?

హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశలో డబుల్ ఎలివేటెడ్ మెట్రో మియాపూర్–పటాన్‌చెరు మార్గంలో వచ్చే అవకాశం ఉంది. మదీనాగూడ తర్వాత గంగారం వద్ద 0.8 కి.మీల మార్గాన్ని ప్రతిపాదించారు. డిజైన్లను జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) సంస్థకు అధికారులు సమర్పించారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు..: మియాపూర్ స్టేషన్ నుంచి మొదలై పటాన్‌చెరు (కారిడార్–7)వరకు వెళుతుంది. ఈ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గంగారం వద్ద ఫ్లైఓవర్‌ను, ఇదే మార్గంలో మెట్రో విస్తరణను ప్రతిపాదించారు. గంగారం వద్ద డబుల్ ఎలివేటెడ్‌పై అధ్యయనం చేశారు. మొదటి అంతస్తులో



వాహనాలు.. ఆపై అంతస్తులో మెట్రో వెళతాయి. మెట్రో డిజైన్లకు అనుగుణంగా ఎన్‌హెచ్ సంస్థ ఫ్లైఓవర్ డిజైన్లలో మార్పులు చేయాల్సి ఉంటుంది. స్పందన లేదని.. మెట్రో అధికారులు అంటున్నారు.

పది స్టేషన్లు రానున్నాయి..


కారిడార్–7 పొడవు 13.4కి.మీ. ఉంటుంది. ఈ మార్గంలో మియాపూర్ ఎక్స్‌రోడ్, ఆల్విన్ చౌరస్తా, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీపురం, ఇక్రిశాట్, పటాన్‌చెరు స్టేషన్లు ప్రతిపాదించారు.

రద్దీకి పరిష్కారంగా...: ఈ మార్గంలో రద్దీ సమయంలో గంటలో ప్రయాణించే వాహనాలు పీక్ అవర్ పీక్ డైరెక్షన్ ట్రాఫిక్ (పీహెచ్‌పీడీటీ) 2028 నాటికి 10వేలకు, 2033కు 15వేలు, 2043 కు 22వేలు, 2053 నాటికి 30వేలకు చేరుతుందని అంచనా వేశా రు. ప్రయాణాలు సజావుగా సాగాలంటే మెట్రో వంటి ప్రజారవాణా అత్యంత ముఖ్యమని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు.

# బాటసింగారం మార్కెట్‌కు మామిడి కళ

హైదరాబాద్:: బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడి రావడం జోరందుకుంటోంది. ఈ ఏడాది మామిడి సీజన్‌లో లక్షన్నర టన్నుల కాయలు క్రయవిక్రయాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ.. బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. జనవరి నుంచి ఇప్పటివరకు మార్కెట్‌కు 7892క్వింటాళ్ల మామిడి విక్రయానికి వచ్చింది. క్వింటాల్‌ధర అత్యధికంగా రూ.16,650, అత్యల్పంగా రూ.2750 పలికింది.

గతేడాది ఇలా..: గతేడాది మామిడి సీజన్‌లో జనవరి నుంచి జులై వరకు 11,39,865 క్వింటాళ్ల మామిడి వచ్చింది. దీని విలువ



రూ.321.84 కోట్లు. ఈ సీజన్ దృష్ట్యా మామిడి యార్డులో 17 తాగునీటి ప్లాంట్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. హమాలీలు, కూలీలకు షవర్ ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో 33 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసు అవుట్‌పోస్టు కోసం ఇప్పటికే అధికారులను కోరినట్లు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి వివరించారు. ఫైర్‌ఇంజిన్ మార్కెట్‌లో ఉంచాలని అగ్నిమాపకశాఖ అధికారులను కోరినట్లు తెలిపారు.

# సమయానికి రారు.. సేవలు బేజారు






హైదరాబాద్ : మార్చి నెల మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు, ఎండవేడితో చాలామంది వడదెబ్బకు గురవుతుంటారు. ఈ క్రమంలో ప్రాథమిక వైద్య సేవలు చాలా కీలకం. గ్రేటర్ వ్యాప్తంగా 200 వరకు బస్తీ దవాఖానాలు, మరో 90పైనే అర్బన్‌హెల్త్ సెంటర్లు, శివార్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వేసవి నేపథ్యంలో ఔషధాలు సిద్ధం చేసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆయా వైద్యులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గ్రేటర్‌లోని పలు బస్తీ దవాఖానాలను, యూపీహెచ్‌సీలను బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ముఖ్యంగా 80 శాతం ఆసుపత్రుల్లో సకాలంలో వైద్యులు, సిబ్బంది హాజరు కావడం లేదు. ఉదయం 9 గంటలకే కేంద్రం తెరవాల్సి ఉండగా.. కొందరు 11గంటలు దాటినా పత్తా లేకుండా పోతున్నారు. కొందరు ఆలస్యంగా వచ్చి.. మధ్యాహ్నం 1 గంట తర్వాత వెళ్లిపోతున్నారు. ముమ్ముందు ఎండలు మరింత పెరగనున్న దృష్ట్యా ఈ కేంద్రాలపై పనితీరు పెరగాల్సిన అవసరం ఉందని రోగులు కోరుతున్నారు. ఇవిగో కొన్ని ఉదంతాలు...

చర్లపల్లి డివిజన్‌లోని పెద్దచర్లపల్లి బస్తీదవాఖానాలో ఉదయం 10 గంటలు దాటినా వైద్యుడి జాడ కన్పించలేదు.

ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ బస్తీ దవాఖానాలో మందుల సరఫరా అరకొరగా ఉంటోందని రోగులు వాపోయారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని దవాఖానాకు 10.45 గంటలు దాటిన తర్వాత డాక్టర్ విధులకు హాజరయ్యారు.

లింగంపల్లిలోని బస్తీ దవాఖానాలో డాక్టర్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. వైద్యురాలిని నియమించినప్పటికీ ఆమె సెలవుపై వెళ్లిపోయారు. గోకుల్‌ప్లాట్స్‌లోని దవాఖానాలోనూ వైద్యులు లేరు.

ఖైరతాబాద్ మహాభారత్‌నగర్, కుమ్మరిబస్తీ, బీఎస్‌మక్త దవాఖానాల్లో మందుల కొరత ఉంది.

ముషీరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది.

కూకట్‌పల్లి, బాలానగర్ బస్తీ దవాఖానాల్లో మందుల కొరత ఉందని సిబ్బంది చెబుతున్నారు.

సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ వైద్యులు 11 గంటల తర్వాతే విధులకు హాజరవుతున్నారు.

# పైవంతెనలు.. అంతంతే పనులు



హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పైవంతెనల పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. పురోగతి నత్తనడకన ఉండటంతో వాహనదారులకు నిత్యం నరకం తప్పడం లేదు. అన్నీ రెండేళ్లలోనే అందుబాటులోకి రావాల్సి ఉండగా.. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం కారణంగా ముందుకు సాగడం లేదు. కూడళ్లలో వాహనాలు సాఫీగా వెళ్లేలా రోడ్లను అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2016లో రూ.25వేల కోట్ల అంచనా వ్యయంతో ఎస్సార్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం)ని ప్రారంభించింది. అందులో భాగంగా చేపట్టిన పైవంతెనలు, అండర్‌పాస్‌ల వంటి పనులు 35 పూర్తికాగా.. ఎనిమిది పురోగతిలో ఉన్నాయి.

**ఆరేళ్లయినా అవస్థలే..**

విషయం: గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు చేపట్టిన రెండో పైవంతెన నిర్మాణం ఆరేళ్లయినా పూర్తికాలేదు. 80 శాతం పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా భూసేకరణ కాలేదు. రోడ్డు విస్తరణ పురోగతిలో ఉంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, బీహెచ్ఈఎల్ రోడ్డు మధ్య రాకపోకలు సాగించే లక్షకుపైగా వాహనాలకు ప్రయోజనం.

**ఆరేళ్లయినా అవస్థలే..**

విషయం: గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు చేపట్టిన రెండో పైవంతెన నిర్మాణం ఆరేళ్లయినా పూర్తికాలేదు. 80 శాతం పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా భూసేకరణ కాలేదు. రోడ్డు విస్తరణ పురోగతిలో ఉంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, బీహెచ్ఈఎల్ రోడ్డు మధ్య రాకపోకలు సాగించే లక్షకుపైగా వాహనాలకు ప్రయోజనం.

శంకుస్థాపన: 2019

వ్యయం: రూ.313.52 కోట్లు

పూర్తి 80 శాతం

**ఆదిలోనే ఆగిపోయి..**

విషయం: తూర్పు నగరంలో ఉప్పల్, ఎల్బీనగర్ కూడళ్లు ప్రధానమైనవి. ఇప్పటికే ఎల్బీనగర్‌లో రెండు అండర్‌పాస్‌లు, రెండు పైవంతెనల నిర్మాణం 2022లో పూర్తయ్యాయి. ఉప్పల్ కూడలిలో నాగోల్ నుంచి హబ్సిగూడ దిశలో ఓ వంతెన, హబ్సిగూడ నుంచి నాగోల్ వైపు మరో వంతెన, రామంతాపూర్ వైపు, క్రికెట్ మైదానం వైపు రోడ్డుకు రెండు వేర్వేరు పైవంతెనలు నిర్మించాలని నాలుగేళ్ల కిందట ప్రారంభించిన పనులు ఆదిలోనే ఆగిపోయాయి.

కారణం: సర్వే ఇండియాకు చెందిన 8.04 ఎకరాలు, ప్రైవేటు వ్యక్తుల నుంచి 6.4 ఎకరాలు సేకరించాల్సి ఉంది. నిధుల్లేక బల్దియా ప్రక్రియను చేపట్టడం లేదు.

ప్రయోజనం: వరంగల్ జాతీయ రహదారిపై నారపల్లి నుంచి ఉప్పల్ కూడలి వరకు చేపట్టిన పైవంతెనకు కొనసాగింపుగా జీహెచ్ఎంసీ కూడలిలో నాలుగు పైవంతెనలను నిర్మిస్తోంది. ఇవన్నీ అందుబాటులోకి వస్తే ఉప్పల్ కూడలి ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుంది. రాకపోకలు సాగించే లక్ష వాహనాలకు ప్రయోజనం.

శంకుస్థాపన: 2021

వ్యయం: రూ.311 కోట్లు

పూర్తి 8 శాతం

**నత్తనడకన పనులు**

విషయం: చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు3.38 కి.మీ.ల పొడవున నిర్మిస్తున్న ఉక్కువంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లర్ల గుంతలు, అసంపూర్తి పనులతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఐఎస్‌సదన్, చంచల్‌గూడ, కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

కారణం: భూసేకరణ, రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ప్రయోజనం: సాగర్ రోడ్డు, ఒవైసీ ఆసుపత్రి, నల్గొండ ఎక్స్‌రోడ్డు, పాతబస్తీలోని ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయి.

శంకుస్థాపన: 2021

వ్యయం: రూ.620 కోట్లు

పురోగతి: 48 శాతం

# నాలాల్లో చెత్త వేస్తే.. రూ.10వేలు

హైదరాబాద్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, ప్రజల్లో పరిశుభ్రతపై బాధ్యతను పెంచేందుకు జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మొక్కుబడిగా మారిన జరిమానాల విధానాన్ని.. ఇకపై పక్కాగా అమలు చేయడంపై కమిషనర్ ఇలంబర్తి దృష్టిపెట్టారు. జరిమానాల విధానం పారదర్శకంగా అమలయ్యేందుకు లోపాల్లేని మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నామని, తయారీ బాధ్యతలను టీసీఎస్‌కు అప్పగించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**అధికారులకు శిక్షణ..**

యాప్ తయారీ నెలరోజుల్లో పూర్తవనుందని, అనంతరం దానిని ఉపయోగించే విధానంపై అధికారులకు శిక్షణ ఇవ్వ నున్నట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. పారిశుద్ధ్య విభాగానికి సంబంధించిన జరిమానాల విధింపును సహాయ వైద్యాధికారులు, నిర్మాణ వ్యర్థాలపై ఉండే జరిమానాలను టౌన్ ప్లానింగ్ అధికారులు విధించనున్నారు. అందుకోసం 19రకాల ఉల్లంఘనలు, వాటి జరిమానా విలువను అధికారులు లెక్క తేల్చారు. సర్కిళ్ల వారీగా అధికారులకు లాగిన్‌లు ఉంటాయి. జరిమానా విధించేటప్పుడు ఉల్లంఘన ఫొటో తీయాలి. అధికారి పేరు, జరిమానా మొత్తం, ఉల్లంఘనుల పేరు, ఫోన్ నెంబరు, చిరునామాతో డిజిటల్ రసీదు వస్తుంది.

**జరిమానాలు ఇలా..**

రోడ్డుపై చెత్త వేస్తే: రూ.100


బహిరంగ మూత్ర విసర్జన: రూ.100

గోడలపై రాతలు: రూ.1000

కాలువల్లో చెత్త వేస్తే: రూ.1000

దుకాణదారులు రోడ్డుపై చెత్త వేస్తే: రూ.1000–రూ.2,000

గోడలపై పోస్టర్లు: రూ.2వేలు



అనుమతిలేని బ్యానర్లు, కటౌట్లు: రూ.5వేలు

బస్తీలు, కాలనీరోడ్లపై, ఖాళీస్థలాల్లో నిర్మాణ వ్యర్థాల డంపింగ్, తరలింపు..: రూ.5వేలు

చెరువులు, రోడ్లు, నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే: రూ.5వేలు

బహిరంగంగా ప్లాస్టిక్‌ను కాలిస్తే: రూ.5వేలు

నాలాల్లో చెత్త వేస్తే: రూ.10వేలు

ప్లాస్టిక్ కవర్లు, సంచుల నిల్వ లేదా విక్రయం..: మొదటి తప్పునకు రూ.10వేలు, రెండో తప్పునకు రూ.25వేలు, మూడో తప్పునకు దుకాణం మూత

నిర్మాణ వ్యర్థాలను భారీగా అనుమతిలేని వాహనాలకు ఇచ్చేసంస్థకు: రూ.50వేలు

# తుది దశకు విజిలెన్స్ విచారణ

కరీంనగర్ : కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో అవినీతి, అక్రమాలు జరిగాయని విద్యార్థి, ప్రజా సంఘాలు ఆరోపణలు, నిరసనలు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 15 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. దీనిపై ప్రభుత్వం గత జులైలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీని విచారణకు ఆదేశించింది. అప్పటినుంచి 8 నెలలుగా ఒక్కో అంశంపై కూలంకుశంగా విచారణ చేపడుతూ వస్తున్నారు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరత, ఫిర్యాదు అంశాలు ఎక్కువగా ఉండటంతో ఆలస్యమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**అనర్హులను నియమించారని..**

గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలో నియామకాలు చేపట్టారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. కనీస అర్హత లేనివారిని ఆచార్యులు, సహా ఆచార్యులుగా నియమించారని ఫిర్యాదులో తెలిపారు. రెగ్యులర్ కోర్సులుగా ఉన్న నాలుగు విభాగాలను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా చూపి యూజీసీ–12బీ గుర్తింపు కోసం తప్పుడు నివేదికను సమర్పించారని ఆరోపించారు. పరిపాలన భవనం మొదటి అంతస్తు నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించక నిధులు దుర్వినియోగం చేశారని చెబుతున్నారు.

**ఉద్యోగం వదిలేయడంపై అనుమానాలు..**

2021–22, 2022–23లో జరిగిన ఆడిట్ నివేదికలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు తమ పిటిషన్‌లో కోరారు. జులైలో




విజిలెన్స్ విచారణ ప్రారంభం కాగానే అప్పటి ఫైనాన్స్ అధికారి సెలవుపై వెళ్లారు. అనంతరం ఉద్యోగం నుంచి తప్పుకొంటున్నట్లు వెల్లడించారు. ఎక్కడ తన మెడకు చుట్టుకుంటుందోనని ఆ అధికారి పక్కకు తప్పుకొన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. విచారణ ప్రారంభించే కంటే 2 నెలలముందే అప్పటి ఉపకులపతి ఉద్యోగ విరమణ కావడంతో.. ఆరు నెలలుగా ఇన్‌ఛార్జి వీసీ పాలనలో కొనసాగింది. ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్ అక్టోబరులో బాధ్యతలు చేపట్టారు. మరో 15 రోజుల్లో విచారణ నివేదికను విజిలెన్స్ ఉన్నత కార్యాలయానికి పంపి.. అనంతరం అటునుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు కరీంనగర్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అచ్చేశ్వర్‌రావు తెలిపారు.

**సిబ్బంది పీఎఫ్ డబ్బులపై..**పరీక్ష పేపర్ లీకేజీలు, టెండరు లేకుండానే పరీక్ష జవాబుపత్రాల స్కానింగ్ ప్రక్రియపై ఓ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని.. గత ఉపకులపతి రెసిడెన్స్ నిర్వహణలో ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. బోధనేతర సిబ్బంది పీఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా.. ఫైనాన్స్ అధికారి, అప్పటి రిజిస్ట్రార్ వద్దనే అంటిపెట్టుకున్నట్లు తెలిపారు.

# సేకరిస్తారా.. మూసేస్తారా!

పెద్దపల్లి : సీజన్ చివరి దశకు రావడం, పత్తిలో నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయనే సాకుతో కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసేందుకు సీసీఐ చర్యలు చేపడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే కేంద్రాలను ఎత్తివేయడంతో అక్కడి రైతులు మన జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తితో మిల్లులు నిండిపోతుండగా, ఇక్కడి రైతులు అమ్మకానికి అవస్థలు పడుతున్నారు. మరోవైపు మన జిల్లాలోనూ సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం నుంచి సేకరణ ప్రక్రియ నుంచి సంస్థ తప్పుకొంటుందన్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో సీసీఐ(భారత పత్తి సంస్థ) కొనుగోలు కేంద్రాలను ఎత్తివేయడంతో బీమారం మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం సాంబయ్య మంగళవారం 15 క్వింటాళ్ల పత్తిని పెద్దపల్లిలోని ఒక జిన్నింగ్ మిల్లుకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎత్తివేయ డంతో ఇక్కడికి తీసుకురావాల్సి వచ్చిందని చెప్పారు. ఆయనొక్కడే కాదు.. ఆ జిల్లాకు చెందిన చాలా మంది రైతుల వాహనాలు మిల్లు వద్ద బారులు తీరాయి.

**ధరలపై డాలర్ ప్రభావం**

సాధారణంగా మార్చి నెలలో పత్తి ధరలు పెరుగుతాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు పలికిన సందర్భాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం పత్తి ధరలపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు(ముఖ్యంగా దిగుమతి చేసుకునే వస్తువులు) గత నెల రోజుల వ్యవధిలో బాగా పెరిగాయి. రూపాయి



మారకం విలువ పడిపోవడంతో పత్తి బేళ్ల ధర కూడా తగ్గిపోయింది. దీని ప్రభావం ఎగుమతులపై పడటంతో పాటు పత్తి ధరలను ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితుల కారణంగానే గతానికి భిన్నంగా మార్చి నెలలో ధరలు తిరోగమనంలో ఉన్నాయి. ఇదే సమయంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఎత్తివేస్తారన్న ప్రచారంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ధాన్యం సీజన్‌లో చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం పత్తి సేకరణలో ఇందుకు వ్యవహరించడం సరికాదని అభిప్రా యపడుతున్నారు.

**ఇళ్లలోనే 40 శాతం నిల్వలు**

ఇప్పటివరకు జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 3.13 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఇదే సమయంలో ప్రైవేటు కొనుగోలుదారులు 90 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో గతేడాది 52,578 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం కనీసం 7 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 4.03 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే రైతులు విక్రయించారు. ఇందులో ఇతర జిల్లాలకు చెందిన సరకు కూడా ఉంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం రైతుల వద్ద మరో 40 శాతం నిల్వలులన్నాయి. ప్రైవేటులో ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో రైతులు పత్తిని అమ్మకుండా అట్టిపెట్టుకున్నారు.

# యూరియా ఏమాయె..?

సూర్యాపేట : జిల్లాలో 2024-25 యాసంగిలో 4.46 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేపట్టారు. అందులో ప్రధానంగా వరి 3.52 లక్షల ఎకరాల్లో చేపట్టారు. ధాన్యం దిగుబడికి యూరియా పలుమార్లు చల్లాల్సి ఉంది. ఇలా ఎకరాకు మూడుసార్లు మొత్తంగా నాలుగు బస్తాల వరకు వేస్తారు.

**వరికే ఎక్కువ వినియోగం**

రైతులకు నాణ్యమైన యూరియాను సరఫరా చేయాల్సిన ప్రభుత్వం నాసిరకంగా పంపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు రకం అడిగితే సన్న యూరియా, సన్నది అడిగితే దొడ్డు ఎరువు ముడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు..**

జిల్లాలో యాసంగిలో చేపట్టిన సాగుకు 34,023 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం పడుతుందని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 25,653 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. అందులో సగం సొసైటీలకు, మిగతా సగం ప్రైవేటు వ్యాపారులకు కేటాయిస్తున్నారు. సంఘాలకు కేటాయించిన యూరియా నాసిరకంగా ఉండటమే కాకుండా రాళ్లలా ఉంటోంది. దీంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తే కొన్నిచోట్ల అధిక ధరకు, మరికొన్ని దుకాణాల్లో ఇతర మందులకు ముడిపెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ



అధికారులు స్పందించి నాణ్యమైన యూరియా అందించి న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం రైతు విసవరం శరత్‌రెడ్డి యాసంగిలో పదెకరాల్లో వరి సాగు చేశారు. పొలంలో చల్లేందుకు నెమ్మికల్ సహకార సంఘంలో 18 బస్తాల యూరియా తీసుకున్నారు. బస్తాలు విప్పి చూడగా అంతా పెద్ద పెద్ద బండరాళ్ల వలె ఉంది. దీన్నంతా పొడిగా మార్చేందుకు రోజంతా కష్టపడాల్సి పరిస్థితి నెలకొంది. దీంతో చేతులు మొత్తం బొగ్గలు ఎక్కాయని, పని కూడా ఎక్కువ సమయం పట్టిందని వాపోయారు. హుజూర్‌నగర్‌లోని సహకార సంఘంలో యూరియా సరిగా సరఫరా చేయడం లేదని అన్నదాతలు ధర్నా చేశారు.

తనిఖీలు చేపడుతున్నాం:శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట

నాణ్యమైన యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నా్ం. కొన్ని చోట్ల యూరియా బాగా లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు వ్యాపారులు యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

# చిప్పల మార్పిడి ఎప్పుడో..!

నల్గొండ : పేదలకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్స ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పథకం కింద చేర్చి రూ.1.50లక్షల వరకు నిధులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేస్తే రూ.3-4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో దీని కోసం అన్ని రకాల వసతులు కల్పించారు. అయినా నేటికి ఒక్క మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేయకపోవడం గమనార్హం. బాధితులు శస్త్రచికిత్సల కోసం వార్డుకు వస్తే వారిని ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్యులు చేతులు దులుపుకొంటున్నారు.

**ఏడాది క్రితమే వార్డు ఏర్పాటు..**

జనరల్ ఆసుపత్రిలో మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్సకు ఏడాది



క్రితం రూ.20 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేక విభాగం తయారు చేశారు. ప్రజాప్రతినిధులు దీనిని ప్రారంభించి మూడు నెలలు దాటింది. ప్రస్తుతం ఈ విభాగంలో 18 మంది ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరు ప్రొఫెసర్లు మోకాళ్ల మార్పిడిపై రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. వైద్యాధికారుల సమన్వయ లోపంతో శస్త్రచికిత్సలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యవిధాన పరిషత్ పరిధిలోని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో గడిచిన ఆరు నెలల్లో 12 శస్త్రచికిత్సలు జరిగినట్లు సంబంధిత అధికారుల చెబుతున్నారు. ఇక్కడ ప్రొఫెసర్లు, ఉన్నత స్థాయి విభాగాధిపతులు ఉన్నా ఒక్క శస్త్రచికిత్స జరగకపోవడం శోచనీయం.

త్వరలో నిర్వహిస్తాం: డా.అరుణకుమారి, ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌జనరల్ ఆసుపత్రిలో మెకాళ్ల చిప్పల మార్పిడి శస్త్రచికిత్సలు జరగని మాట వాస్తవమే. మరికొన్ని పరికరాలు అవసరం ఉంది. వాటిని సమకూర్చుకుని త్వరలో సేవలు ప్రారంభిస్తాం.

# సైబర్ నేరాల కట్టడికి 'చక్షు'

మునగాల : డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసం చేస్తున్నారు. చరవాణి ద్వారా ప్రజలను తేలికగా మోసం చేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇలాంటి నేరాలన్నింటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చక్షు పేరుతో ఓ కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

హిందీలో చక్షు అంటే కన్ను అని అర్థం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ విభాగం చక్షు-రిపోర్టు సస్పెక్టెడ్ ఫ్రాడ్, అన్‌సాలిసిటేడ్ కమర్షియల్ కమ్యూనికేషన్ అనే పోర్టల్‌ను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. అనుమానిత, మోసపూరిత కాల్స్, సందేశాల వివరాలను ఇందులో నమోదు చేయవచ్చు.

**ఎలా ఫిర్యాదు చేయాలి...** ఫిర్యాదు చేయడానికి ముందు 'సంచార్‌సాథి' పోర్టల్‌లోకి వెళ్లాలి. అందులో ఉన్న సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లోకి వెళ్లి చక్షు ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మనకు వచ్చిన మోసపూరిత ఫోన్, వాట్సప్ మెసేజ్ వంటి వివరాలను, వచ్చిన తేదీ, సమయాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం వ్యక్తిగత పేరు, ఫోన్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దాన్ని పొందుపరిచిన అనంతరం ఫిర్యాదు పూర్తవుతుంది.

# ఆకురాలే కాలం... అగ్గిరేఖలు అవసరం



సిరిసిల్ల : పచ్చని అందాలు పంచిన వనాలు జనవరి చివరి వారంలో వాతావరణంలో మార్పుతో ఆకు రాలుస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. నేలపై రాలిన ఆకుల్లో అగ్గి రాజుకుంటే అడవికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముందస్తు చర్యలతో ఈ ప్రమాదాలను అరికట్టేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే వేసవికాలంలో అడవుల్లో మంటలు ఎగిసిపడితే తీవ్ర నష్టం ఏర్పడుతుంది.

జిల్లాలో రెండు రేంజ్‌ల పరిధిలో సుమారు 33 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో 12 సెక్షన్లు, 44 బీట్‌లు ఉన్నాయి. ప్రధానంగా రుద్రంగి, చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట మండలాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కామారెడ్డి, నిజామాబాదు, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల సరిహద్దుల వరకు అటవీ ప్రాంతం ఉంది. ప్రధానంగా ఆకురాల్చే అడవులే ఉండగా ప్రస్తుతం సీజన్ మొదలైంది. ఫిబ్రవరిలో సైతం అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా పనులు చేపడితే చాలా వరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. పంచాయతీ కార్యదర్శులకు సైతం వనాల్లో మంటలు ఆర్పివేయించే బాధ్యతను అప్పగించారు.

ఉపయోగాలు ఇలా...వేసవికాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్గిరేఖలు ఉపయోగపడుతుంటాయి. మంటల వ్యాప్తిని చాలా వరకు కట్టడి చేస్తుంటాయి. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్‌తో రహదారి పక్కన సిగరెట్టు, బీడీలతో కలిగే ప్రమాదాలు చాలా వరకు రేఖల వద్ద ఆగిపోతుంటాయి. మీటరుకు పైగా వెడల్పుతో ప్రతి వంద మీటర్లకు చొప్పున డబ్బా ఆకారంలో 100 వేస్తారు. ఒకవేళ ఆ ప్రాంతంలో అంటుకున్న మంటలు అక్కడికే పరిమితమవుతాయి.

కారణాలు ఇవీ...

అడవుల్లో మంటలు వ్యాప్తి చెందేందుకు ధూమపానం అలవాటున్న కొందరు ఆకతాయిలు కారణమవుతున్నాయి.

వేసవిలో కలప తరలించే ముఠాలు ఆకులు చప్పుడు కాకుండా నిప్పుపెడుతుంటాయని సమాచారం.

మార్చిలో తునికాకు ఆ తర్వాత ఇప్పపువ్వు ఇప్పపరక వంటి అటవీ ఫలాలు లభిస్తుంటాయి. అయితే విష పురుగుల బారిన పడకుండా, సులువుగా అటవీ ఫలాలను సేకరించేందుకు వనాలకు అగ్గిపెడుతుంటారు.

ఒకచోట రాజుకున్న అగ్గి అడవంతా వ్యాప్తి చెందుతుంది. దీంతో విలువైన ఔషధ మొక్కలు, వృక్ష జాతులు, అరుదైన జీవ జాతులు అంతరించిపోతుంటాయి.

వనాన్ని ఆవాసంగా మలచుకున్న జీవరాశుల మనుగడ చెదిరిపోతుంది. వన్యప్రాణులు ఆవాసాలు కోల్పోయి పంట పొలాలు, గ్రామాల్లోకి వస్తుంటాయి. ఇలాంటి నష్టాన్ని అరికట్టేందుకు అగ్గిరేఖలే అసలైన ఆయుధం.

ఫిబ్రవరి నుంచి పనులు మొదలు పెడితే భవిష్యత్తులో ముప్పువాటిల్లకుండా ఉంటుంది.

ప్రజల భాగస్వామ్యం అవసరం

విలువైన అటవీ సంపద పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అటవీశాఖ, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు సామాజిక బాధ్యతగా మెలగాలి. అటవీశాఖ సిబ్బందికి సహాయం చేయాలి. దూరం నుంచి మంటలు ఆపే చర్యలు తీసుకోవాలి. జిల్లాలో అగ్గిరేఖలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేగవంతంగా పూర్తి చేసి అడవికి నష్టం కలగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేస్తాం.కల్పనదేవి, అటవీక్షేత్రాధికారి సిరిసిల్ల

# బృహత్తర ప్రణాళికకు వేళాయె



కోరుట్ల : కోరుట్ల పట్టణంలో 2010లో అప్పటి ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ (బృహత్తర ప్రణాళిక)ను రూపొందించారు. ప్లాన్ ప్రకారంగా జోన్‌లు, రోడ్ల విస్తీర్ణం, ఇతర అంశాలను నిర్ణయించారు కానీ.. ప్లాన్‌ను ఇప్పటి వరకు అమలు చేసిన దాఖలాలు లేకుండా పోయాయి.

**డ్రోన్ సర్వేతో హద్దుల గుర్తింపు**

కోరుట్ల పట్టణంలో సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమృత్ 2.0 కింద ప్రత్యేక బృంద సభ్యులు ఇటీవల డ్రోన్ సర్వేను పూర్తి చేశారు. పట్టణంలో 33 వార్డులు, మొత్తం 22,115 ఇళ్లు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 69,479 (ప్రస్తుతం సుమారు 86,000) ఉంటుంది.

2040వ సంవత్సరం వరకు పట్టణంలో పెరిగిన జనాభాకు ఉపయోగపడేలా మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టనుంది.

పట్టణం మొత్తం 32.8 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించినట్లు గుర్తించారు.

పట్టణం చుట్టూ 10 కిలోమీటర్ల వరకు బఫర్‌జోన్‌గా నిర్ణయించారు.

ఈ విస్తీర్ణాన్ని జీఐఎస్ (జియోగ్రఫీ ఇన్ఫ్యామెంట్ సిస్టమ్) ఆధారంగా మొత్తం 48 సర్వే పాయింట్ (హద్దు)లుగా గుర్తించారు.

మెట్‌పల్లి పట్టణంలో సర్వే ఇంకా కొనసాగుతోంది.

జీఐఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన సర్వే తుది పట్టణ మ్యాప్‌లను త్వరలో రూపొందించనున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రవీణ్ పేర్కొన్నారు.

మార్చాలని నిర్ణయించినా..

ప్రభుత్వం కోరుట్ల మున్సిపల్ దగ్గర్లో ఉన్న ఏఖీన్‌పూర్ గ్రామ పంచాయతీని 2018లో విలీనం చేసింది. కోరుట్ల పట్టణ విస్తీర్ణం, జనాభా పెరగడంతో పాత మాస్టర్ ప్లాన్ మార్చాలని నిర్ణయించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో అమృత్ 2.0 అమలు చేయాలని నిర్ణయించింది. 2040 వరకు పెరగనున్న జనాభా, ప్రజల నివాసానికి అనుగుణంగా ఉండేలా కోరుట్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, జోన్‌లు, కావాల్సిన విస్తీర్ణం, రోడ్ల విస్తరణ ఉండేలా నూతన మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా ప్రత్యేక సర్వేలు చేయాలని ఆదేశించింది.

# చే'నేత'లను ఎప్పుడు ఎన్నుకుంటారో..?



చౌటుప్పల్ : చేనేత, మరమగ్గాల, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించి పుష్కరం దాటింది. ఈ ప్రభుత్వం కూడా ఎన్నికలు నిర్వహించే సూచనలు కనిపించడం లేదని చేనేత పారిశ్రామికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2013 ఫిబ్రవరి 12న ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘాల పదవీకాలం అయిదేళ్లే. 2018 ఫిబ్రవరి 11తో ఎన్నికైన పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఎన్నికలు నిర్వహించకుండా ప్రతి ఆర్నెళ్లకోసారి చొప్పున ప్రభుత్వం పొడిగిస్తూ వస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈసారి ఎన్నికలు నిర్వహిస్తారని, నూతన పాలకవర్గాలను ఎన్నిక చేసి సహకార సంఘాలకు జీవం పోస్తారని చేనేత పారిశ్రామికులు ఆశించారు. ఎన్నికలు నిర్వహించాలంటే నలభై రోజుల ముందే ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. తెలంగాణ వ్యాప్తంగా చేనేత, సిల్క్, ఉన్ని, మరమగ్గాల సహకార సంఘాలు 375 వరకున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే 85 సంఘాలున్నాయి. 2018లో అన్ని చేనేత సహకార సంఘాల్లో ఓటు హక్కుకు అర్హత ఉన్న చేనేత పారిశ్రామికుల జాబితాలను చేనేత, జౌళి శాఖ సిద్ధం చేయించింది. ఎన్నికలు నిర్వహించాలంటే తాజా జాబితాలను సవరించేందుకు అవకాశమివ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేనేత అభయహస్తం పథకం సద్వినియోగం చేయించేందుకు సహకార స్ఫూర్తితో నెలకొల్పిన ఈ సంఘాలకు సమర్థవంతమైన, పట్టుదల, అంకితభావం, దార్శనికత గల పాలకవర్గాలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు...

పద్మ, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, చేనేత, జౌళి శాఖ

చేనేత సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. ఆదేశాలు జారీ చేస్తే ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తాం. అయిదేళ్ల పదవీ కాలానికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. వారి పదవీ కాలం ముగిశాక సహకార చట్టం ప్రకారం పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. వారి నియామకాన్ని ఆర్నెళ్లకు ఒకసారి ప్రభుత్వం పొడిగిస్తూ ఉంది.

# కొత్త బంగారు లోకం..!

ఖమ్మం : ఉన్నత పాఠశాల స్థాయిలోని కౌమార దశ విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ అంశాల పరంగా బాలబాలికలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించింది. వారిలో అపోహలు, భయాందోళనలనూ తొలగించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో 230, భద్రాద్రి జిల్లాలో 126 ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయిని ఖమ్మంలోని జిల్లా విద్యా,శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో తర్ఫీదు పొందారు. ఎనిమిది అంశాలపై శిక్షణ సాగింది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించి వారిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తారు.

**కౌన్సెలింగ్ అండ్ కెరీర్ గైడెన్స్**

పదోతరగతి తర్వాత విద్యార్థులకు ఎన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయనే వివరాలు వెల్లడిస్తారు. విద్యావకాశాలనూ వివరిస్తారు.

**బేసిక్ కౌన్సెలింగ్ నైపుణ్యాలు**

పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయాందోళనను పోగొడతారు. మానసిక ఉద్వేగాల నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులను విడమరిచి చెబుతారు.



**కౌమార దశలో సమస్యల పరిష్కారం**

ఉన్నత పాఠశాలల విద్యార్థులు 10-16 సంవత్సరాల వయసు కలిగి ఉంటారు. బాల్యం నుంచి యవ్వన దశలో అడుగుపెట్టే సమయం. ఈ దశలో శారీరక, మానసిక భావోద్వేగాల పెరుగుదల వేగంగా ఉంటుంది. ఇలాంటి మార్పుల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరిస్తారు.

**వైకల్య లక్షణాల గుర్తింపు**

కౌమార దశలో మానసిక స్థితుల ఆధారంగా వారిలో కనిపించే వైకల్య లక్షణాలు, వాటి నివారణ ఉపాయాలను సూచిస్తారు.

**కెరీర్ ఆప్షన్స్**

ఇటీవల కాలంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును విద్య, వైద్యరంగాల్లో ఉపయోగిస్తున్నారు. డిజైనింగ్, సివిల్, సివిల్స్, ఆర్మీ, నేవీ తదితర రంగాల్లోనూ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఉపాధ్యాయులు విడమరిచి చెబుతారు.

**ఒత్తిడి నుంచి దూరం**

దైనందిన జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్ల నుంచి విద్యార్థులు ఎలా బయటపడాలో వివరిస్తారు. ఆందోళనను నియంత్రించే మార్గాల గురించి చెబుతారు. విద్య, ఉపాధి పట్ల సానుకూల దృక్పథం అలవడేందుకు కృషిచేస్తారు.

**పరీక్ష సాధన సూత్రాలు**

పదోతరగతి విద్యార్థులకు ఉత్తమ పరీక్ష సాధన సూత్రాలను వివరిస్తారు. తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నియమాలు, సమయపాలన, సామాజిక బంధాలు, బాంధవ్యాల గురించి తెలియజేస్తారు.

**వివిధ రకాల కోర్సులపై అవగాహన**

పదోతరగతి తర్వాత చాలామందికి ఇంటర్మీడియట్ కోర్సు గురించి మాత్రమే తెలుసు. ఇతర అనేక వృత్తి విద్యాకోర్సుల గురించి అవగాహన ఉండదు. ఇలాంటి వాటి గురించి ఉపాధ్యాయులు వివరిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తొలుత ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇలాంటి వారంతా కౌన్సెలర్లుగా వ్యవహరిస్తూ విద్యార్థులకు తమ బలాలు, బలహీనతలను తెలియజేస్తారు. ఉద్యోగ, ఉపాధి, విద్యావకాశాల గురించి వివరిస్తారు. భవిష్యత్తులో ఆసక్తిగల రంగాలను విద్యార్థులు ఎంచుకునేలా తోడ్పాటునందిస్తారు. పెసర ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్

# పైపైకి ఉబ'గంగ'


ఖమ్మం : జిల్లాలో ఈ ఏడాది జనవరి నెల ముగిసే సరికి సగటున 4.49 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయి. 2024 జనవరిలో 5.46 మీటర్ల లోతులో ఉండగా.. గతేడాది కన్నా ఈసారి 0.97 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పెరిగింది. ఈఏడాది సమృద్ధిగా వర్షాలు కురవటంతోపాటు సాగర్ కాల్వల ద్వారా నీరు ప్రవహిస్తున్నందున భూగర్భ జలమట్టం ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఖమ్మం అర్బన్ మండలంలో మాత్రం భూగర్భ జలమట్టం



తగ్గుముఖం పటింది. 2024 జనవరిలో 1.32 మీటర్ల లోతులో ఉన్న నీరు 2025 జనవరిలో 1.77 మీటర్ల లోతుకు జారిపోయింది. అంటే 0.45 మీటర్ల లోతుకు దిగిపోయింది. కామేపల్లి మండలంలో 0.05 మీటర్లు, వైరా మండలంలో 0.26 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం జారిపోయిందని భూగర్భజలశాఖ అధికారి విష్ణు తెలిపారు. జిల్లాలో మిగతాచోట్ల భూగర్భజలాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు.

## స్టాంపులా.. ఆన్‌లైన్ ఎర్రర్

తిరుపతి : ఆస్తుల క్రయవిక్రయాలకు వినియోగించే స్టాంపు పత్రాల అమ్మకాలకు 'ఆన్‌లైన్ ఎర్రర్' అడ్డుపెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగినన్ని అందుబాటులో ఉంచినా.. వాటి అమ్మక వివరాల నమోదు భారమని భావించి 'ఆన్‌లైన్ ఎర్రర్' అంటూ ప్రజలను పంపేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రజలు వెండర్లను ఆశ్రయించి వారికి అడిగినంత చెల్లిస్తున్నారు. తిరుపతి, తిరుపతి రూరల్ కార్యాలయాల్లో ఇదేతీరు కనిపిస్తోంది. వినియోగదారులకు అవసరమైన జుడీషియల్, నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచి అమ్మకాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. అయితే వాటిని విక్రయించడానికి సిబ్బంది చొరవచూపడం లేదన్న విమర్శలున్నాయి. మంగళవారం అర్బన్




కార్యాలయానికి వచ్చిన వినియోగదారులను ఆన్‌లైన్ పనిచేయడం లేదని వెనక్కు పంపారు. రిజిస్ట్రేషన్ యథావిధిగా కొనసాగించారు. వెండర్లతో ఉన్న రహస్య ఒప్పందంతోనే ఇలా చేస్తున్నారనే విమర్శలు న్నాయి. అటు మ్యానువల్ నకలు, ఈసీల కోసం రోజులతరబడి ఎదురుచూపులు తప్పడం లేదు.

**స్లాట్ బుకింగ్‌కు అవస్థలు** ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వేచిఉండాల్సిన అవసరం లేకుండా స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం ముందుగా ఆన్‌లైన్‌లో డేటా నమోదు చేసుకోవాల్సి ఉంది. దానికి సంబంధించిన సంపూర్ణ వివరాల కోసం కార్యాలయాల్లో సంప్రదిస్తే సహకరించడం లేదనే ఆరోపణలున్నాయి. చేసేదిలేక లేఖరులను ఆశ్రయించాల్సి వస్తోంది.

## అక్రమ వెంచర్లు.. అనుమతి లేని మిద్దెలు

కర్నూలు: ఐదేళ్లలో 'కుడా' పరిధిలో జరిగిన అక్రమాలపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాలో వైకాపా నేతలు స్థిరాస్తి వెంచర్లలో వాటాలు పుచ్చుకొన్నారు. అక్రమ వెంచర్లను అడ్డుకోవడానికి కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ని విస్తరించినట్లు చెప్పి ఎక్కడికక్కడ బేరం పెట్టారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) 2017లో ఏర్పడింది. మొదట 2,599 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలో కర్నూలు నగరపాలకసంస్థతో పాటు నంద్యాల, డోన్, మున్సిపాలిటీలు, గూడూరు, బేతంచెర్ల నగర పంచాయతీల్లో 117 గ్రామాల పరిధిలో కుడా ఏర్పాటు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కుడా పరిధిని విస్తరించారు. 53 మండలాలను కలుపుకొని 15,306 చదరపు కి.మీల విస్తీర్ణంలో 896 గ్రామాలను కుడా పరిధిలోకి తీసుకొచ్చి అక్రమాలు విస్తరించారు. 278 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తేల్చిన అధికారులు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు ఇస్తున్నారు.

**క్రయ విక్రయాల నిలిపివేత?**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనుమతి లేకుండా వెంచర్లు వేసిన రెండు వందల మందికి తాఖీదులు ఇచ్చారు.. అందులో ఏడుగురే స్పందించారు. తప్పును సరిచేసుకోవాలని సూచించినా పలువురు స్పందించక పోవడంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని 'కూడా' అధికారులు నిర్ణయించారు. అనధికార లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి, విద్యుత్తు, కుళాయి కనెక్షన్లకు అనుమతులు ఇవ్వకుండా నిలిపివేయాలని సంబంధితశాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఆయా లేఅవుట్లు ఉన్న సర్వే నంబర్లు గుర్తించి వాటిలో క్రయ విక్రయాలు జరగకుండా ఆపడానికి ఉన్న అన్ని అవకాశాలు పరిశీలిస్తున్నారు.

భారీ భవనాలు నిర్మించేశారు

కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, నంద్యాల, పాణ్యం పరిధిలో అనుమతుల్లేని వెంచర్లు అత్యధికంగా ఉన్నాయి. ఆత్మకూరు, నందికొట్కూరు, కోడుమూరు, బేతంచెర్ల, బనగానపల్లి, ఆదోని, వెల్దుర్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు పరిధిలో వెంచర్లు ఇష్టానుసారంగా వేశారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.. హోటళ్లు, లాడ్జీలకు డిమాండ్ ఉండటంలో పలువురు ఎలాంటి అనుమతులు లేకుండానే బహళ అంతస్తులు నిర్మించారు. ఇక్కడ ఇలాంటివి 50 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కర్నూలులోని ఓ ప్రముఖ స్థిరాస్తి సంస్థ రూ.కోట్ల విలువైన హంద్రీ భూములను ఆక్రమించి వెంచర్లు వేసింది.గార్గేయపురం పరిధిలో వాగును ఆనుకొని ప్రముఖ స్థిరాస్తి సంస్థ విల్లాలు నిర్మించింది. 1.24 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు నిగ్గుతేల్చారు.

## టిడ్కో ఇల్లు.. కష్టాలకు చెల్లు

ఆదోని : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. జూన్ నాటికి రెండు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సంకల్పించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చెల్లించాల్సిన బకాయిలపై వివరాలు ఆరా తీస్తోంది. మిగిలిన ఇళ్లకు వెచ్చించాల్సిన నిధులపై ప్రతిపాదనలు పంపాలని ఆయా అధికారులను ఆదేశించింది. బకాయిలు వెంటనే చెల్లించాలని నిర్ణయించింది. ఆరు పట్టణాలు.. 30,576 ఇళ్లుపట్టణాల్లో మధ్యతరగతి వాసుల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. ఉమ్మడి జిల్లాలో ఆరు పురపాలిక సంఘాల పరిధిలో 30,576 గృహాల నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.1500–2000 కోట్లు. లబ్ధిదారుల వాటా కింద రూ.29.79 కోట్లు చెల్లించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని పట్టించుకోలేదు. రూ.18.22 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తి చేయడానికి మరో రూ.100 కోట్ల వరకు అవసరం అవుతాయి. కర్నూలు, నంద్యాల టిడ్కో గృహ సముదాయంలో మహిళా మార్టుల నిర్మాణానికి మరో రూ.కోటి నిధులు అవసరం.

## అటకెక్కిన ఆదేశాలు... విధుల్లోనే అక్రమార్కులు..!



విశాఖ : వైకాపా హయాంలో మహా విశాఖ నగర పాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి)లో జరిగిన అక్రమాలపై ఆధారాలతో ఫిర్యాదులు అందడంతో.. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాటి కమిషనర్ ఆదేశించారు. తర్వాత కమిషనర్ బదిలీ కావడంతో దస్త్రం మూలకు చేరింది. గత ప్రభుత్వ పాలనలో కోట్ల రూపాయల నిధులు జేబులో వేసుకుని, నాటి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి ఉద్యోగాలు కాపాడుకున్న వారిపై... నేటి కూటమి ప్రభుత్వం విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నా, కనీసం పట్టించుకోక పోవడం గమనార్హం. అయితే అప్పట్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న వారంతా ప్రస్తుతం దర్జాగా కొలువుల్లో కొనసాగుతున్నారు.

**ఇవీ ఆరోపణలు:** కొవిడ్ సమయంలో మాస్కులు కుట్టించి, సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 లక్షలతో టెండర్లు పిలిచి, జీవీఎంసీ మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించింది. కేవలం 3 వేల మాస్కులు మాత్రమే కుట్టి, రూ.70 లక్షలకు పైగా నిధులు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

నాటి ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డికి సన్మానం, పిక్నిక్ నిర్వహణకు ఓ పొరుగు సేవల ఉద్యోగి 1100 మంది ఆర్పీల నుంచి రూ.3వేల చొప్పున రూ.33 లక్షలు వసూలు చేశారు. అనంతరం సాయిరెడ్డికి సన్మానం, పిక్నిక్ రద్దయ్యాయి. కాని ఆ నిధులు సంబంధిత ఉద్యోగి వద్దనే ఉన్నాయని పలువురు ఆర్పీలు చెబుతున్నారు.

జీవీఎంసీలో ఆర్పీలుగా చేరిన 200 మందికి 'ఆర్పీ లాగిన్' ఇవ్వడానికి ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు చొప్పున రూ.60 లక్షలు వరకు వసూలు చేసినట్లు ఓ పొరుగు సేవల ఉద్యోగిపై ఆరోపణలున్నాయి. ఆరిలోవ, గాజువాక, మల్కాపురానికి చెందిన ముగ్గురు ఆర్పీల ఖాతాల్లో రూ.10 లక్షలు చొప్పున జమ చేసినట్టు ఆధారాలు కూడా ఉన్నాయంటున్నారు. వీటితో పాటు ఇతర అక్రమాలపై తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా పూర్తి ఆధారాలతో కౌన్సిల్‌లోనే మేయర్ హరి వెంకట కుమారికి, నాటి కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

నామమాత్రమేనా..?: కొన్ని ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ అనంతరం మెప్మా పొరుగు సేవల ఉద్యోగి పాత్ర ఉన్నట్టు తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు. రూ.2 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. దీనిపై లోతైన విచారణ చేపట్టి, బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని అప్పటి యూసీడీ పథక సంచాలకులను కమిషనర్ ఆదేశించారు. కాని నేటికీ పూర్తిస్థాయిలో విచారణ జరగలేదు.

# తీరంలో ప్రగతి కెరటం



అచ్యుతాపురం : పారిశ్రామిక ప్రగతిని పట్టాలెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులేస్తుంది. తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమం చేస్తూ ముందడుగు వేసింది. విశాఖ–చెన్నై కారిడార్‌లో పట్టాలెక్కించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జగన్ సర్కార్ ఐదేళ్లు పట్టించుకోని విశాఖ–చెన్నై నడవాను (కారిడార్) కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. విశాఖ–చెన్నై పారిశ్రామిక నడవాను సాకారం చేయడానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంతోపాటు అసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటోంది. దీనికి అవసరమైన వాటా నిధులు రూ. 837.71 కోట్లను ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల మీదుగా ఎక్స్‌ప్రెస్ వేతో పాటు పరిశ్రమలకు భూములను గుర్తించారు. మౌలిక వసతుల కల్పనతో పాటు తీరప్రాంతాన్ని ఆనుకొని వందలాది పరిశ్రమలు, విశాలమైన రోడ్ల దీని ద్వారా నిర్మించనున్నారు. ఫార్మా, నాన్ మెటాలిక్ మినరల్స్, రసాయన, పెట్రో కెమికల్స్, ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల తీరప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు తీరాన్ని ఆనుకొని జీవించే మత్స్యకార యువతకు భారీగా పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**హైవేతో అనుసంధానం**

పారిశ్రామికీకరణకు విశాలమైన రోడ్లు, నీరు, విద్యుత్తు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. విశాఖ–కాకినాడ పరిధిలో 419 కిలోమీటర్ల మేర రోడ్లను వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీనివల్ల విశాఖ–కాకినాడకు మధ్య ప్రయాణ సమయం 3 గంటల మేర తగ్గిపోనుంది. గతంలోనే తెదేపా పాలనలో ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించినా జగన్ సర్కార్ దీనిని పూర్తిగా పక్కనపెట్టింది. ఈ రోడ్డును 16వ నంబర్ జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.

పరిశ్రమలకు వేదికగా నిలిచిన అచ్యుతాపురం మరింత అభివృద్ధి చెందనుంది. రోడ్లు విస్తరణ, పోర్టుల అనుసంధానం, తీరప్రాంతంలో భారీగా నిర్మించే పరిశ్రమల కారణంగా యువతకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. పరవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఫార్మాసిటీ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి, నాన్ సెజ్, నక్కపల్లి సెజ్, బల్క్ డ్రగ్‌తో ఈ ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు తీయనున్నాయి.

**ఉపాధి అవకాశాలు మెరుగు**

విశాఖ–చెన్నై కారిడార్‌తో ఈ ప్రాంతంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. మత్స్యకార యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి–సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకొని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా.

సుందరపు విజయ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎలమంచిలి


**చంద్రబాబు ముందుచూపు**

పరిశ్రమల ఏర్పాటుతో వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతోంది. సెజ్ రాకముందు అచ్యుతాపురంలో రూ.లక్ష ఉండే ఎకరా భూమి కోట్లకు చేరింది. విశాఖ–చెన్నై కారిడార్ పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే ఈ ప్రాంతం అభివృద్ధిలో మరింత దూసుకుపోతుంది. సీఎం చంద్రబాబు ముందుచూపునకు ఈ ప్రాజెక్టు సజీవ సాక్ష్యం.

ప్రగడ నాగేశ్వరరావు, ఛైర్మన్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్

## అదనపు వాడకమా.. క్రమబద్ధీకరించుకోండి!

అనకాపల్లి : పట్టణానికి చెందిన రామారావు చిరుద్యోగి. ఇతని ఇంటికి నెలకు రూ.700 విద్యుత్తు బిల్లు వస్తోంది. వేసవి కావడంతో ఇటీవల ఏసీ ఏర్పాటు చేసుకున్నారు. అదనపు లోడ్ వాడుతున్నారని డెవలప్‌మెంటు ఛార్జీలతోపాటు అపరాధ రుసుం విధించారు.ఏటా వేసవిలో అధిక శాతం వినియోగదారులు ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. ఇటువంటి ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ అందిస్తోంది. ఈ నెల 1 నుంచి దరఖాస్తులు సీకరిస్తున్నారు.



గృహాలకు విద్యుత్తు కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఇతర గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంటు ఛార్జీలు వసూలు చేస్తారు. అధిక శాతం మంది దరఖాస్తులో రెండు, మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈలెక్క ప్రకారమే అధికారులు ఆప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటివి ఏర్పాటు చేసుకున్నా అందుకు అనుగుణంగా ఛార్జీలు చెల్లించరు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో పాటు లోవోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి.

**జూన్ వరకు దరఖాస్తుల స్వీకరణ**

గతంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామర్థ్యాన్ని లెక్కించేవారు. ఎక్కువ లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే డెవలప్‌మెంట్ ఛార్జీతో పాటు జరిమానా వసూలు చేసేవారు. ఇప్పుడు వినియోగదారుడు స్వచ్ఛందంగా ముందుకు కొస్తే కేవలం రుసుంలో సగం రాయితీగా ఇస్తారు. ఈనెల 1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 30వ తేదీ వరకు గడువు ఉంది. ఆ తర్వాత సిబ్బంది తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

విద్యుత్తు బిల్లులపై ప్రస్తుతం ఎన్ని కిలోవాట్లకు డిపాజిట్ చెల్లించారో ఉంటుంది. ప్రస్తుతం ఇంటిలో వినియోగిస్తున్న వాటిని లెక్కించి అందుకు అనుగుణంగా డబ్బు చెల్లించాలి. ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంటు ఛార్జీగా రూ.2,000 నిర్ణయించారు. జూన్ నెలాఖరులోపు అయితే దీనికి రూ.1,000 చెల్లించినా సరిపోతుంది. దరఖాస్తు ఫీజు రూ.50. మీసేవ, సచివాలయంతో పాటు అన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. జి.ప్రసాద్, ఎస్‌ఈ

## చెదిరిన కాల్వలకు.. చేవ చూపాలి

నంద్యాల : తుంగభద్ర, కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న నేల.. 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి కాల్వలు తవ్వారు.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వాటి నిర్వహణ 'నీరు'గారింది.. కాల్వకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి.. లైనింగ్ చెదిరిపోయింది.. గుర్రపు డెక్క విస్తరించింది.. డిస్ట్రిబ్యూటరీల గేట్లు విరిగిపోయాయి.. ఫలితంగా చి'వరి'కి నీళ్లు అందక ఆయకట్టు 'కాడి'తప్పింది. ఏటా వేసవిలో నిర్వహణ పనులు చేపట్టాలి..గత ఐదేళ్లు ఏ ఒక్క పని చేపట్టలేదు.. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు విన్నవిస్తున్నారు. కాల్వల్లో నీటి ప్రవాహం తగ్గింది.. ఇప్పటి నుంచే దృష్టి సారిస్తే వరదల సమయానికి బాగు చేయడానికి వీలుంటుంది.. ఆ దిశగా అధికారులు యత్నించాల్సి ఉంది.

**నిర్వహణకు ప్రతిపాదనలు**



ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల పరిస్థితి, వాటి నిర్వహణ, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. ఈమేరకు అధికారులు ప్రాజెక్టుల వారీగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఉపాధిహామీ పథకం కింద వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద పంట కాల్వల్లో పూడికతీత, కంపచెట్లను తొలగించేందుకు కొత్తగా ప్రతిపాదనలు చేశారు. ఈ ఏడాది ప్రాజెక్టుల వారీగా పనులు చేసేందుకు ఇటీవల ఇరిగేషన్ అధికారుల నుంచి ఉపాధి అధికారులు నివేదిక కోరారు.

**రూపుకోల్పోయాయి**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బృందం కాల్వలను పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్సార్బీసీ, కేసీ, తెలుగుగంగ, తుంగభద్ర, ఎల్ఎల్‌సీ పరిధిలోని కాల్వలన్నీ రూపుకోల్పోయాయి. ప్రధాన, పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూడిక, రాళ్లు నిండిపోయాయి. ముళ్లపొదలతో కట్టలు పటిష్ఠత కోల్పోతున్నాయి. పలుచోట్ల కాల్వల లైనింగ్ నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. డిస్ట్రిబ్యూటరీల వద్ద గేట్లు శిథిలావస్థకు చేరాయి. తూములు శిథిలమయ్యాయి.

## అక్రమాల హాజరు

కర్నూలు : బీసీ సంక్షేమ వసతి గృహాలు అక్రమాలకు నిలయంగా మారాయి. సంక్షేమాధికారులు తప్పుడు లెక్కలు రాసి నిధులు భోంచేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం కొన్ని వసతి గృహాలను మూసేసింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ వసతి గృహాల సంఖ్య తగ్గిపోయింది. ప్రవేశం పొందే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. విద్యార్థుల డిమాండ్‌ను ఆసరా చేసుకొని సంక్షేమాధికారులు స్థాయికి మించి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఒక వసతి గృహంలో వంద మంది కన్నా ఎక్కువగా ఉండొద్దు.. కానీ చాలా చోట్ల 200 నుంచి 400 మంది వరకు ఉంటున్నారు. కర్నూలు, ఆదోని, డోన్, పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. స్థాయికి మించి ప్రవేశాలు కల్పించి సంక్షేమాధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు.

**బయోమెట్రిక్** వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ విధానంలో తీసుకోవాలి. బీసీ వసతి గృహాల్లో మాన్యువల్‌గా కూడా అవకాశం కల్పించారు.. దీన్ని ఆసరా చేసుకొని సంక్షేమాధికారులు తప్పుడు లెక్కలు రాస్తున్నారు.

ప్రతినెలా నాలుగు ఆదివారాలు, రెండో శనివారం సెలవు దినాలు ఉంటాయి. ఆయా రోజుల్లో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో వంద శాతం హాజరు వేసి నిధులు మింగేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడిన సంక్షేమాధికారులు ఇద్దర్ని సస్పెండ్ చేశాం.. విచారణ చేసి నివేదికను డీఆర్వోకు సమర్పించినట్లు కర్నూలు బీసీ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు..

మెనూ బోర్డుకే పరిమితం

ప్రతి నెలా ప్రభుత్వం పోస్టు మెట్రిక్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,600, ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.1,400 చొప్పున డైట్ ఛార్జీలు చెల్లిస్తోంది. ఏటా మెనూ కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. కళాశాల వసతిగృహ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం,



రాత్రి మెనూ ప్రకారం భోజనం అందించాలి.

ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో ఆది, మంగళ, శుక్ర వారాల్లో చికెన్, వారానికి ఆరుగుడ్లు, ఆరు అరటి పండ్లు, సాయంకాలం రాగి జావ, స్నాక్స్ ఇవ్వాలి. ఎక్కడా మెనూ పాటించడం లేదు. సంక్షేమాధికారులు సంతకాలకు పరిమితం కాగా.. సిబ్బంది నడిపిస్తున్నారు.

**ఇక్కడ భారీగా తినేశారు**

పాణ్యంలో బాలికల కళాశాల వసతి గృహంలో గత నవంబరులో 473 మంది విద్యార్థినులు ఉండగా.. ఈ ఏడాది జనవరిలో 329 మందే ఉన్నారు. కానీ ప్రతినెలా 473 మంది ఉన్నట్లు లెక్కలు సమర్పించారు. ఆమేరకు ప్రభుత్వం విడుదల చేసిన (ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.1,600) మొత్తం సొమ్ము (రూ.2,30,400)ను సంక్షేమాధికారిణి మింగేశారు. 2022 మే నుంచి ఆమె ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు తనిఖీ చేయగా అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆమెపై వేటు వేశారు.

పాణ్యం బాలుర కళాశాల వసతిగృహంలో గత డిసెంబరులో 347 మంది విద్యార్థులుంటే.. ప్రస్తుతం 325 మంది ఉన్నారు. కానీ 347 మంది ఉన్నట్లు ఇక్కడి సంక్షేమాధికారి లెక్కలు సమర్పించారు. ప్రభుత్వం విడుదల చేసిన (ఒక విద్యార్థికి నెలకు రూ.1600) రూ.32000 పక్కదారి పట్టించారు. ఉన్నతాధికారులు తనిఖీలు చేయగా అక్రమాలు వెలుగులోకి రావడంతో చర్యలు తీసుకున్నారు.

# ఎంచక్కా వెంచర్లు.. నిబంధనలు పాటించరు

గుత్తి : గుత్తి పురపాలికతోపాటు పరిసర గ్రామాల్లో భూదందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలను పట్టించుకోకుండా స్థిరాస్తి వ్యాపారులు అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. ఎంచక్కా ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటు పంచాయతీ అధికారులు, అటు పురపాలిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా గుత్తిలో స్థిరాస్తి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. 2011లో గుత్తి, చెట్నేపల్లి మేజర్ పంచాయతీలను కలిపి ప్రభుత్వం పురపాలికను చేసింది. పట్టణ పరిధిలో సుమారు 80 లేఅవుట్లకు అనుమతులు ఇవ్వకుండా పురపాలిక అధికారులు నిలిపివేశారు. అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు ఎవరూ కొనుగోలు చేయరాదని హెచ్చరించారు. అయినా సరే అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

**స్థలాల కేటాయింపు ఏదీ**

స్థిరాస్తి వ్యాపారులు ఎకరాకు 10 సెంట్లు రిజర్వుడు స్థలాన్ని బడులు, గుడులు, సామాజిక భవనాల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉంది. ఎకరాకు 10శాతం రిజర్వుడు స్థలాన్ని పురపాలిక, పంచాయతీల పేర్లతో రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలి. పల్లెల్లో అయితే చదరపు గజానికి రూ.3వేలు పంచాయతీలకు చెల్లించాలి. గ్రామాల్లో ఎక్కడా రిజర్వుడు స్థలాలు ఇవ్వడం లేదు. పైగా లేఅవుట్లలో రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణానికి



వీలుగా స్థలాన్ని వదలాల్సి ఉంది. ఇవేవీ పాటించడం లేదు. గుత్తి పట్టణంలో అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఇప్పుడు బ్యాంకుల్లో గృహనిర్మాణాలకు రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారు.

**ఎక్కడెక్కడంటే?**

గుత్తిలోని అనంతపురం రోడ్డు, కర్నూలు రోడ్డు పరిసరాల్లో వెంచర్లు వేశారు. పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం, కాశేపల్లి గ్రామాలతోపాటు గుత్తి మండలంలోని కొత్తపేట, బాచుపల్లి, కరిడికొండ, బసినేపల్లి గ్రామాల్లో అక్రమలే అవుట్లు వెలిశాయి. రియల్టర్లు నిబంధలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. వ్యాపారులకు అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. నోటీసులను అందుకుంటున్న వారు స్పందించడం లేదు.

**తగిన చర్యలు తీసుకుంటాం -శివాజీరెడ్డి, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో, గుంతకల్లు**

గుత్తి గ్రామీణంలోని పలు చోట్ల స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు వేస్తూ పంచాయతీల అనుమతులు తీసుకోవడం లేదు. అక్రమంగా లేఅవుట్లను వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటిపై చర్యలు తీసుకుంటాం. తొలుత లేఅవుట్లను గుర్తిస్తాం.


# మార్కెటింగ్ శాఖ.. ఖాళీలమయం

చిత్తూరు : వైకాపా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను గాలికొది లేసింది. పంట ఉత్పత్తుల నుంచి సెస్ వసూళ్లే తప్ప రైతుల సంక్షేమం, మార్కెటింగ్ శాఖ బలోపేతాన్ని పూర్తిగా విస్మరించింది. జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో 60 శాతం పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆ ప్రభావం రైతులపై పడుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై రైతులు, అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో పలమనేరు, పుంగనూరు, కుప్పం మార్కెట్ యార్డులు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయి. మిగిలినవి సీజన్ మార్కెట్లు. ఇవి చెక్‌పోస్టుల ఆధారంగా కొనసాగుతున్నాయి.

**ఖాళీలు ఇలా..**

పుంగనూరు యార్డులో 18 పోస్టులకు ఏడుగురు, కుప్పంలో ఐదు పోస్టులకు ఒకరే ఉన్నారు. పలమనేరులో 19 పోస్టులకు 10 మంది,



ఎస్‌ఆర్‌పురంలో ఐదు పోస్టులకు ఐదు ఖాళీనే. నగరిలో 11 పోస్టులకు ఎనిమిది, రొంపిచెర్లలో ఎనిమిదింటికి ఆరు ఖాళీగా ఉన్నాయి. ఇక బంగారుపాళ్యంలో ఎనిమిది పోస్టులకు మూడు ఖాళీ. చిత్తూరులో 22 పోస్టులకు 15 ఖాళీగా ఉన్నాయి. రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు మినహా మిగిలిన యార్డులకు చెక్‌పోస్టులతో ఆదాయం సమకూరుతుంది. సిబ్బంది కొరతతో అక్రమ రవాణా, సెస్సు వసూళ్లపై అధికారులు దృష్టిసారించలేకపోతున్నారు.

**ఉన్నవారిపైనే భారం..**

ఉద్యోగుల కొరత కారణంగా ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఉద్యోగుల కొరతతో సెస్ వసూళ్లు, గోదాములు, దుకాణాల అద్దె వసూళ్లు, నిర్వహణ పనులన్నీ చూడాల్సి ఉంది. సిబ్బంది కొరతతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కరవైంది.

జిల్లాలోని మార్కెట్ యార్డులు: 10
ఏటా ఆదాయ లక్ష్యం: రూ.10.49 కోట్లు
ఇప్పటివరకు వసూలు: రూ.7.50 కోట్లు
మొత్తం పోస్టులు 112 విధుల్లో 38 ఖాళీలు 74

# హంద్రీ-నీవా.. చేరువే ఇక

పలమనేరు : కుప్పం బ్రాంచి కెనాల్ కోసం హంద్రీ-నీవా లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అప్పినపల్లె నుంచి పరమసముద్రం వరకు ఈ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అధికారులు ప్రతి 16 కి.మీ దూరానికి ఒక బృందం చొప్పున పనులు నిర్వహిస్తున్నారు.

తెదేపా అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ-నీవా నీటిని పెద్దపంజాణి మండలం మాదనపల్లె వరకు తెప్పించారు. గంగవరం మండలం పసుపత్తూరు బ్రాంచి కెనాల్ ద్వారా కుప్పానికి తరలించారు. అప్పట్లో పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల కాలువలకు నీరు రావడంతో రైతులు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ఆ వెంటనే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీని ఊసే మరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుప్పం వరకు కాలువలో లైనింగ్ పనులు చేపడుతోంది. మే నెలాఖరుకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని.. అప్పినపల్లె-కుప్పం వరకు లైనింగ్ కోసం రూ.10 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డీఈ విజయభాస్కర్ తెలిపారు.

# ఆగ్రోస్‌కు పూర్వవైభవం



అనంతపురం : వైకాపా ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీ ఆగ్రోస్)కు ఒక్కపైసా నిధులు, రాయితీ పరికరాలు ఇవ్వకుండా మూలన పడేశారు. రాయితీతో అందించే పరికరాలు, పనిముట్లు, యంత్రాలను గ్రూపులకు మంజూరు చేసి, రైతులకు ఇబ్బందులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆగ్రోస్‌కు పునరుజ్జీవం పోసింది. వ్యవసాయ పరికరాలు, పనిముట్లను సరఫరా బాధ్యతలను ఆగ్రోస్‌కు అప్పగించింది. గ్రూపులకు స్వస్తి పలికింది. వ్యక్తిగత రాయితీ పరికరాలకు నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం ఉత్తర్వులు, మార్గదర్శకాలను జారీ చేసింది. 50 శాతం రాయితీతో అందించడంపై జిల్లా రైతాంగం నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

**అర్హులైన రైతులు వీరే..**

ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులతోపాటు చిన్నసన్నకారు రైతులు అర్హులు. వీరంతా ఆ ఐదేళ్లలో ఈ-పంట నమోదు తప్పసరిగా చేసుకుని ఉండాలి. అటవీ భూములు (ఆర్‌వోఎఫ్‌ఆర్) కలిగిన రైతులు కూడా అర్హులు. ఒక రైతుకు ఒక పనిముట్టు మాత్రమే ఇస్తారు. ట్రాకర్ ఉంటేనే ట్రాకర్‌కు సంబధించిన పనిముట్లే ఇస్తారు. రైతు సేవా కేంద్రాల్లో ఎన్ఐసీ వెబ్‌సైట్లో వెబ్ అప్లికేషన్, మొబైల్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మండల వ్యవసాయాధికారి, డివిజన్ ఏడీఏ ఆమోదించి ఆగ్రోస్ సంస్థ ఖాతాకు సొమ్ము నేరుగా జమ చేస్తారు.

**ఈ నెలాఖరులోపే ఖర్చు..**

మరో నెలలో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. రైతులకు రాయితీతో పరికరాలు, పనిముట్లు, యంత్రాలు అందించాలని ముందుగా నిర్ణయించింది. ఈనెలాఖరులోనే నిధులు ఖర్చు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 3,322 మంది రైతులకు రూ.7.75 కోట్లు నిధులు రాయితీ పరికరాలకు మంజూరు చేసింది. దాంట్లో మూడు రకాల పిచికారీ యంత్రాలు, ట్రాక్టర్ పరికరాలు, రొటావేటర్లు, పవర్ వీడర్లు, బ్రష్‌కట్టర్లు, పవర్ టిల్లర్లు మంజూరు చేసింది. గతంలో సొమ్ము మొత్తం చెల్లిస్తే రాయితీ తర్వాత ప్రభుత్వం రైతులకు ఖాతాలకు చేసేది. ఇప్పుడు అలా కాదు. రైతు వాటా చెల్లిస్తే చాలు పరికరాలు మంజూరు చేస్తారు.

**మేనేజర్ల నియామకం**

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆగ్రోస్ మేనేజర్లను నియమించారు. అనంతపురం డివిజన్ భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఏడీఏ ఓబుళపతిని అనంతపురం ఆగ్రోస్ జిల్లా మేనేజర్‌గాను. హిందూపురం డివిజన్‌లో భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఏడీఏ శ్రీనివాసులును శ్రీసత్యసాయి జిల్లా ఆగ్రోస్ మేనేజర్‌గా నియమించారు.

**26 లోపు ప్రక్రియ పూర్తి - ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారులు** పనిముట్లు, పరికరాలు సరఫరా బాధ్యతలు ఏపీ ఆగ్రోస్‌కు అప్పగించారు. 8 పరికరాలున్నాయి. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 5న మండలాల వారీగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తాం. ఈ ప్రక్రియంతా ఈనెల 26 లోపు పూర్తి చేయాలి.

# గ్రానైట్ పరిశ్రమ గట్టెక్కేనా.!




తాడిపత్రి : ఒకప్పుడు తాడిపత్రి గ్రానైట్‌కు విపణిలో మంచి గిరాకీ ఉండేది. ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండేవారు. వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగేది. గత వైకాపా ప్రభుత్వం విధానాలతో ఇప్పుడా పరిస్థితి లేదు. వందల పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాదిమంది కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

తాడిపత్రి పరిసరాల్లోని చుక్కలూరు క్రాస్, సజ్జలదిన్నె పరిధిలో గతంలో 530 గ్రానైట్ పరిశ్రమలు ఉండేవి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలతో నిర్వహణ భారమై ప్రస్తుతం 120 పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. అప్పట్లో నాలుగు దఫాలుగా విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో నెలకు ఒక్కో పరిశ్రమకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు బిల్లు వచ్చేది. రాయల్టీ వసూలు ప్రైవేట్ వారికి అప్పగించడంతో వృథాగా వెళ్లే గ్రానైట్ రాయికీ పన్ను వేస్తున్నారు. ఒక్కో లారీకి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు, ప్రభుత్వం 18 శాతం పన్ను వసూలు చేస్తోంది. గ్రానైట్ టైల్స్‌కు రాజస్థాన్‌లో 5శాతమే పన్ను ఉండటంతో అక్కడ తక్కువ ధరకే లభిస్తోంది. దీంతో ఇక్కడి గ్రానైట్‌కు డిమాండ్ తగ్గింది. ఈనేపథ్యంలో పరిశ్రమలు మూతపడుతున్నాయి. కొంతమంది పరిశ్రమను మూత వేసుకోలేక బాడుగకు ఇస్తున్నారు. మరికొందరు యంత్రాలను గుజిరీకి వేస్తున్నారు.

**మూతపడినా విద్యుత్తు భారమే...**

పరిశ్రమలు మూతపడినా.. వాటికి విద్యుత్తు ఛార్జీల రూపంలో ఒక్కో పరిశ్రమ నుంచి రూ.18వేలు వసూలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయామని, కూటమి ప్రభుత్వమైనా ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**దిక్కుతోచని పరిస్థితులో కార్మికులు**

పరిశ్రమల్లో పని చేయడానికి స్థానికులే కాకుండా కదిరి, సమీప కర్నూలు, వైయస్‌ఆర్ జిల్లాల నుంచి కార్మికులు వచ్చేవారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని విభాగాల్లో వేలాది మంది పని చేసేవారు. అందులో చాలామంది రోడ్డున పడ్డారు. మరికొందరు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**పన్నులు తగ్గించాలి -మునిస్వామి, గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకులు**

గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలతో పరిశ్రమలు నష్టపోయాయి. నిర్వాహణ భారమవ్వడంతో అనేక మంది మూతవేసుకుంటున్నారు. వైకాపా ప్రభుత్వం అమలు చేసిన విధానాలను రద్దు చేయాలి. ప్రధానంగా పన్నుల భారం తగ్గించాలి.

**వారంలో నాలుగురోజులే పని -మల్లికార్జున, పుట్లూరు**

కొన్నేళ్లుగా గ్రానైట్ రాయిని పాలిషింగ్ పని చూస్తూ జీవనం గడిపా. గతంలో వారంలో ఆరు రోజుల పాటు పని ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. చాలా వరకు పరిశ్రమలు మూతపడ్డాయి. జీవనం భారంగా మారింది.

# పల్లెకు వెలుగు బాటలు


అనంతపురం : పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగింది. అడుగు తీసి అడుగు వేసే దుస్థితి నుంచి రయ్.. రయ్.. అంటూ దూసుకెళ్లేలా రోడ్లను తీర్చిదిద్దుతున్నారు. వాహనదారులకు వెతలతో పాటు ప్రయాణ సమయం తగ్గిపోయింది. రోజు వారీ పనులకు వెళ్లే కూలీల నుంచి సరకు రవాణా వరకు సాఫీగా ప్రయాణం సాగుతోంది. అన్నింటి ముఖచిత్రం మార్చేందుకు కూటమి ప్రభుత్వం వడిగా అడుగులు వేస్తోంది. మండలాల వారీగా కనీసం రూ.3 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధి నిధులు రూ.226 కోట్లతో 3,612 పనులు మొదలుపెట్టారు. గతేడాది అక్టోబరులో చేపట్టిన పనులు ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. రహదారులు బాగుపడటంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**చుట్టూ తిరిగి వెళ్లాల్సినవసరం లేదు**

గార్లదిన్నె మండలం ఎం.కొత్తపల్లి నుంచి అంకంపేట రోడ్డు వరకు మట్టి రోడ్డును కూటమి ప్రభుత్వం తారుతో తీర్చిదిద్దింది. మట్టి రోడ్డు కారణంగా స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల రూ.49.50 లక్షలతో తారు నిర్మించారు. వ్యయప్రయాసలు తగ్గడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నరకప్రాయం నుంచి తప్పించి..**

రాప్తాడు నియోజకవర్గం పరిధి ఆత్మకూరు మండలం తలుపూరు నుంచి కళ్యాణదుర్గం ప్రధాన రహదారి వరకు మట్టి రోడ్డులో ప్రయాణం




నరకప్రాయంగా ఉండేది. ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత తారు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.కోటితో రహదారి నిర్మాణం పూర్తి చేశారు.

**మట్టి నుంచి విముక్తి**

కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాలతండా నుంచి ఆత్మకూరు వరకు 5 కిలోమీటర్ల ఉన్న మట్టి రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా సాగేది. గోతుల్లో వెళ్లలేక వాహనదారులు నానాతంటాలు పడేవారు. కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మించడంతో స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్‌వాడీలకు తీపికబురు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా పరిధిలో అంగన్‌వాడీలకు తీపికబురు ఇది. గత వైకాపా పాలనలో పగటి కలగా మిగిలిపోయిన ఈవెంట్ల (ప్రత్యేక కార్యక్రమాలు)కు సంబంధించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.3.08 కోట్లు మంజూరు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా ఎంపిక చేసిన ప్రాంతాల్లో లబ్ధిదారులకు సీమంతం, అన్నప్రాసన, పూర్వ విద్య సంసిద్ధత, ప్రజారోగ్య అవగాహన.. తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు అంగన్‌వాడీ సిబ్బందే తమ చేతి నుంచి ఖర్చు పెట్టారు. వైకాపా ప్రభుత్వ హయాంలో 2022, సెప్టెంబరు నుంచి డబ్బులు ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. అప్పట్లో 42 రోజులు నిరవధిక



సమ్మె చేసినా జగన్ సర్కారు స్పందించలేదు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం 12 మాసాలకు అనంత, శ్రీసత్యసాయి జిల్లాలకు నిధులు మంజూరు చేసింది. ప్రతి నెలా రెండు ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఒకోదానికి రూ.250 ప్రకారం నెలకు రూ.500 అంగన్‌వాడీ సిబ్బందికి చెల్లించాలి. ఈలెక్కన అనంత జిల్లాలో 2303, శ్రీసత్యసాయి జిల్లాలో 2824 కేంద్రాలు ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి దాకా ఒకేసారి నిధులు వచ్చాయి. అనంతకు రూ.1.38 కోట్లు, శ్రీసత్యసాయికి రూ.1.70 కోట్లు మంజూరు కావడంతో ఏపీ తెలుగునాడు అనుబంధం అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర కోశాధికారి వీణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమున, రుక్మిణి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ఊర'ట మాటా' వింటారా...?

పుంగనూరు : టమాటా సీజన్‌కు వేసవి కాలం అనువు. ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో విడతల వారీగా టమాటా సాగుకు రైతన్నలు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. అధిక దిగుబడులపై దృష్టి సారించిన అన్నదాతలు ఆధునిక పద్ధతులు, నూతన వంగడాలపై మొగ్గు చూపుతున్నారు. దీని కోసం బోదెలపై మల్చింగ్ పేపరు పరచడం, టమాటా మొలకలు, ఊతంగా నాటే కర్రలు తదితరాల కోసం ఎకరాకు రూ.3లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. సాగులో చెట్లు ఏపుగా పెరగడానికి కర్రలు నాటడం తప్పనిసరి. వీటికి డిమాండు రావడంతో రైతులు ధరను బట్టి అడవి కర్రలు, నీలగిరి, వెదురు కర్రలు వాడుతున్నారు.

పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు తదితర నియోజకవర్గాల్లో ఈ సీజన్‌లో సుమారు 25వేల ఎకరాల్లో టమాటా సాగవుతోంది. ఇందుకు రైతులు సాగు పెట్టుబడులు సరాసరి రూ.750కోట్లు వెచ్చిస్తున్నారు. ధరలపై వాతావరణ ప్రభావం, నీటి కొరతతో పెట్టుబడులు చేతికి వచ్చే వరకు ప్రశ్నార్థకమే అని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ సీజన్‌లో తడులు సక్రమంగా అందించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**మూడు నెలలుగా ధరలేవీ..**

మూడు నెలలుగా టమాటాకు ధరలు లేవు. అయినా రైతులు టమాటా సాగు చేస్తున్నారు. సాగు ఖర్చులు పెరిగినా ధరలు వస్తే రెట్టింపు స్థాయిలో గిట్టుబాటు అవుతోందని రైతుల ఆశ. స్థానికంగా సాగుకు అవసరమైన పరికరాల ధరలు అధికంగా ఉండటంతో మొలకలు, మల్చింగ్ పేపరు, కర్రలు ఇతర వాటిని కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గత సీజన్‌లో 15 కిలోల టమాటా పెట్టె రూ.1200ల వరకు పలకడంతో రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు.

**షరా మామూలయ్యాయి**

ప్రస్తుత పరిస్థితుల్లో టమాటా సాగు చేయాలంటే పెట్టుబడులు పెట్టాల్సిందే. నూతన వంగడాలు, ఆధునిక పద్ధతులు ఈ ప్రాంతంలో షరా మామూలయ్యాయి. టమాటా పంట జూదంలాంటిదని తెలిసినా సాగు చేస్తున్నా. రెండు ఎకరాలకు రూ.5లక్షలు వెచ్చిస్తున్నా. రామకృష్ణ, టమాటా రైతు, పుంగనూరు

# భూచోళ్లలో గుబులు

శ్రీకాళహస్తి: జగనన్న కాలనీల ఏర్పాటుకు వైకాపా హయాంలో కొనుగోలు చేసిన భూముల అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఏర్పేడు సమీపంలోని చిందేపల్లి, శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు జగనన్న లేఔట్లకు సంబంధించి భూముల కొనుగోళ్లపై సర్వత్రా విమర్శలొచ్చాయి. ఈ వ్యవహారం శాసనసభలో ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అక్రమాలపై నిశిత పరిశీలన చేస్తున్నట్లు స్పష్టం చేయడంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది.

ఊరందూరు జగనన్న కాలనీలో 6,231 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కేటాయించింది 4,873 మందికి మాత్రమే. ఇళ్ల నిర్మాణాలకు దాదాపు 160 ఎకరాల కొనుగోలుకు రూ.250 కోట్లు వ్యయం చేసినట్లు సమాచారం. ఇక్కడి అవినీతి గుట్టు రట్టు చేసేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పరిశీలన చేసుకున్న లబ్ధిదారులు పది శాతంలోపు మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.



రాజీవ్‌నగర్ వద్ద ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న డీకేటీ భూములు సేకరించి నగదు చెల్లింపుల్లో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఏర్పేడు మండలం చిందేపల్లి జగనన్న కాలనీలో 250 ఎకరాలు భూములు సేకరించారు. ఇక్కడ వైకాపా అనుకూలంగా ఉన్న వారికి ఓ రకమైన ధరలు, ఇతరులకు తక్కువ ధరల ప్రకారం చెల్లించారనే ఆరోపణలున్నాయి.

చెల్లింపుల్లోనూ విమర్శలే.. జగనన్న కాలనీలకు ప్రభుత్వ భూములతో పాటు చుట్టూ ఉన్న డీకేటీ భూములు, ఊరందూరు సమీపంలో ప్రైవేటు భూములు కొనుగోలు చేశారు. భూసేకరణకు సంబంధించి నిర్వాసితుల వ్యక్తిగత ఖాతాలకు పడిన నగదు 60 శాతం మేరకు మళ్లీ వాళ్ల అకౌంట్ల నుంచి మళ్లించినట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీనిపై విచారణ చేపడుతుండటంతో అక్రమార్కులు గుబులు చెందుతున్నారు.

చురకలు



# సౌర కిరణం.. వెలుగు పవనం

కర్నూలు : 'సీమ' ముఖద్వారమైన కర్నూలు జిల్లా విద్యుత్తు ఉత్పత్తికి కేంద్ర బిందువు కాబోతోంది.. వచ్చే రెండేళ్లలో ఏకంగా 18,119 మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి రానుంది.. 'కూటమి' ప్రభుత్వం ముందుచూపుతో దేశ అవసరాలు తీర్చగలిగేలా 'శక్తి' ఇక్కడ ఒనగూరబోతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిర్మాణాలు చకచకా కొనసాగుతున్నాయి.. పత్తికొండ మండలం హొసూరు, పెద్దహుల్తి, నంద్యాల జిల్లాలో సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.. ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే కర్నూలుకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**అతి పెద్ద సౌర పార్కు**



సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించాలని 2014-19లోనే తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. ఆసియాలోనే అతిపెద్ద సోలార్ పార్క్‌కు 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునాది వేశారు. 5,800 ఎకరాల విస్తీర్ణంలో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్రాజెక్టు చేపట్టారు. ఇక్కడ గ్రీన్‌కో సంస్థ 500 మెగావాట్లు, అజుర్ పవర్ 100 మెగావాట్లు, అదానీ సంస్థ 400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టులు నిర్మించాయి. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి 2017లో అందుబాటులోకి తీసుకొచ్చాయి.

**ప్రతిష్టాత్మకంగా పంప్డ్‌స్టోరేజ్**

సౌర, పవన, పంప్డ్ హైడ్రోపవర్ ప్రాజెక్టులన్నీ ఉండేలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు తెదేపా హయాంలోనే శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టును నిర్మించే గ్రీన్‌కో సంస్థకు 2018లో అనుమతులు ఇచ్చారు. ఓర్వకల్లు, పాణ్యం మండలాల పరిధిలో 1,680 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన పీఎస్పీ త్వరలో ప్రారంభం కాబోతోంది. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని తరలించి గుమ్మితంతండా దగ్గర నిర్మించిన పీఎస్పీ ప్రాజెక్టుకు సరఫరా చేసి జల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు.

**గాలిలో విద్యుత్తు**

2019లో తెదేపా అధికారంలో ఉండగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 70 చోట్ల పవన విద్యుత్తు టవర్లు ఏర్పాటుచేశారు. వాటి నుంచి ప్రస్తుతం 612.20 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు మండలాల్లో ఎ.ఎం.గ్రీన్ సంస్థ 315 మెగావాట్ల సామర్థ్యం ఉండేలా విండ్ టవర్లు ఏర్పాటు చేస్తోంది. పనులన్నీ పూర్తికావొచ్చాయి. రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో సదరు సంస్థ పనులు చేపడుతోంది.

# కరవు నేలకు జలం.. జీవం

ఒంగోలు : ప్రకాశం.. ఏడాది పొడవునా తాగునీటి సమస్య ఉన్న జిల్లాల్లో ఒకటి. బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు పడే పల్లెలు కోకొల్లలు. గత ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాల నిర్వహణను అటకెక్కించింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు అడుగులు వేస్తోంది. వెలిగొండ ప్రాజెక్ట్, గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాల నుంచి ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని ఆవాస ప్రాంతాలకు శుద్ధి జలాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. జల్ జీవన్ మిషన్ పథకం కింద అందుకు అవసరమైన పైపులైన్లు ఏర్పాటు చేయనుంది.

**రూ. 1,290 కోట్లు మంజూరు...:** రాష్ట్రంలో రూ.60 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద పల్లెల్లో తాగునీటి సరఫరా సదుపాయాన్ని మెరుగుపర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఫ్లోరైడ్, నైట్రేట్, ఇనుము, ఆర్సెనిక్ ధాతువులు ఉండే భూగర్భ జలాలు కాకుండా ఉపరితలంలో పారే నీరందించడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపొందించాలంటూ గత నెల 21న జీవో జారీ చేసింది. 2028 నాటికి పూర్తిచేసే పనులకు జనవరి 31 వరకు డీపీఆర్ సిద్ధం చేసి పంపాలని గడువు విధించింది. పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెంలో ముందస్తుగా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీరందించడానికి రూ. 1,290 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన నియోజకవర్గాల్లో నీటి సరఫరా కోసం అధికారులు డీపీఆర్ రూపకల్పనలో నిమగ్నమయ్యారు. నీటి శుద్ధికేంద్రాలు, సంపులు, పైపులైన్లు, మోటార్లకు సుమారు రూ.నాలుగు వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. 'రూ. 1,290 కోట్లతో చేపట్టే పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నామ'ని జేజేఎం ఎస్ఈ డి.బాలశంకర్‌రావు తెలిపారు.

ఇక తాగునీరు సురక్షితం...: జలాశయాల నుంచి విద్యుత్తు మోటార్ల ద్వారా నీటిని తీసుకుంటారు. తర్వాత మూడు ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేస్తారు. అక్కడి నుంచి రక్షిత మంచినీటిని సంపుల్లో నిల్వ చేస్తారు. మోటార్ల ద్వారా ట్యాంకులకు నింపి కుళాయిలకు సరఫరా చేస్తారు.

పాత పనులు రద్దు: జల్ జీవన్ మిషన్ కింద మొత్తం 3,356 పనులకు రూ.851 కోట్లు నాలుగేళ్ల క్రితం మంజూరయ్యాయి. అందులో రూ.282 కోట్లతో పైపులైన్ల ఏర్పాటు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, వాటికి పైపుల అనుసంధానం తదితర 1,469 పనులు చేస్తున్నారు. రూ.484 కోట్లతో చేపట్టాల్సిన 1,590 ఇంకా మొదలు కాలేదు. దీంతో వీటిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 357 పనులకు గుత్తేదార్లతో ఒప్పందాలు పూర్తి అయినందున నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

జలాశయాలు, తాగునీరు సరఫరా చేయనున్న మండలాలు
మొత్తం మండలాలు: 38
గ్రామ పంచాయతీలు: 729
ఆవాసాలు: 1,769
గ్రామీణ జనాభా:
19.44 లక్షల మంది
మొత్తం గృహాలు: 74,365
ఇప్పటి వరకు కుళాయి

# ముఖ్యమంత్రి ఇలాకా.. ప్రగతిలో ఆదర్శమిక



కుప్పం : కుప్పం పురపాలిక దేశంలోనే ఆదర్శంగా నిలుపుతా.. పెట్టిన ప్రతిపాదనల కన్నా అధికంగా నిధులిచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..' అని గత కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగా కుప్పం పురపాలిక పరిధిలోని 25 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.92.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. కుప్పం డెవలప్మెంట్ అథారిటీ (కడా) ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. పురపాలిక పరిధిలోని 25 వార్డుల్లో శివారు ప్రాంతాల్లో 13.65 కి.మీ మేర మురుగు కాలువలు నిర్మించేందుకు రూ.19.50 కోట్లు మంజూరయ్యాయి. శీగలపల్లె, నారాయణపురం, గుల్లేపల్లె, మోడల్, షికారీ, అర్బన్ కాలనీల్లో కనీస వసతుల్లేవు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నట్లు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సుందరీకరణకు ప్రాధాన్యం**

ప్రధాన కూడళ్లయిన కృష్ణబిగిరి బైపాస్, బీసీఎన్ రెసార్ట్-పైవంతెన, రాజీవ్ కాలనీ, కమతమూరు రోడ్డు, గుడుపల్లె లింకు రోడ్డు, శివాలయం, ఎంఆర్‌రెడ్డి, డీసీసీ, సోమయ్య వీధి, యాక్సిస్ బ్యాంకు, డీకే పల్లిల్లో సుందరీకరణకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. గతంలో అర్బన్ పథకంలో భాగంగా కుప్పం శ్మశాన వాటికలో రూ.కోటితో కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టగా.. వైకాపా హయాంలో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం దీని అభివృద్ధితోపాటు కృష్ణగిరి ఎల్పీజీ ద్వారా దహనక్రియలకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయనున్నారు.

**రూ.3 కోట్లతో విద్యుత్తు వెలుగులు**

పురపాలిక పరిధిలో 25 వార్డుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్తు వీధి దీపాల వెలుగులు అందించేందుకు రూ.3 కోట్లు మంజూరు చేశారు. వీటి ద్వారా ప్రతి వార్డులోనూ దీపాల వెలుగులు రానుంది.

**ఉద్యానాల ఏర్పాటుకు చర్యలు**

కుప్పం పురపాలిక పరిధిలోని జమిందారు పార్కు, డీకేపల్లి చెరువు వద్ద ఉన్న ఉద్యానాల అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు చేశారు. వడ్డిపల్లి వద్ద నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా కాంప్లెక్స్‌ను రూ.22 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. శిథిలావస్థలో అంగన్‌వాడీ, వసతి గృహాలు, భవనాల మరమ్మతులకు రూ.70 లక్షలు మంజూరు చేసింది. కడా కార్యాలయంలో ప్రైవేటు కన్సల్టెన్సీ సర్వీసు ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

# ఆరేళ్ల కల.. సాకారమైన వేళ



తిరుపతి : కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ) తిరుపతి ఆసుపత్రి సామర్థ్యాన్ని వంద పడకలకు పెంచారు. ఈఎస్ఐ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం గురువారం నిర్ణయం తీసుకోవడంతో ఆరేళ్ల కల సాకారమైంది. అదనంగా రానున్న వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులు, సౌకర్యాలతో ఆస్పత్రిలో లబ్ధిదారులకు నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి. గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో లబ్ధిదారులకు వైద్యమే కాదు కనీసం సిరంజిలు, కాటన్, సెలైన్ ఎక్కించుకునే ఐవీ సెట్లు కూడా అందని పరిస్థితి. ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన కార్మిక రాజ్య బీమా లబ్ధిదారులకు కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి కూడలి సమీపంలో కార్మిక రాజ్య బీమా ఆస్పత్రిని నిర్మించారు. లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో రూ.వంద కోట్లతో నూతన భవన నిర్మాణం 2008లో చేపట్టారు. పదేళ్ల తర్వాత నూతన భవనంలో 50 పడకల ఆస్పత్రి కొలువుదీరింది. ఆ భవనానికి పక్కనున్న పాత భవనం స్థానంలో అదే నమూనాతో అదనపు భవనం నిర్మించి మరో 50 పడకల సామర్థ్యం పెంచాలని నిర్ణయించారు. ఆ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. మందుల కొనుగోలులో అవకతవకల పేరుతో గత ప్రభుత్వంలోని మంత్రిని వేధించడమే కాకుండా ఈఎస్ఐ ఆస్పత్రులను పట్టించుకోలేదు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఈఎస్ఐ లబ్ధిదారులకు ట్రామా సేవలు అందని పరిస్థితి నెలకొంది. జనరల్ సర్జరీ, ఆర్థో విభాగాలతోపాటు సూపర్ స్పెషాలిటీ విభాగాల వైద్యసేవలు మృగ్యమయ్యాయి. అనుమతులున్న ఒకటి రెండు ప్రైవేటు ఆసుపత్రులకు వైద్యం కోసం క్యూ కట్టేవారు. ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన మందులు, సిరంజిలు, ఐవీ సెట్లు లబ్ధిదారులు బయట కొనుగోలు చేసుకునేవారు. అన్ని విభాగాలలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి బోసిపోయేది.

**లబ్ధిదారులకు ఊరట**

ఈఎస్ఐ ఆస్పత్రి పరిధిలో సుమారు 3.50 లక్షల మంది ఈఎస్ఐ లబ్ధిదారులు ఉన్నారు. తమ జీతాల నుంచి ఈఎస్ఐ చెల్లించే కార్మిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా ఉమ్మడి రాయలసీమ, నెల్లూరు జిల్లాలోని 29 డిస్పెన్సరీలకు వెళ్తారు. అక్కడి వైద్యసేవలు సరిపోకపోతే మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. పడకల సంఖ్యే కాకుండా నైపుణ్యం ఉన్న అన్ని విభాగాల వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఎంఆర్ఐ, సీటీ వంటి వైద్య పరికరాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో లబ్ధిదారులకు ఊరట లభిస్తుంది.

**వైద్యసేవలు మెరుగు**

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పడకల సామర్థ్యం పెంపు వల్ల వైద్యసేవలు మెరుగుపడతాయి. స్పెషలిస్టు వైద్యులు అందుబాటులోకి వస్తారు. లక్షలాది మంది ఈఎస్ఐ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్యం అందుతుంది. డాక్టర్ ఎం.శ్యాంబాబు, ఎంఎస్, ఈఎస్ఐ తిరుపతి

# ఆక్వా రంగం.. అతలాకుతలం..!



కోట : ఆక్వా సాగుతో రూ.కోట్లు సంపాదించిన రైతులు నేడు ఈ రంగమంటేనే భయపడుతున్నారు. వైకాపా హయాంలో విద్యుత్తు బిల్లులు, దాణా ధర అధికంగా ఉండటం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు.. తదితర కారణాలతో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో రెండేళ్లలో తీర ప్రాంతాల్లో నెలకొన్న విభిన్న పరిస్థితులు రైతులను నట్టేట ముంచాయి. అప్పట్లో కొన్ని చోట్ల వైట్ స్పాట్ ప్రభావంతో రొయ్యలు పిల్ల దశలోనే చనిపోయాయి. ఈ క్రమంలో సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఐదేళ్లలో ఆక్వా రంగం పూర్తిగా నిర్వీర్యం కాగా మరోవైపు ఉష్ణోగ్రతలు, మంచు వాతావరణ పరిస్థితులు సాగుకు అనుకూలం కాదని రైతుల వాదన. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో సీజన్‌లో రైతులు రొయ్య సాగు చేపట్టడానికి వెనుకంజ వేస్తున్నారు.రైతులు ఫిబ్రవరి నుంచి సాగు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్రీడ్ అందుబాటులోకి..**

కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని స్థానిక హేచరీల్లో నాణ్యత కలిగిన రొయ్య పిల్లలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. గూడూరు డివిజన్‌లో టైగర్ రకానికి చెందిన రొయ్య పిల్లలను పుదుచ్చేరి, కేరళ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ రకం పిల్లలను కూడా స్థానిక హేచరీలలో ఉంచడంతో సాగు విస్తీర్ణం చేపట్టేందుకు రైతులు ముందుకు వచ్చే అవకాశం ఉందని ఆక్వా రైతులు పేర్కొంటున్నారు.

**కరెంటు కష్టాలు..**

రైతులకు ఇవ్వాల్సిన కరెంటు రాయితీపై జగన్ సర్కార్ కొర్రీలు పెట్టడంతో రైతులకు పెద్ద ప్రయోజనం దక్కలేదు. దీంతో ఐదేళ్ల కాలంలో వేలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునే పరిస్థితులు లేకపోవడంతో నట్టేట మునిగిపోయారు.

**రెండేళ్లుగా సాగుకు దూరం**

పదేళ్లుగా ఐదు ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా. ప్రతికూల పరిస్థితులు, గత ప్రభుత్వ నిర్ణయాలతో రెండేళ్లుగా సాగుకు దూరంగా ఉన్నా. ప్రస్తుతం భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం సాగుకు అనుకూలంగా లేదు.

జానకీరామిరెడ్డి, దొరువుకట్ట, ఆక్వా ఓంతు

**ఉష్ణోగ్రతలు పెరిగితేనే సాగు చేయండి**

వాతావరణంలో 30 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత ఉంటే సాగుకు అనుకూలం. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు చేస్తే రొయ్యలు పిల్ల దశలోనే చనిపోయే ప్రమాదం ఉంది. ఫిబ్రవరి ఆఖరులో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇబ్బందులు ఉండవు.రెడ్యానాయక్, ఎఫ్‌డీవో

# నియోజకవర్గంలో రహదారులకు మోక్షం

కుప్పం : నియోజకవర్గంలో రహదారుల దుస్థితికి కూటమి ప్రభుత్వ పాలనలో మోక్షం లభించనుంది. నాలుగు మండలాల్లో ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్ల అభివృద్ధి పనులకు 2024-25 ఆర్థిక సంవత్సరం నాబార్డు (ఆర్ఐడీఎఫ్) ద్వారా రూ. 34.27 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కుప్పం మున్సిపాలిటీ, గ్రామీణతోపాటు శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో 19 బీటీ రహదారుల అభివృద్ధి చేపట్టనున్నారు. ప్రత్యేక మరమ్మతుల నిధుల ద్వారా గ్రామీణ మార్గాలతో పాటు అంతర్రాష్ట్ర రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించనున్నారు.

**మహిళా శక్తి భవనానికి 18.70 ఎకరాలు** కుప్పం పురపాలక సంఘం పరిధి పలార్లపల్లె రెవెన్యూలో 18.70 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా శక్తి భవనంతోపాటు మహిళల పారిశ్రామిక పార్కును అందులో నిర్మించనున్నారు.

# నల్లిపేస్తోంది.. బాబోయ్

త్రిపురాంతకం : ఎర్ర బంగారంగా పేరొందిన మిరప పంటను నల్లి పురుగు(తామర) పీల్చిపిప్పి చేస్తోంది. ఇటీవల వరకు తోటలు బాగానే ఉన్నాయి. డిసెంబరు నెలాఖరులో కురిసిన వరుస వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగింది. దీంతో తామర పురుగు ఆశించింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పంట ప్రస్తుతం కీలమైన పిందె, కాయ దశకు చేరుకుంది. ఆలస్యంగా సాగు చేసిన చోట పూత, పిందె దశలో ఉంది. ఈ తరుణంలో తామర పురుగు ఆశిస్తుండటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

దెబ్బతీసిన వరుస వానలు...: జిల్లాలో 58,123 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులకు ఎకరాకు మరో రూ.40 వేలు అదనంగా వ్యయమవుతుంది. ఎకరాకు 25



నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే కష్టాలు తీరుతాయని కర్షకులు భావించారు. కాపు ముమ్మరంగా వస్తున్న దశలో వరుణుడు వారి ఆశలపై నీళ్లు చల్లాడు. డిసెంబరు చివరి వారంలో వచ్చిన ముసురు వాన పంటను దెబ్బతీసింది. త్రిపురాంతకం మండలం రామసముద్రం, మిట్టపాలెం, సోమేపల్లి, మేడపి, ఎండూరివారిపాలెం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు మండలాలతో పాటు జిల్లాలోని అధిక ప్రాంతాల్లో సాగు చేసిన మిరప పంటను నల్లతామర చుట్టుముట్టింది. ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చి వేస్తోంది. ఫలితంగా ఆకులు ముడుచుకుపోతున్నాయి. నివారణకు మందులను విపరీతంగా వినియోగిస్తున్నప్పటికీ అంతగా ఫలితం ఉండటం లేదు. ఒక పొలం నుంచి మరో పొలానికి విస్తరించే అవకాశం ఉండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వైకాపా నిర్లక్ష్యం రహదారి అధ్వానం

చిత్తూరు : వైకాపా పాలన నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ రోడ్డు.. చిత్తూరు నగరంలోని కట్టమంచి నుంచి కొంగారెడ్డిపల్లి వరకు ఉన్న పుత్తూరు బైపాస్ రోడ్డు ఇది. తిరుపతి, పీలేరు మార్గాల నుంచి పుత్తూరు మార్గంలో వెళ్లేందుకు చిత్తూరు నగరంలో ప్రవేశించకుండా నిర్మించిన బైపాస్ రోడ్డు ఇది. వైకాపా నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా ఈ రోడ్డు గోతులమయమైంది. ఇటుగా వెళ్లాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక కార్లు, ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి



వర్ణనాతీతం. గోతుల్లో దిగి పైకి ఎక్కే సమయాల్లో కింది భాగం తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ మార్గంలో నూతన రోడ్డు నిర్మించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

# ప్రయోగం.. శూన్యం..!

భీమవరం : ప్రయోగాలే నూతన ఆవిష్కరణకు వారధులు. దేశ సమగ్ర ప్రగతికి ఇవే ఆయువుపట్టుగా నిలుస్తాయి. దీనికి పాఠశాల, కళాశాల స్థాయిలో 'ప్రయోగ' విద్య ఎంతో కీలకం. కానీ ప్రభుత్వ జూనియర్, హైస్కూలు ప్లస్ కళాశాలల్లో ప్రయోగాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. పట్టుకోవడానికి పరీక్ష నాళిక లేదు... పరీక్షించడానికి రసాయనాలు కానరావు..అన్నరీతిలో కళాశాలలో ప్రయోగాలు పడకేశాయి.జిల్లాలోని చాలా కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించి సిలబస్ పూర్తి కాలేదు. కొన్ని కళాశాలల్లో గదుల కొరత, సామగ్రి లేకపోవడం, అరకొర రసాయనాలతో విద్యార్థులు ప్రయోగ విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్ని చోట్ల ల్యాబులున్నా పరికరాలు లేవు. హైస్కూలు ప్లస్‌ల్లో ల్యాబులే లేవు.

**తరగతులకే పరిమితం**

పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 229కు గాను సైన్స్ విద్యార్థులు 38 మంది ఉన్నారు. ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 102 మంది ఉన్నారు. గతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఒకే ప్రాంగణంలో నిర్వహించగా సుమారు ఎనిమిదేళ్ల కిందట జూనియర్ కళాశాలను దగ్గరలో మరో ప్రాంతానికి మార్చారు. అక్కడ ప్రయోగశాలకు గదులు లేకపోవడంతో డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**అరకొర వసతులే..**ఆకివీడు మండలం దుంపగడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్సు విద్యార్థులు 97 మంది ఉన్నారు. అరకొర పరికరాలు.. అందుబాటులో రసాయనాలు లేకపోవడంతో విద్యార్థులుప్రయోగాలకు దూరంగా ఉంటున్నారు.

**ఉన్నతీకరించి..సౌకర్యాలు విస్మరించి...**

గత వైకాపా హయాంలో 16 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో ఇంటర్ విద్య ప్రవేశపెట్టింది. కానీ ఆ మేర సౌకర్యాల కల్పన విస్మరించడంతో విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు. కనీస వసతులు, అధ్యాపకుల నియామకం అంతంత మాత్రంగా ఉన్నా తరగతులు ప్రారంభించారు.

**15 కి.మీ దూరం వెళ్లి..**నరసాపురంలో మూడు ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్‌గా ఉన్నతీకరించి ఇంటర్మీడియట తరగతులు ప్రారంభించారు. ముత్యాలపల్లి బండిముత్యాలమ్మ జడ్పీఉన్నత పాఠశాలలో ఎంపీసీలో ముగ్గురు, కేపీపాలెంనార్తులోని బాలికోన్నత పాఠశాలలో బైపీసీ రెండో ఏడాది చదువుతున్న వారు 13, కొప్పర్రు ఉన్నత పాఠశాలలో ఎంపీసీ రెండో ఏడాది చదువుతున్న వారు పది మంది చొప్పున ఉన్నారు. ఎక్కడా ప్రయోగశాలలు లేకపోవడంతో సుమారు 15 కి.మీ దూరంలో ఉన్న వై.ఎన్. కళాశాలకు వెళ్లి ప్రయోగ పరీక్షలు చేయిస్తున్నారు.తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమై రెండు దశాబ్దాలు దాటినా అద్దె భవనాల్లో కొనసాగుతోంది. ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కలిపి సుమారు 370 మంది విద్యార్థులుండగా ఆ స్థాయిలో తరగతులు, ప్రయోగశాలలు అందుబాటులో లేవు.శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూలు ప్లస్‌గా మార్చి రెండు గ్రూపులు ఏర్పాటు చేశారు. బైపీసీలో ప్రవేశం పొందిన నలుగురు విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఇతర కళాశాలలకు వెళ్తున్నారు.పరీక్ష.. ప్రయాసడిసెంబరు 1 నుంచి 90 రోజుల ప్రణాళికతో సిలబస్ పూర్తిచేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఇంటర్మీడియట బోర్డు ఆదేశించింది. సైన్సు విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తేనే సాధ్యమవుతుంది.

చురకలు



# లైంగిక వేధింపులపై చట్ట పర చర్యలు

## మార్చి 8... మహిళా దినోత్సవం సందర్భంగా




పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం వారి ప్రాథమిక హక్కులను హరించ డమే. ఆయా సందర్భాలలో మహి ళలు అన్యాయానికి, అసమానత లకు, గురవుతుండడం తరుచూ జరుగుతున్నదే. లింగసమానత్వం విషయంలో ఆశించిన స్థాయిలో సమాజంలో మార్పు రాకుండా ఉ ండడం చూస్తున్నదే. లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ పేరుతో జరిగే అనిష్టపూర్వక, ఆమోద యోగ్యం కాని లైంగిక ప్రవర్తనలు భారతదేశంలోనే కాక ప్రపంచ మంతటా అడ్డుకట్ట వేయలేక పోతుండడం పాత విషయమే. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నేరాల్లో అత్యధిక భాగం పురుషులు వల్ల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలే. అయితే ఏ మహిళ గానీ, పురుషుడు గానీ తమ వ్యక్తిగత గౌరవానికి హోదాకూ భంగం కలిగించే అటువంటి ప్రవర్తననూ దానివల్ల వ్యక్తులకూ, సంస్థలకూ, సమాజానికి జరిగే హానికర ప్రభావాలనూ సహించ వలసిన అవసరం లేకుండా ప్రపంచ దేశాలు పకడ్బందీ చర్యలు గైకొంటున్నాయి. అలాంటి ప్రవర్తనా ధోరణిని అణిచివేయ వలసిన అవసరాన్ని గుర్తించి అనేక దేశాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులని నిషేధిస్తూ, వాటికి వ్యతిరేకంగా చట్టబద్ధమైన చర్యల్ని చేపట్టాయి. పని ప్రదేశాల్లో మహిళల పట్ల జరిగే లైంగిక వేధింపుల (నిరోధం, నివార ణ, పరిహారాలు) చట్టం, 2013 ను ఆమోదించడం ద్వారా భారతదేశం కూడ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై చర్యలను బలోపేతం చేసింది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం, 2013 అనేది భారత దేశంలో మహిళలకు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నించి రక్షణ కలిగించటానికి ఏర్పడ్డ చట్టం. ఇది 2012 సెప్టెంబరు 3న లోక్ సభ ఆమోదం పొందింది. తర్వాత రాజ్య సభలో 2013 ఫిబ్రవరి 26న ఆమోదం పొందింది. ఈ బిల్లు చట్టం 2013 డిసెంబరు 9న అమలులోకి వచ్చింది. మహిళల మీద పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. పని ప్రదేశాల్లోని లైంగిక వేధింపులకు వ్యతిరేకమైన ఫిర్యాదులకు పరిహా రం అందేలా చూస్తుంది. మతం, జాతి, కులం, లింగ భేదం, లేదా ఇతరముల ఆధారంగా జీవన హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను అరికట్టడానికి వీలు లేదని రాజ్యాం గం స్పష్టం చేస్తున్నది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ 14, 15 ప్రకారం లైంగిక వేధింపు అనేది స్త్రీ ప్రాథమిక సమాన హక్కులను ఉల్లంఘిస్తుంది. అంతేకాక ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, హుందాగా జీవించే హక్కు, ఏ వృత్తి, ఉద్యోగం, వాణిజ్యం లేదా వ్యాపారం అయినా చేపట్టే హక్కుల లో నే లైంగిక వేధింపులు లేని వాతా వరణంలో పని చేసే హక్కు కూడా ఉ ంది. లైంగిక వేధింపులనేవి మహిళలకు సమాన అవకాశాలకూ సమానత్వ ప్రాతిపదికను పొందేందుకు అడ్డంకు అవుతాయదన్న కారణంగా భారత ప్రభుత్వం ప్రత్యేకించి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో నిబద్ధతను కన పరిచాయి. అలాగే మార్గదర్శ కాలను లేబర్ కమీషనర్లకు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలకు మార్గదర్శక సూత్రాలను రూపొందిం చడం జరిగింది. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల పట్ల జరిగే లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారాలు) చట్టం 2013, అమలులో భాగంగా, కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాల్లోనూ, జిల్లా స్థాయిల్లోనూ, ఉద్యోగుల, పనివార ల, మహిళా సంస్థల్లోనూ ఉపయో గించేందుకు ఎప్పటికప్పుడు యీ చట్టం లోని మార్గదర్శక సూత్రాలను వర్తమాన పరిస్థితులకు అనుగుణం గా మెరుగుపర్చు కోవచ్చునని నిర్ణయించడం జరిగింది. ఒకే చోట పనిచేస్తున్న సమయంలో మగ, ఆడవాళ్ల, మధ్య స్నేహ పూర్వక బంధాలు ఏర్పడటం సర్వ సాధారణం. అయితే కొన్ని సందర్భా లలో వారి మధ్య సంభాషణలు, ప్రవర్తనలు శ్రుతి మించే అవకాశమూ ఉ ంటుంది. ఇద్దరికీ ఇబ్బంది లేనప్పుడు ఎలాంటి సమస్యా లేదు. పరస్పర అంగీకారం కొరవడి, మహిళ అభ్యంతరం చెప్పాక కూడా అవతలి వ్యక్తి అలానే వ్యవహరిస్తే అది లైంగిక వేధింపు కిందకే వస్తుంది. వేధించే వ్యక్తి ఆఫీసులో తమకంటే పై స్థాయిలో ఉన్నవాడైతే, వాళ్లపై ఫిర్యాదులు తమ ఉద్యోగాలకు ఎసరు పెట్టే ప్రమాదం ఉందని వారు భయపడుతున్నారు. అందుకే వారు ధైర్యంగా ఫిర్యాదు చేయ లేకపోతున్నారు. ఒక్కో సందర్భం లో ఆ వ్యక్తి ఏదైనా చేస్తాడనే భయంతో కూడా మహిళ లు మౌనంగా ఉండిపోతున్నారు. చట్ట ప్రకారం పది మందికన్నా ఎక్కువ సిబ్బంది ఉన్న ప్రతి సంస్థా 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'ని ఏర్పాటు చేయాలి. దానికి ఒక సీనియర్ మహిళా ఉద్యోగి నాయ కత్వం వహించాలి. అందులో సగానికి పైగా మహిళా సభ్యులుం డాలి. మహిళల కోసం పనిచేసే ఏదో ఒక ఎన్జీవో ప్రతినిధికి కూడా అందులో సభ్యత్వం ఉండాలి. పదిమందికంటే తక్కువ సిబ్బంది ఉన్న సంస్థల్లో ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే, జిల్లా స్థాయి ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




# విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మలచడంలో మహిళా ఉపాధ్యాయుల కీలక పాత్ర

## జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

మహిళలు విద్యారంగంలో విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మలచడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యాసంస్థల వరకు, వారు పిల్లల ఆలోచనా శైలిని, నైపుణ్యాలను, సామాజిక విలువలను నిర్మించడంలో సహాయ పడుతున్నారు. మహిళా ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడంలోనే కాదు, సమాజంలో స్త్రీ సాధికారత, సమానత్వం వంటి విషయాల్లో అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఓర్పు, దయ, స్ఫూర్తితో విద్య బోధించే మహిళలు, చిన్నారుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ఇప్పటికీ కొన్ని సమాజాల్లో మహిళలు ఉపాధ్యాయులుగా ఉండటాన్ని తక్కువగా అంచనా వేస్తారు. ఈ విధమైన భావజాలం మహిళా ఉపాధ్యాయుల ఆత్మ విశ్వాసాన్ని తగ్గిస్తుంది. పురుష ఉపాధ్యాయులతో పోలిస్తే, మహిళా ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలు అందజేసే సందర్భాలు ఉండేవి. ఇది లింగ అసమానతకు నిదర్శనం. కాగా ప్రస్తుతం అలాంటి వ్యత్యాసాలు లేకుండా ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఉపాధ్యాయులుగా పనిచేయడం కంటే ఎక్కువగా, గృహ బాధ్యతలు, కుటుంబ సంబంధిత బాధ్యతలను కూడా నిర్వర్తించాల్సి రావడం మహిళా ఉపాధ్యాయులకు అదనపు ఒత్తిడిని సృష్టిస్తుంది. మహిళా ఉ పాధ్యాయులకు పనిచేయటానికి సౌకర్యవంతమైన, సమానత్వంతో కూడిన వాతావరణాన్ని కల్పించడం అత్యవసరం. ఉపాధ్యాయుల మధ్య లింగ సమానత్వానికి న్యాయం చేయడమే నిజమైన అభివృద్ధి. మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా, సమాజంలో వారి ప్రాముఖ్యతను చాటవచ్చు. విశిష్ట మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం, ప్రతీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల కృషిని గుర్తించే కార్యక్రమాలు నిర్వహించాలి. మహిళా ఉపాధ్యాయుల జీవితాలపై ప్రత్యేక కథనాలు, ప్రసంగాలు నిర్వహించడం ద్వారా, యువతకు వారిని ఆదర్శంగా నిలపవచ్చు. విద్యార్థులు ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చి, మహిళా ఉపాధ్యాయుల కృషికి కృతజ్ఞత తెలియ జేయవచ్చు. మహిళా దినోత్సవం మహిళల పట్ల కృతజ్ఞతను తెలియజేసే అవకాశం కల్పిస్తుంది. వారి కృషి, త్యాగం, నిబద్ధత వల్లనే సమాజానికి సరైన పునాది ఏర్పడింది. ఈ దినోత్సవం ద్వారా వారికి మరింత గౌరవం అందిస్తూ, వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి. మహిళా ఉ పాధ్యాయులు సమాజానికి వెలకట్టలేని ఆస్తి, వారి కృషిని గుర్తించడంలో ఎల్లప్పుడూ ముందుండాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# మోడీ నుంచి నేర్చుకున్న పాఠాన్ని రివీల్ చేసిన చంద్రబాబు



గతంలో ముఖ్యమంత్రిగా పలుమార్లు పని చేసిన చంద్రబాబుకు.. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి సీఎం అయ్యాక ఆయనలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో సీరియస్ గా ఉండటం.. చతురతకు అవకాశం ఇవ్వకుండా ఉండటంతో పాటు.. తాను చేసిన తప్పుల్ని ఒప్పుకునే గుణం ఉండేది కాదు. కానీ.. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా తనను ఉద్దేశించి చేసే విమర్శల్ని గుర్తిస్తున్నారు. తనను తాను గొప్పగా చెప్పుకునే పాత చంద్రబాబుకు.. ఇప్పటి చంద్రబాబుకు కాస్త తేడా ఉంది. ఎదుటివారిలోని గొప్పతనాన్ని గుర్తిస్తున్నారు. దాని గురించి మాట్లాడుతున్నారు. తాను నేర్చుకున్న పాఠాల్ని బయటకు చెప్పేందుకు సంకోచించటం లేదు. మొత్తంగా చంద్రబాబులో మారిన మనిషి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాడు. తాజాగా రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ప్లీనరీలో 'లిమిట్ లెస్ ఇండియా' అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనో ఆసక్తికర అంశాన్ని షేర్ చేశారు. మంచి పనులు చేయటంతో పాటు ప్రజలు మనవైపు ఉండేలా చూసుకోవటం చాలా ముఖ్యమని.. డెవలప్ మెంట్ మీద ఫోకస్ చేసి.. చేసే పని గురించి ప్రజలకు సరిగా చెప్పకపోతే.. ఎన్నికల్లో వారు ఓట్లు వేయకపోవచ్చన్న ఆసక్తికర విషయాన్ని చంద్రబాబు వెల్లడించారు. 2004, 2019లలో తాను డెవలప్ మెంట్ పనుల్లో మునిగిపోవటం వల్ల తాను ఓడిపోయానే తప్పించి.. ప్రతిపక్షాలు తనను ఓడించలేదన్నారు. ఈ విషయంలో తాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అభినందిస్తున్నట్లు చెప్పారు. మోడీ తాను అనుకున్న పనుల్ని చేయటమే కాదు.. స్థిరత్వాన్ని కొనసాగిస్తున్నారని.. ఇదెన్నో సమస్యల్ని పరిష్కరించినట్లుగా చెప్పారు. 'ఎన్నికల్లో ఓడిపోకూడదన్న పాఠాన్ని నేను ప్రదానమంత్రి నరేంద్ర మోడీ నుంచి నేర్చుకున్నా' అంటూ తన మనసులోని మాటల్ని చెప్పుకొచ్చారు. భారత్ కు భవిష్యత్తులో హద్దులు ఉండవని తాను భావిస్తున్నట్లు చెప్పిన చంద్రబాబు.. మోడీ నాయకత్వంలో భారత్ 2047 నాటికి ఒకట్రెండు స్థానాలకు చేరుకుంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు నంబర్ వన్ స్థానంలో ఉ ంటారన్నచంద్రబాబు.. 'ఈ రోజు నేను చెప్పిన మాటల్ని రాసి పెట్టుకోండి. ప్రస్తుతం మనమంతా యూదుల గురించి మాట్లాడుకుంటున్నాం. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా వారు అత్యంత ప్రభావం చూపే స్థితిలో ఉన్నారు. కానీ.. ఇప్పుడు ప్రపంచంలోని ఏ సంపన్న నివాస ప్రాంతాలకు వెళ్లి చూసినా అది భారతీయులదే అవుతుందని గర్వంగా చెప్పగలను. అమెరికాలోని భారతీయుల సగటు ఆదాయం ఇక్కడున్న మిగిలిన దేశాల వారి కంటే రెట్టింపు" అంటూ ఆసక్తికర అంశాల్ని వెల్లడించారు.

# మారిన సీన్.. ఐటీలో తగ్గిన బెంచ్ టైం

పేరుకు ఆకర్షణీయమైన జీతాలన్న మాటే కానీ తీవ్రమైన పని ఒత్తిడి ఐటీ ఉద్యోగాల్లో కనిపిస్తూ ఉంటుంది. పైకి టిప్పుటాప్ గా కనిపించినప్పటికీ.. టార్గెట్ల కత్తుల్ని చుట్టూ పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. చేస్తున్న ప్రాజెక్టు పూర్తైనంతనే.. మరో ప్రాజెక్టు ఎప్పుడు చేతికి వస్తుందా? అన్న టెన్షన్ వెంటాడుతుంటుంది. టాలెంట్ ఎంత ఉన్నా.. అన్నీ అనుకున్నట్లు కుదరకపోతే.. బెంచ్ మీద కూర్చోవాల్సిందే. కొందరు దీన్ని ఎంజాయ్ చేసినట్లు కనిపించినా.. దీనికి మించిన నరకం మరేమీ ఉండదని చెబుతారు ఐటీ ఉద్యోగులు. ఐటీ కంపెనీల్లో జాబ్ రావటం ఒక ఎత్తు అయితే.. ఏదో ఒక ప్రాజెక్టులోకి వెళ్లటం అన్నింటికి మించి ముఖ్యం. ఈ విషయంలో ఎలాంటి ప్రాజెక్టును కేటాయించని ఉద్యోగిని బెంచ్ మీద కూర్చోబెట్టినట్లుగా పేర్కొనటం తెలిసిందే. మరీ ఎక్కువ కాలం బెంచ్ మీద ఉంటే జాబ్ పోయే ఛాన్సు ఉ ంటుంది. సాధారణంగా కొత్తగా కంపెనీలో చేరిన ప్రతిఒక్కరు కొంతకాలం బెంచ్ మీద ఉండటం మామూలే. కాకుంటే ఈ ఏడాదిన్నర కాలంలో ఈ బెంచ్ మీద ఉద్యోగుల్ని ఉంచే సరాసరి టైం తగ్గిన వైనం వెలుగు చూసింది. దేశీయంగా టీసీఎస్.. ఇన్ఫోసిస్.. విప్రో.. హెచ్ సీఎల్ టెక్.. అసెంచర్ లాంటి పెద్ద ఐటీ కంపెనీలు బెంచ్ పై ఉన్న ఉద్యోగుల సంఖ్యతో పాటు.. బెంచ్ పై సమయాన్ని తగ్గిస్తూ వస్తున్నాయి. దీనికి కారణం రెండేళ్లుగా భారీగీ రిక్రూట్ మెంట్లు జరపకపోవటం కూడా కారణం. కొవిడ్ వేళ ఐటీ రంగానికి మంచి ఊపు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా డిజిటలీకరణ



ఒక్కసారిగా షురూ కావటం తెలిసిందే. దీంతో భారీ ఎత్తున ప్రాజెక్టులు వచ్చాయి. ఐటీ కంపెనీల వృద్ధి రేటు సైతం రెండు అంకెల్లో ఉండేది. అప్పట్లో బెంచ్ సమయం 45-60 రోజులుగా ఉండేది. ప్రస్తుతం 35-45 రోజులకు పరిమితమైనట్లుగా చెబుతున్నారు. ఐటీ కంపెనీ మొత్తం సిబ్బందిలో బెంచ్ ఉద్యోగుల సగటు 10-15 శాతంగా ఉండగా.. ఇప్పుడది 2-5 శాతం మాత్రమేనని చెబుతున్నారు. గతంలో కొత్తవారు మాత్రమే బెంచ్ మీద ఉండేవారు. ఇప్పుడు ఏఐ.. మెషీన్ లెర్నింగ్.. క్లౌడ్ పుణ్యమా అని సరికొత్త సాంకేతికత మీద పట్టు లేని సీనియర్లు సైతం బెంచ్ మీద ఉ ండాల్సి వస్తోంది. 9-14 ఏళ్ల అనుభవం ఉన్న వారు కూడా బెంచ్ లేఆఫ్ రిస్కును ఎదుర్కొంటున్నారు. 2022, 2023లో బెంచ్ మీద కూర్చునే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉండేదని చెబుతున్నారు. కరోనా వేళ భారీగా రిక్రూట్ మెంట్లు చేయటం.. ఆ తర్వాతి కాలంలో ప్రాజెక్టులు తగ్గటంతో సిబ్బంది వినియోగం తగ్గింది. దీంతో.. కంపెనీ ఆదాయాలు.. మార్జిన్ల మీద ఒత్తిడి పెరిగింది. దీంతో.. 2023 నుంచి రిక్రూట్ మెంట్ విషయంలో కంపెనీలు ఆచితూచి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. అయితే.. టీసీఎస్.. ఇన్ఫోసిస్.. విప్రో.. హెచ్ సీఎల్.. అసెంచర్ లాంటి టైర్ 1 కంపెనీల్లో బెంచ్ మీద కాస్త ఎక్కువ మందే ఉ న్నట్లు చెబుతున్నారు. క్లయింట్లు అడిగిన వెంటనే ప్రాజెక్టుల కోసం వీరిని ఉపయోగించుకుంటున్నారు. గతానికి భిన్నంగా ఇప్పుడు ఐటీ కంపెనీల వ్యాపారవ్యూహాల్లో మార్పులు వస్తున్నాయి. సగం ఉద్యోగులతో రెట్టింపు ఆదాయం వచ్చేలా పని చేయాలని తమ టీంలకు సవాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని కంపెనీలు అయితే తమ కంపెనీల్లో బెంచ్ కాన్సెప్టునే తీసేస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. గతంతో పోలిస్తే ప్రస్తుతం బెంచ్ మీద ఉద్యోగుల్ని ఉంచే టైం అయితే తగ్గిందంటున్నారు. ఈ కబురు ఐటీ జీవులకు కాస్త ఉత్సాహాన్ని ఇచ్చేదిగా చెప్పక తప్పదు.

# రాములమ్మ ఎమ్మెల్సీ ప్రయత్నాలు!


గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ అలా పూర్తయిందో లేదో..ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చిపడ్డాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కోలాహలం మొదలైంది. మొత్తం 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఒకటి బీఆర్ఎస్ కు, నాలుగు కాంగ్రెస్ కు దక్కనున్నాయి. అయితే ఇందులో నాలుగో సీట్లలో కాంగ్రెస్ గెలవాలంటే ఎంఐఎం మద్దతు తప్పనిసరి. ఈక్రమంలో కాంగ్రెస్ కు నాలుగు సీట్లు దక్కనుండడంతో వీటి కోసం భారీగా కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు. ఆశావహుల్లోకి రాములమ్మ విజయశాంతి కూడా వచ్చి చేరారు. రాములమ్మ తెలంగాణలోని పార్టీలన్నింటినీ చుట్టేసిన సంగతి తెలిసిందే. మొదట్లో బీజేపీలో ఉన్నా రాములమ్మ ఆ తర్వాత ఓ పార్టీ పెట్టారు. ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. ఆ తర్వాత కేసీఆర్ పై కోపంతో కాంగ్రెస్ లో చేరారు. కేసీఆర్ పై కోపంతో కాంగ్రెస్ లో చేరినా.. ఆ పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు. ఎప్పుడోగాని ఓ ట్వీట్ చేసి వదిలేస్తారు. ఎన్నికల ముందు అలా ఒకసారి వచ్చిపోతారు. అంతేగాని ఆమె కాంగ్రెస్ లో ఉన్నట్టు పెద్దగా క్యాడర్ కూడా గుర్తించడం లేదు. ఈనేపథ్యంలో విజయశాంతి తనకు ఓ పదవికావాలని డైరెక్ట్ గా హైకమాండ్ ను కలిశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు



మల్లికార్జున్ ఖర్గేను కలిసి పార్టీకి తాను ఎనలేని సేవలు అందించానని, తన సేవలు, త్యాగాన్ని గుర్తించి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవిని తనకు కేటాయించాలని కోరారు. దీనికి హైకమాండ్ ఎలా స్పందిస్తుంది అనేది తర్వాత తెలుస్తుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు విపరీతమైన పోటీ ఉంది. కాంగ్రెస్ కు వచ్చే నాలుగు సీట్లకు నలభై ఆరు మంది పోటీ పడుతున్నారు. ఇందులో తమకూ ఒక సీటు కావాలని మిత్రపక్షం సీపీఐ కోరుతోంది. అలాగే గ్రేటర్ ఎన్నికల్లో ఎంఐఎం మద్దతు ఇవ్వాలంటే దానికో సీటు ఇవ్వాలి. అంటే నాలుగు సీట్లలో రెండు సీట్లు మిత్రపక్షాలకే పోతే పార్టీ నాయకులకు ఎలా అవకాశం ఇచ్చేది అంటూ అధిష్ఠానం ఇరకాటంలో పడింది. ఒక వేళ మిత్రపక్షాలకు ఇవ్వకపోయినా నాలుగు సీట్లను కాంగ్రెస్సే తీసుకున్నా.. వాటిని కేటాయించడం కూడా తలనొప్పిగానే మారింది. ఎమ్మెల్సీ సీటు కోరుతున్న వారందరూ గతంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలప్పుడు త్యాగం చేసిన వారే. అలాగే ఎక్కువ మంది రేవంత్ అనుచరులే ఉన్నారు. కొందరు ఎప్పటినుంచో ఏ అవకాశం లేకుండా ఉన్నారు. వారూ తమకూ కేటాయించాలని అడుగుతున్నారు. ఇదిలా ఉంటే నాలుగు సీట్లను సామాజిక వర్గాల వారీగా ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఓసీ,బీసీ,ఎస్సీ, ఎస్టీ కి కేటాయించాల్సి ఉంది. బీసీల్లో వివిధ కులాలు తమకు కేటాయించాలంటున్నాయి. ఎస్సీల్లో మాల, మాదిగ వర్గాలు తమకే కేటాయించాలంటున్నాయి. ఎమ్మెల్సీ సీట్లకు ఇంత పోటీ ఉన్న నేపథ్యంలో.. ఎప్పుడో ఒకసారి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే విజయశాంతికి సీటు ఇస్తుందా అనేది డౌటే అంటున్నారు విశ్లేషకులు. ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వడం అనేది పూర్తిగా హైకమాండ్ చేతిలోనే ఉ ంటుంది. రాష్ట్ర నేతలు పంపించిన వివరాల ప్రకారం వారు సెలక్ట్ చేస్తారు. మరి ఇంత కాంపిటీషన్ లో రాములమ్మకు బెర్త్ ఖాయమవుతుందా? లేదా అనేది రెండు, మూడు రోజుల్లోనే తేలనుంది.

## నల్ల కోకలో మిల్కీ సోయగాల వల

అసలే మిల్కీ అందం.. ఆపై కొంటె చూపుల బాణాలు విసురుతోంది. అలా ఏటవాలుగా వెనక్కి చూస్తూ, నల్ల కోక సొగసును, సన్నజాజి నడుమును ఆవిష్కరిస్తోంది. ఆల్ బ్లాక్ లో మిల్కీ షైనీ లుక్స్ మతులు చెడగొడుతున్నాయి. ప్రియుడు విజయ్ వర్మ నుంచి బ్రేకప్ అయిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో యూత్ ని డైవర్ట్ చేయడానికే ఈ ఫోటోషూట్ అని భావించాల్సి ఉంటుంది. తనదైన అందం, రూపలావణ్యంతో రెండు దశాబ్దాల కెరీర్ ని సునాయాసంగా లాగించేసింది తమన్నా. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసగా అవకాశాలు అందుకునే ప్రతిభావనిగా నిరూపించుకుంది.




మిల్కీ అందం ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటిస్తోంది. మూడు చోట్లా మూడు ముక్కలాటలో ఆరితేరిపోయింది.

మరోవైపు వెబ్ సిరీస్ లలోను అవకాశాలు అందుకుంటూ ఓటీటీ క్వీన్ గా సత్తా చాటుతోంది. తమన్నా నటించిన ఓదెలా 2 విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాని ప్రమోట్ చేయడంలో తమన్నా స్పీడ్ గా ఉంది. ఇటీవలే టీజర్ విడుదలై ఆకట్టుకుంది. దైవ శక్తి గురించిన చిత్రం ఓదేలా2. తమన్నా ఇటీవల ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో స్నానాదులు ఆచరించి, అనంతరం పూజల్లో తరించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. వీలున్న ప్రతి వేదికపైనా తమన్నా టీమ్ ఓదెలా 2 కి ప్రచారం కల్పిస్తోంది.

## వింత సమస్యతో నవ్వుతున్న లైలా

సౌత్ సినీ ఇండస్ట్రీలో తన అందం, అభినయంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ లైలా. చొట్టబుగ్గల సుందరిగా తన నవ్వుతో ఆడియన్స్ మనసుల్ని గెలుచుకున్న లైలా కెరీర్లో ఎన్నో సక్సెస్‌లు అందుకుంది. మధ్యలో సినిమాలకు దూరమైన లైలా మళ్లీ 2022లో కార్తీ నటించిన సర్దార్ సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత దళపతి విజయ్ హీరోగా చేసిన ది గోట్ సినిమాలో కూడా కనిపించి మెప్పించింది. ఇప్పుడు తాజాగా ఆది పినిశెట్టి శబ్ధం సినిమాలో లైలా కీలకపాత్రలో కనిపించింది. శబ్ధం సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రావడంతో పాటూ లైలాకు కూడా మంచి ప్రశంసలొ



స్తున్నాయి. శబ్ధం ప్రమోషన్స్ లో భాగంగా లైలా తనకున్న ఓ వింత సమస్యను బయటపెట్టింది. నవ్వకుండా ఉండటం తన వల్ల కాదని, అలా ఉంటే వెంటనే తనకు కళ్ల నుంచి నీళ్లొస్తాయని తెలిపింది. అయితే తన సమస్యను తెలుసుకున్న తమిళ హీరో విక్రమ్, శివపుత్రుడు షూటింగ్ టైమ్ లో నవ్వకుండా ఓ నిమిషం పాటూ ఉండాలని తనతో బెట్ వేశాడని, కానీ 30 సెకన్లలోనే తాను ఏడవడం మొదలుపెట్టానని, దాని వల్ల తన మేకప్ మొత్తం పాడైపోయిందని లైలా ఆ రోజుల్ని గుర్తు చేసుకుంది. తనంతట తాను నవ్వు ఆపడానికి ఎప్పుడు ప్రయత్నించినా సరే ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు వచ్చేస్తాయని, ఈ వింత ఆరోగ్య సమస్యతోనే తాను ఎప్పుడూ నవ్వుతూ ఉంటుందని లైలా వెల్లడించింది. లైలా సమస్య గురించి తెలుసుకున్న ఆమె ఫ్యాన్స్ ఇలాంటి సమస్యలు కూడా ఉంటాయా అని షాకవుతున్నారు. ఇక లైలా కెరీర్ విషయానికొస్తే 1996 నుంచి 2006 వరకు తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసిన ఆమె ఎన్నో సూపర్ హిట్లు అందుకుంది. 2006లో మెహ్దీనీని పెళ్లి చేసుకుని పూర్తిగా సినిమాలకు దూరమైంది. లైలా భర్త ఇరాన్ కు చెందిన బిజినెస్ మ్యాన్ కాగా ఈ జంటకు ఇద్దరు అబ్బాయిలున్నారు.




## పోటీ హీరో కోసమా లేక డైరెక్టర్ కోసమా?



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ కూలీ. ఉపేంద్ర, నాగార్జున, శృతి హాసన్, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం రజినీ ఫ్యాన్స్ తో పాటూ మూవీ లవర్స్ అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. యాక్షన్, గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో రానున్న ఈ సినిమాకు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉంది. ఈ ఏడాది రిలీజ్ కానున్న కూలీ సినిమా తెలుగు హక్కుల కోసం తెలుగులో మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కూలీ తెలుగు డిస్ట్రిబ్యూషన్ హక్కులకు తీవ్ర పోటీ నెలకొంది. సన్ పిక్చర్స్ ప్రొడక్షన్స్ లో కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమా హక్కుల కోసం టాలీవుడ్ లోని పలు పెద్ద సంస్థలు పోటీ పడుతున్నట్టు సమాచారం. వారిలో ముఖ్యంగా ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్ తో పాటూ సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే నిర్మాతలు మాత్రం కూలీ రైట్స్ కోసం రూ.40 కోట్లు రేటు చెప్పారని, దానికంటే ఎవరు ఎక్కువ ఇస్తే వారికి కూలీ తెలుగు రైట్స్ ను అమ్మాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా లానే రీసెంట్ గా సూర్య నటిస్తున్న రెట్రో సినిమా తెలుగు హక్కులకు కూడా తీవ్ర పోటీ ఏర్పడింది. చివరకు దాదాపు రూ. 9 కోట్లతో సితార నాగవంశీ ఆ సినిమా తెలుగు రైట్స్ ను సొంతం చేసుకోగా, ఇప్పుడు మరోసారి కూలీ రైట్స్ కోసం పోటీ పడుతున్నాడు. లోకేష్ దర్శకత్వంలో వచ్చిన ఆఖరి సినిమా లియో తెలుగు హక్కులను కూడా వంశీనే సొంతం చేసుకుని తెలుగులో రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ప్రస్తుతం కూలీ షూటింగ్ చెన్నై ఎయిర్‌పోర్ట్ లో జరుగుతుంది. మార్చి నెలాఖరుకి షూటింగ్ పూర్తి చేయాలని చూస్తున్న టీమ్, ఈ నెలలోనే టీజర్ ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తోంది. ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకు సౌత్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

## కొడుకుపై నెపోటిజం.. అండగా అమితాబ్!



బాలీవుడ్‌లో నెపోటిజం అనే మాట ఎంత గట్టిగా వినిపించిందో అందరికీ తెలిసిందే. స్టార్ కిడ్స్ ఎంట్రీపై ఎప్పుడూ ఒక విమర్శ ఉంటూనే ఉంటుంది. కానీ, ఈ విషయంలో అభిషేక్ బచ్చన్ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఎందుకంటే ఆయన నెపోటిజం వల్ల అవకాశాలు దక్కించుకున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నా, కెరీర్‌లో ఎదుర్కొన్న సవాళ్లు మాత్రం కఠినమైనవే. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ కుమారుడిగా ఇండస్ట్రీకి వచ్చిన అభిషేక్, సినీ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నటుడు. బిగ్ బి క్రేజ్ ఉన్నప్పటికీ అతనికంటూ ఇప్పటివరకు సరైన మార్కెట్ క్రియేట్ కాలేదు. పలు సినిమాలను నిర్మించి నష్టపోయారు కూడా. ఇక ఐశ్వర్యారాయ్ తన లైఫ్ లోకి రావడంతో కూడా అతనిపై భిన్నమైన కామెంట్స్ వచ్చాయి. అయితే అభిషేక్ మాత్రం స్టార్ డమ్ మొదటి సినిమాకు పనికొస్తుందేమో గాని ఆ తరువాత టాలెంట్ లేకుంటే ఇండస్ట్రీలో ఉండలేము అని కౌంటర్ ఇచ్చారు. ఇక ఇటీవల ఓ నెటిజన్ అభిషేక్ బచ్చన్ టాలెంట్‌పై ప్రశంసలు చేస్తూ, అతను చాలామంచి సినిమాలు చేసినప్పటికీ అనవసరంగా నెపోటిజం ట్యాగ్ అతనిపై అట్టకట్టబడిందని ట్వీట్ చేయగా, అమితాబ్ బచ్చన్ దీనిపై స్పందించారు. “తండ్రిని కాబట్టి నేను ఈ మాట చెప్పడం లేదు, కానీ నిజంగా ఇదే నా ఫీలింగ్,” అంటూ అభిషేక్‌కి మద్దతుగా నిలిచారు. ఇండస్ట్రీలో నెపోటిజం ఉందా? లేదా? అనే విషయాన్ని పక్కన పెడితే, ఎవరైనా టాలెంట్ ఉంటేనే నిలదొక్కుకుంటారని అమితాబ్ వ్యాఖ్యలు సూచించాయి. అభిషేక్ కెరీర్ ప్రారంభం నుంచి బిగ్ హీరోగా ఎదగడానికి ప్రయత్నించాడని అందరికీ తెలుసు. ‘రిఫ్యూజీ’తో అరంగేట్రం చేసిన ఆయన ‘యువ’, ‘ధూమ్’, ‘గురు’ లాంటి సినిమాల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కానీ, అనుకున్న స్థాయిలో స్టార్‌డమ్ మాత్రం అందుకోలేకపోయాడు. కెరీర్‌లో కొన్ని విజయాలు సాధించినప్పటికీ, ఎక్కువగా ఫ్లాప్ సినిమాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ, తనదైన స్టైల్‌లో తన ప్రయాణాన్ని కొనసాగించాడు. అభిషేక్ మీద నెపోటిజం ట్యాగ్ అతని కెరీర్ మొత్తాన్నీ ప్రభావితం చేసిందా అంటే, కొంతవరకు నిజమే. కానీ, ఒక సినీ కుటుంబంలో పుట్టినంత మాత్రాన అవకాశాలు వరుసగా వస్తాయని నమ్మడం పొరపాటే. అభిషేక్ తన కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు చూసాడు. ఇదే విషయాన్ని గతంలో ఇంటర్వ్యూలో చెబుతూ, “నాన్న ఎప్పుడూ నా కెరీర్‌లో జోక్యం చేసుకోలేదు. ఎవరి దగ్గరనూ నాకోసం సినిమాలు అడగలేదు. నా సినిమాలకు నిర్మాతగానూ వ్యవహరించలేదు. కానీ, నేను మాత్రం ఆయన నటించిన ‘పా’ సినిమాకి నిర్మాతగా వ్యవహరించాను,” అని చెప్పాడు. ఒకప్పుడు నెపోటిజం అనే విషయం పెద్దగా చర్చ కాకపోయినా, ఇప్పుడు సోషల్ మీడియా వచ్చాక ప్రతి చిన్న విషయంపై పెద్ద చర్చ జరుగుతోంది. కేవలం ఇంటర్నెట్ ట్రోల్స్ మాత్రమే కాదు, ఇండస్ట్రీలో కూడా కొంతమంది అభిషేక్‌ను పెద్ద స్టార్‌గా చూడలేకపోయారు. ఇప్పుడు అమితాబ్ బచ్చన్ తన కొడుకు గురించి చెప్పిన మాటలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తండ్రిగా అండ ఇవ్వడమే కాదు, తన కొడుకు మంచి నటుడు అన్న విషయాన్ని కూడా గుర్తుచేశారు.

## కత్తి లాంటి జాన్వీ చేప

ఎన్టీఆర్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ దేవర పార్ట్ 1 కమర్షియల్‌గా బిగ్ హిట్ కొట్టింది. కానీ సీక్వెల్ అయిన దేవర 2 తెరకెక్కుతుందా లేదా అనే విషయంలో మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. మేకర్స్ అధికారికంగా ఎలాంటి అప్డేట్ ఇవ్వకపోయినప్పటికీ, కొరటాల శివ మాత్రం పార్ట్ 2 స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు. ఇక జాన్వీ కపూర్ ఈ సినిమాలో తంగం అనే పాత్రలో కనిపించినా, ఆమెకు పెద్దగా స్కోప్ లేదనే టాక్ ఎక్కువగా వచ్చింది. ఫస్ట్ పార్ట్‌లో ఆమె పాత్ర రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్ లో చాలా సాధారణంగా ఉండటంతో కొంతమంది నిరాశపడ్డారు. అయితే దర్శకుడు కొరటాల శివ గత ఇంటర్వ్యూలో సెకండ్ పార్ట్‌లో జాన్వీ క్యారెక్టర్‌కు పెద్ద ప్రాధాన్యత ఉంటుందని చెప్పిన సంగతి తెలిసిందే. అంటే దేవర 2 వస్తే, ఆమె పాత్ర మరింతగా బలంగా కనిపించే ఛాన్స్ ఉందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. ఇక జాన్వీ బర్త్‌డే సందర్భంగా దేవర టీమ్




రిలీజ్ చేసిన ఒక పోస్టర్ ఇప్పుడు వైరల్ అవుతోంది. నోట్లో కత్తిను పట్టుకుని, భుజంపై చేపను వేసుకుని ఉన్న లుక్ ఆమె పాత్రలో ఓ వైల్డ్ టచ్ ఉందని చెబుతోంది. ఇక జాన్వీ మరోవైపు రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న %=జ%16 చిత్రంలో కూడా లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమాలో ఆమె పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని టాక్. దేవర లాంటి పిరియాడిక్ బ్యాక్‌డ్రాప్ నుంచి స్పోర్ట్స్ డ్రామా జానర్‌లోకి అడుగుపెడుతూ, జాన్వీ ఇప్పుడు వరుసగా తెలుగు సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటోంది. దేవర 1 కమర్షియల్ సక్సెస్ అయిన తర్వాత, దేవర 2 పవర్ఫుల్ స్క్రిప్ట్ తో వస్తే జాన్వీ దశ తిరిగినట్లే. మొత్తానికి దేవర 2 అఫీషియల్ ఎనౌన్స్‌మెంట్ రాకపోయినా, తంగం పాత్రతో మేకర్స్ సౌండ్ చేసిన విధానం వైరల్ అవుతోంది.

## చీర కట్టులో అందాల రాశి

‘ఊహాలు గుసగుసలాడే’ సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అయిన రాశి ఖన్నా తక్కువ సమయంలోనే పలువురు యంగ్ హీరోలకు జోడీగా నటించింది. కెరీర్ ఆరంభంలో కాస్త బరువు ఎక్కువగా అనిపించిన రాశి ఖన్నా తెలుగు ప్రేక్షకుల కోసం, టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం కోసం రాశి ఖన్నా బరువు తగ్గింది. బరువు తగ్గిన తర్వాత రాశి ఖన్నా పేరుకు తగ్గట్టు మరింత అందంగా ఉందని అభిమానులు కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా గురించి రెగ్యులర్‌గా ప్రచారం జరిగేలా ఆమె అందం ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈమధ్య కాలంలో తెలుగులో కాస్త ఆఫర్లు తగ్గడంతో తమిళ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యే ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈమధ్య తమిళ్, హిందీలో వరుసగా ఆఫర్లు దక్కుతున్నాయి. తెలుగులో ఈమె చివరగా థాంక్యూ



లో నాగ చైతన్యతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాశి ఖన్నా తెలుగు వెండి తెరపై కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్‌లో మాత్రం చాలానే సినిమాల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాతో రాశి ఖన్నా మళ్లీ టాలీవుడ్‌లో బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను ఈ అమ్మడు షేర్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి రాశి ఖన్నా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రీన్ కలర్ చీరలో స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి నడుము అందం చూపిస్తూ కన్నుల విందు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా, వయసు మూడు పదులకు చేరిన రాశి ఖన్నా మాత్రం ఇంకా 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా అందమైన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంతటి అందంకు టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కక పోవడం విడ్డూరంగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి. రాశి ఖన్నా ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే హిందీలో ఒక సినిమాకు కమిట్ అయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536